

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 2-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 236 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి ఉ.7:32, ద్వాదశి తె.5:07 వరకు, నక్షత్రం: పూర్వాభాద్ర సా.5:04 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.1:52-3:20, దుర్ముహూర్తం: సా.4:08-4:54, అమృతఘడియలు: ఉ.9:29-11:00, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:17, సూర్యాస్తమయం: 5:39 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో మృతదేహాలు, గాయపడిన వారు, కుటుంబ సభ్యుల రోదనలు

పవిత్రమైన కార్తీక మాసం... అందులోనూ శనివారం... వెంకన్నను దర్శించుకుంటే మంచి దనే ఒక నమ్మకం! తండోపతండాలుగా జనం తరలి వచ్చారు! నియంత్రించే వారు లేరు! స్వీయ నియంత్రణా లేదు! ఫలితం... పెను విషాదం! తొక్కిసలాటలో తొమ్మిది నిండు ప్రాణాలు బలి! వీరిలో ఎనిమిది మంది మహిళలే! శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘోరమిది!

అయ్యో.. దేవుడా!

గుడిలో తొక్కిసలాట.. 9 మంది దుర్మరణం

దైవ దర్శనంలో పెను విషాదం

- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ప్రైవేటు ఆలయం
- కార్తీక శనివారం రోజు పోటెత్తిన భక్తులు
- మొదటి అంతస్తులో గర్భగుడి
- వచ్చిపోయేందుకు ఒకటే మెట్లదారి
- పరిస్థితి అదుపు తప్పి తోపులాట
- రెయిలింగ్ ఊడిపోవడంతో కింద పడిన జనం
- వారిని తొక్కుకుంటూ వెళ్లిన మరికొందరు

- వలంటీర్లు లేరు, నియంత్రణా లేదు
- పోలీసు బందోబస్తూ కోరలేదు
- మృతుల్లో ఎనిమిది మంది మహిళలే
- కాశీబుగ్గకు హుటాహుటిన లోకేశ్, రామ్మోహన్ నాయుడు
- విచారణ జరిపిస్తామని ప్రభుత్వ ప్రకటన
- సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రుల విచారం

శ్రీకాకుళం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుణ్యం కోసం దైవ దర్శనానికి వెళ్లిన వారిని మృత్యువు పలకరించింది. తొక్కిసలాట రూపంలో మరణం వెంటాడింది. తొమ్మిది మంది అక్కడికక్కడే మరణించగా... మరో 17 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో 8 మంది మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. మరణించిన వారంతా శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే. పలాస నియోజకవర్గంలో కాశీబుగ్గలోని శ్రీనివాసనగర్‌లో హరి ముకుంద పండా అనే వ్యక్తి సొంతంగా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఏడాదిన్నర క్రితం నిర్మించారు. స్థానికులు ఈ ఆలయాన్ని

మిగతా 13వ పేజీలో...



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న లోకేశ్, రామ్మోహన్ నాయుడు, అనిత, పల్లా

నిర్మాణ లోపం.. నిర్వాహకుల వైఫల్యం

- విషాదానికి ఇదే కారణం: లోకేశ్
- మృతుల కుటుంబాలకు 15 లక్షలు
- కేంద్రం నుంచి మరో 2 లక్షలు
- క్షతగాత్రులకు రూ.3.5 లక్షలు

13

భక్తులకు భద్రతేదీ!

ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న భక్తులు

రాష్ట్రంలో ఏడాదిలోపే మూడు దుర్ఘటనలు

నార్సిసిస్టిక్.. జగన్!



..జగన్ రెడ్డి ప్రవర్తన చూసిన వారికి వింతగా ఉంటుంది. దీన్ని లోతుగా అధ్యయనం చేస్తే ఆయన 'నార్సిసిస్టిక్ డిజార్డర్' అనే మానసిక సమస్యతో బాధపడుతున్నట్టు స్పష్టమవుతుంది. అంతర్జాతీయంగా పేరొందిన అమెరికాలోని మయో క్లినిక్ ఈ వ్యాధి ఉన్న వారిలో కనిపించే లక్షణాలను స్పష్టంగా నిర్వచించింది.

..నిన్నగాక మొన్న వైద్య కళాశాలలను పీపీపీ మోడల్లో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శిస్తూ... అధికారంలో ఉన్నప్పుడు తాము నిర్మించిన వైద్య కళాశాల భవనాలను చూసిన వారంతా 'ఆహా' అని మెచ్చుకోవాలని, తనకు శాలువాలు కప్పి సత్కరించాలని చెప్పుకొచ్చారు. ఇది కూడా సదరు మానసిక సమస్యతో బాధపడుతున్న వారిలో కలిగే భావనే.

..జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారే ప్రకృతి విపత్తు సంభవించింది. అప్పుడు ఆయన పెద్దగా హైరానా పడలేదు. 'నేను ప్రార్థన బాగా చేస్తాను. అయినా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే మనం ఏం చేయగలం? జరిగేది ఏదో జరుగుతుంది' అని నిర్వేదంగా వ్యాఖ్యానించారు.

..తుఫాను సమయంలో ప్రభుత్వ సిబ్బంది నిద్రాహారాలు మాని మరీ పునరుద్ధరణ పనులు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించాలి. ప్రజాభిప్రాయం ఇలా ఉండగా... ముఖ్యమంత్రిని విమర్శించడం, ప్రకృతి విపత్తుకు చంద్రబాబే కారణమని జగన్ నిందించడం వింతగా ఉంది.

కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 4లో..



ఆట అదరాలి.. కప్పు కొట్టాలి

- దక్షిణాఫ్రికాతో భారత్ అమీతుమీ
- మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ నేడే

చివరిసారిగా 2017లో మిథాలీ సారథ్యంలో వన్డే ప్రపంచకప్ ఫైనల్ చేరాం.. కానీ రన్నరప్‌కే పరిమితమయ్యాం! ఆ తర్వాత మరోసారి ప్రయత్నించాం.. సెమీస్ కూడా చేరకుండా గ్రూప్ దశలోనే వెనుదిరిగాం!!


కానీ, ఇప్పుడో అద్భుత అవకాశం వచ్చింది.. అందినట్లే అంది చేజారుతున్న విశ్వకిరీటాన్ని దక్కించుకునేందుకు మన మహిళలు వేయాల్సింది ఇంకొక్క అడుగే!

ఈ అంతిమ సమరంలో అమ్మాయిలూ అదరగొట్టండి.. కప్పు పట్టేయండి!!

10

'మిట్టల్ స్టీల్'కు లైన్ క్లియర్!

కర్మాగార నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులు



- నక్కపల్లిలో లక్షన్నర కోట్ల భారీ స్టీల్ ప్లాంట్
- విశాఖ స్టీల్ ప్లాంట్ పక్కనే మరో భారీ ఉక్కు కర్మాగారం
- లోకేశ్ చొరవ.. మోదీ సహకారంతో సాకారం
- ఈ నెల 14న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు
- తొలిరోజే భూమి పూజ

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో భారీ ఉక్కు పరిశ్రమ స్థాపనకు ప్రధాన అవరోధాలన్నీ తొలగిపోయాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో లక్షన్నర కోట్ల పెట్టుబడితో ఏటా 8.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 'ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్'కు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈఏసీ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇంతకాలం స్టీల్ ప్లాంట్ అంటే విశాఖలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ మాత్రమే ల్యాండ్ మార్క్‌గా

మిగతా 12వ పేజీలో...

'పోలవరం'లో పండగ

- నిర్వాసితులకు నిధుల జమ మొదలు
- 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తి
- ఆరు నెలలు ముందే పునరావాసం: నిమ్మల

2

21 మంది ఐపీఎస్‌ల బదిలీ

- విశాఖ డీసీపీగా మణికంఠ
- బెజవాడకు కృష్ణకాంత్ పటేల్
- ట్రాఫిక్ డీసీపీగా షేక్ షరీన్ బేగమ్
- ఎన్టీఆర్ రూరల్ డీసీపీగా లక్ష్మీనారాయణ
- వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులకు పోస్టింగ్‌లు

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పలువురు అధికారులకు తాజాగా పోస్టింగ్‌లు లభించగా, మరికొందరు బదిలీ అయ్యారు. ఇటీవల బదిలీ అయిన ఐపీఎస్ అధికారులు మణికంఠ చందోలు, కృష్ణకాంత్ పటేల్‌కు విశాఖపట్నం, విజయవాడలలో శాంతిభద్రతల డీసీపీలుగా పోస్టింగ్‌లు లభించాయి. మరికొందరికి ఏసీబీ, సీఐడీ, ఏపీఎస్పీ బెటాలియన్లలో పోస్టింగ్‌లు ఇస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐపీఎస్ పోస్టింగ్‌ల వివరాలు.. 11లో

పన్నులు తగ్గినా.. పెరిగిన వసూళ్లు

- అక్టోబరులో పెరిగిన జీఎస్టీ
- కలిసొచ్చిన దసరా, దీపావళి
- నికర జీఎస్టీ 3,021 కోట్లు..
- 'గత ఏడాది' కంటే 8.77% ఎక్కువ

2



శ్రీసత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో రెడ్డెమ్మకు వితంతు పింఛన్ ఇస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నేను కూడా పథకాల కోసం బటన్ నొక్కవచ్చు. ఇంట్లో కూర్చోవచ్చు. పరదాలు కట్టుకుని రావొచ్చు. కానీ ప్రజాసేవలో ప్రజల మనిషిగా ఉండాలనే ఉద్దేశంతోనే మీ ముందుకొస్తున్నా. మీ ఇంటికొస్తున్నా. మీ చేతికి నేరుగా పింఛన్ ఇస్తున్నా. మునుపటి పరిపాలనకు... మా పరిపాలనకు ఇదీ వ్యత్యాసం. - సీఎం చంద్రబాబు

వాళ్లది రక్తపాతం.. మాది జలపాతం

సుపరిపాలనకు సహకరించండి

- ఐదేళ్ల విధ్వంసకర పాలనను గాడిలో పెడుతున్నాం
- దేన్నైనా వాయిదావేస్తా.. పింఛన్లను మాత్రం ఆపను
- వైసీపీ ఫేక్ పార్టీ.. తప్పుచేసినోళ్లు తప్పించుకోలేరు
- టెక్నాలజీ సాయంతో తుఫాన్‌ను ఎదుర్కొన్నాం
- నాడు టెలికాం విప్లవం తెచ్చా.. నేడు నాది ఏఐ బాట
- ఇప్పటికే రాష్ట్రానికి 10 లక్షల కోట్ల పెట్టుబడులు
- రాయలసీమకు రాబోయే కాలంలో మరిన్ని కంపెనీలు
- సత్యసాయి ఉత్సవాలు ఘనంగా జరిపిస్తాం
- సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లి ప్రజావేదికలో సీఎం
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ల పంపిణీ

అనంతపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలంటూ ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. "గుజరాత్‌లో ఒకే పార్టీ ప్రభుత్వం 25 ఏళ్లుగా అధికారంలో ఉంది. అందుకే అక్కడ అభివృద్ధి సజావుగా సాగుతోంది. మన రాష్ట్రంలో నేను సీఎంగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఐదేళ్లపాటు ధ్వంసమైన వ్యవస్థలను మేమిప్పుడు గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నాం' అని వివరించారు. సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా.. శ్రీసత్యసాయి జిల్లా

మిగతా 12వ పేజీలో...

కలిసి పనిచేసి కష్టాన్ని ఎదుర్కొన్నాం!

- ఇదే స్ఫూర్తితో విపత్తులను ఎదుర్కొందాం
- అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు అద్భుతం
- సాంకేతికతను వినియోగించి 'మొంథా' నష్టాన్ని తగ్గించాం
- తుఫాను ఫైటర్లందరికీ ధన్యవాదాలు: చంద్రబాబు
- 137 మందికి మెమొంటోలు, ప్రశంసా పత్రాల అందజేత



నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు

- నాపై ఒత్తిడి చేయడానికి ప్రయత్నించారు
- న్యాయమూర్తుల కుటుంబాలపైనా రాజకీయ కుట్రలు
- అమరావతి రైతుల పోరాటం స్ఫూర్తిదాయకం
- వీఐటీ ఐదేళ్లు పోరాడి అమరావతిలో సంస్థను నిలబెట్టింది
- వీఐటీ స్నాతకోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ

2



వాన్స్, ఉష బంధానికి బీటలు?

- అమెరికాలో పెద్ద ఎత్తున ఊహాగానాలు
- ఉష క్రైస్తవంలోకి రావాలంటూ ఇటీవల జేడీ వాన్స్ వ్యాఖ్యలు
- అదే వేదికపై ఎరికా కిర్క్‌తో గాఢాలింగనం

14





14

ఎగిరే కారును తెచ్చేస్తున్నా

ఈ ఏడాదిలోనే డెమో చూపిస్తా.. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ప్రకటన

కేరళకు మరో ఖ్యాతి

అత్యంత పేదరికాన్ని రూపుమాపిన రాష్ట్రంగా రికార్డు.. అసెంబ్లీలో సీఎం విజయన్ ప్రకటన



షార్‌లో 'భారీ' ప్రయోగం

- 4,410 కిలోల అత్యంత బరువైన సీఎంఎస్-3 ఉపగ్రహం నేడు కక్ష్యలోకి
- 'బాహుబలి' రాకెట్ ద్వారా చేర్చనున్న ఇస్రో
- మెరుగుపడనున్న డిజిటల్, కనెక్టివిటీ సేవలు
- నేటి సాయంత్రం 5.26 గంటలకు ప్రయోగం
- శ్రీహరికోటలో మొదలైన కౌంట్‌డౌన్



ప్రయోగ వేదికపై ఎల్వీ ఎం3-ఎం5 రాకెట్

14



అమరావతిలో జరిగిన వీఐటీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్వీ రమణ

నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు

- నాపై ఒత్తిడి చేయడానికి ప్రయత్నించారు
- న్యాయమూర్తుల కుటుంబాలపైనా రాజకీయ కుట్రలు
- వీఐటీ స్నాతకోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ

తుళ్లూరు/తాడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): "మీ అందరికీ తెలుసు.. నా కుటుంబాన్ని ఎలా లక్ష్యంగా చేసుకున్నారో.. వారిపై క్రిమినల్ కేసులు పెట్టారు. నాపై ఒత్తిడి చేయడానికి ప్రయత్నించారు. రాజ్యాంగ సూత్రాలను సమర్థించిన న్యాయవ్యవస్థ సభ్యులు బదిలీలు, ఒత్తిడిని ఎదుర్కొన్నారు. న్యాయమూర్తుల కుటుంబాలు రాజకీయ కుట్రలకు లక్ష్యంగా మారాయి. దక్షిణ భారత దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అతిపెద్ద ఉద్యమం అమరావతి రైతుల పోరాటం. అధికారం మారినప్పుడల్లా విధానాలకు అంతరాయం కలిగించడం తప్పు. అది అభివృద్ధిని కుంగదీస్తుంది. దేశంలో చట్టబద్ధమైన పాలన ఉన్నప్పుడే అభివృద్ధి జరుగుతుంది" అని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. శనివారం రాజధాని అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొని ప్రసంగించారు. "ప్రభుత్వాలు మారవచ్చు. కానీ కోర్టులు, చట్టపాలన స్థిరత్వానికి నిలువెత్తు నిదర్శనం. ప్రజాస్వామ్యం నిజమైన శక్తి పాలకులలో లేదు. పౌరుల నైతిక దృఢత్వంలో ఉంది. ఐదేళ్లు పోరాడి వివిధ సవాళ్లను ఎదుర్కొని ఇక్కడ సంస్థను నిలబెట్టిన వీఐటీ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను. వీఐటీ వంటి అనేక సంస్థలు క్లిష్ట సమయంలో నిలదొక్కుకున్నాయి. వీఐటీ సంస్థను స్థాపించినందుకు తెలుగు ప్రజల తరఫున యాజమాన్యానికి ధన్యవాదాలు" అని అన్నారు.

విధ్వంసక విధానాలకు అమరావతి ఉదాహరణ

"అమరావతి అనుభవించిన గాయం విధ్వంసక విధానాలకు సజీవ ఉదాహరణ. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, రాజధాని కోసం రైతులు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. మహాకవి శ్రీశ్రీ రచించిన 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అనే కవితకు అమరావతి రైతుల త్యాగాలు ప్రతీక. రైతుల పోరాటాల ఆధారంగానే రాజధాని మనుగడ ఉన్నది. రైతులు ఎన్నో కష్టనష్టాలు పడ్డారు. కొంతమంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. రైతులు ఐదేళ్లు పోరాటాన్ని కొనసాగించారు. రైతుల సహనం, క్రమశిక్షణ, ఓర్పుతోనే రాజధాని సాధ్యమైంది. రైతుల పోరాటం నుంచి నేను చాలా ప్రేరణ పొందాను. న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య ప్రక్రియపై నమ్మకాన్ని ఉంచిన రైతులకు ధన్యవాదాలు. వీధుల నుంచి కోర్టు వరకు ఉద్యమం ఊపందుకోవడంలో దేశ పౌరులు, న్యాయవాదులు అందించిన సహకారాన్ని గుర్తుంచుకోవాలి. పాలనలో ప్రతీకారానికి అధికార వ్యవస్థను ఉపయోగించకూడదని నేనిచ్చిన ఒక తీర్పులో హెచ్చరించాను" అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

సోషల్ మీడియాకు బానిసలైతే ఇబ్బందులు

"రాజకీయాల్లోనూ, సామాజిక ఉద్యమాల్లోనూ యువత చురుగ్గా పాల్గొనాలి. లేకపోతే దేశాన్ని నిజాయతీ లేని, స్వార్థపరులైన పాలకులు పాలిస్తారు. యువత చేతుల్లోనే భవిష్యత్ ఉంది. కొత్త సందేశాలు, ఈ-మెయిల్‌లు, వార్తలు, నోటిఫికేషన్లు, లైక్‌ల కోసం ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి ఫోన్లు చూసుకోవడానికి పరిమితమవుతున్నారు. సోషల్ మీడియాకు బానిసలైన వ్యక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిజమైన సృజనాత్మకత కేంద్రీకృత మనస్సు నుంచి వస్తుంది. మనసుకు కొంత విశ్రాంతి లభించేలా స్క్రీన్‌లను మితంగా ఉపయోగించాలి" అని జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. అనంతరం పీహెచ్‌డీ, పీజీ, డిగ్రీలు, గోల్డ్‌మెడల్స్ సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ వ్యవస్థాపకుడు-చాన్స్‌లర్ డాక్టర్ జీ విశ్వనాథన్, బెంగళూరు శ్యామ్సంగ్ ఎలక్ట్రానిక్స్ సీనియర్ డైరెక్టర్ రాజీవ్‌వర్మ, వీఐటీ వైస్ ప్రెసిడెంట్‌లు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీసెల్వం, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీకోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్‌చంద్ర ముదిగంటి, డీన్ డాక్టర్ ఎన్ మధుసూదనరావు, స్టూడెంట్స్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్‌పాషా పాల్గొన్నారు.

పన్నులు తగ్గినా.. పెరిగిన వసూళ్లు

అక్టోబరులో పెరిగిన జీఎస్టీ.. కలిసొచ్చిన దసరా, దీపావళి

నికర జీఎస్టీ 3,021 కోట్లు.. గత అక్టోబరులో కంటే 8.77% ఎక్కువ

సంస్కరణలతో ఆదాయం తగ్గుతుందన్న అంచనాలు తారుమారు



అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలు అమల్లోకి వచ్చాక నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గినప్పటికీ అక్టోబరు నెలలో రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. నికర జీఎస్టీ రూ.3,021 కోట్లకు పెరిగింది. జీఎస్టీ 2.0 వల్ల రాష్ట్రానికి ఏడాదికి రూ.8,000 కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. అసెంబ్లీలో కూడా ప్రకటించింది. కానీ అంచనాలు తారుమారయ్యాయి. సంస్కరణలు అమల్లోకి వచ్చిన మొదటి నెలలోనే నికర జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. ప్రధాన పండగలైన దసరా, దీపావళి రావడం వల్ల కొనుగోళ్లు పెరగడమే దీనికి కారణం. దీంతో పాటు ప్రభుత్వ నిర్ణయాలు కూడా జీఎస్టీ పెరుగుదలకు దోహదపడ్డాయని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టులో రూ.2,977 కోట్ల నికర జీఎస్టీ వసూలు కాగా, సెప్టెంబరులో ఈ వసూళ్లు రూ.2790 కోట్లకు పడిపోయాయి. సెప్టెంబరు 22 నుంచే సంస్కరణలు అమల్లోకి రావడంతో ఆ నెల వసూళ్లపై వీటి ప్రభావం అంతగా లేకపోయినప్పటికీ ఆ నెల ఆదాయం తగ్గిపోయింది. కానీ ఇప్పుడు అక్టోబరు నెల మొత్తం తగ్గిన జీఎస్టీ శ్లాబు రేట్లే అమల్లో ఉన్నప్పటికీ నికర జీఎస్టీ రూ.3,021 కోట్లకు పెరిగింది. గత ఏడాది అక్టోబరులో వసూలైన నికర జీఎస్టీ కంటే ఇది 8.77 శాతం అధికం. అక్టోబరులో స్థూల జీఎస్టీ రూ.3,490 కోట్లు వసూలైంది. గత ఏడాది కంటే ఇది 2.54 శాతం అధికం. ఎస్‌జీఎస్టీ వసూళ్లు గత ఏడాది కంటే 16.2 శాతం పెరిగి రూ.1,247 కోట్లకు చేరుకున్నాయి. ఐజీఎస్టీ సెటిల్మెంట్ 10.65 శాతం పెరిగి రూ.1,773 కోట్లకు పెరిగాయి. పెట్రోలియం వ్యాట్ ఆదాయం 7.88 శాతం పెరిగి రూ.1,282 కోట్లకు చేరుకుంది. వృత్తి పన్ను 18.26 శాతం పెరిగింది. జీఎస్టీ పరిధిలోకి రాని విభాగాల ఆదాయంతో కలిపి అక్టోబరులో మొత్తం రూ.4,458 కోట్ల పన్నులు వసూలయ్యాయి. గత ఏడాది అక్టోబరులో వసూలైన రూ.4,126 కోట్ల కంటే ఇది 8 శాతం ఎక్కువ. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు మొత్తం పన్నులు రూ.31,144 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది అదే సమయంలో రూ.29,499 కోట్లు మాత్రమే వచ్చాయి.

'పోలవరం'లో పండగ

నిర్వాసితులకు నిధుల జమ మొదలు.. ప్రాజెక్టు పూర్తికి ముందే పునరావాసం: నిమ్మల

- రాష్ట్రానికి పట్టిన శని జగన్
- పోలవరం విధ్వంసం: మంత్రి నిమ్మల
- వేలేరుపాడులో నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ



చెక్కును అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు

ఏలూరు/వేలేరుపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. దానికి ఆరు నెలల ముందే పునరావాసం, కాలనీల నిర్మాణం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది' అని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పోలవరం భూసేకరణ - పునరావాసం నిమిత్తం కేంద్రం రూ.1,000 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా వేలేరుపాడులో నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆయన లబ్ధిదారులతో కలసి పాలాభిషేకం చేశారు. సభ ప్రారంభమైన గంటలోనే నిర్వాసితుల ఖాతాల్లో రూ.45 కోట్లు జమ అయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'ఈ ఏడాది జనవరి 3న రూ.900 కోట్లు పరిహారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. 2016లో తొలి విడతగా రూ.700 కోట్లు జమ చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన 18 నెలల కాలంలోనే రెండో విడతగా నిధులు జమ చేశాం. 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు పరిహారం, ఇతర కాలనీల నిర్మాణాన్ని జూన్ 2026కు పూర్తి చేస్తాం. ఇళ్ల నిర్మాణానికి రూ.739 కోట్లతో టెండర్లు పూర్తి అయ్యాయి. డిసెంబరులో పనులు ప్రారంభం అవుతాయి. వైసీపీ హయాంలో 2022 నుంచి అటకెక్కించిన భూసేకరణను ఒక కొలిక్కి తీసుకొస్తున్నాం. 17,114 కుటుంబాలకు సంబంధించిన భూసేకరణ, పునరావాస పరిహారాన్ని 2026 డిసెంబరు నాటికి అందించి తీరుతాం. రెండో విడత పరిహారంపై మరింత దృష్టి సారిస్తాం. పోలవరం 45.72 మీటర్ల కాంటూరు పరిధిలో 67,622 ఎకరాలకు గాను 29,729 ఎకరాలు భూసేకరణ చేయడంతో 44 శాతం పూర్తి అయ్యింది. ప్రస్తుతం 79 నిర్వాసిత కాలనీలకు గాను ఈ ప్రాంతంలో 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయి. సమాంతరంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం' అని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టుకు కలిగిన నష్టాన్ని వివరించారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్మోహన్ రెడ్డి అంటూ మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశారంటూ విమర్శించారు. 'పరిహారాల చెల్లింపులో అవరోధాలు ఏర్పడితే వాటిని పరిష్కరించే విధంగా ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబరు ఇస్తాం. పరిహారం రాని నిర్వాసితులు ఈ గ్రీవెన్ సెల్‌లో దరఖాస్తు చేసుకుంటే దాన్ని ఆన్‌లైన్ చేసి 20 రోజుల్లోగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి నిమ్మల ప్రకటించారు. కార్యక్రమంలో పోలవరం, రంపచోడవరం ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, శిరీషాదేవి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ప్రశాంతి, ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ, పోలవరం ఈఎన్‌సీ నర్సింహమూర్తి, సలహాదారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాతాల్లో సొమ్ము జమ.. నిర్వాసితుల ఆనందం

ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన పరిహారం సొమ్ములు జమ కాని నిర్వాసితులకు శనివారం సాయంత్రం నుంచి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, గృహనష్ట పరిహారాలు జమ అవుతున్నాయి. వేలేరుపాడు మండలంతో పాటు కుక్కునూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం, వరరామచంద్రాపురం, దేవీపట్నం మండలాల్లోని నిర్వాసితుల ఖాతాలకు పరిహారాల సొమ్ము జమవుతోంది.

ఎంతో ఆనందంగా ఉంది



జనవరిలో పోలవరం పరిహారం ఖాతాలో పడకపోవడంతో పరిహారం వస్తుందా..? రాదా..? అని ఆందోళన చెందాను. ఈ రోజు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, గృహ నిర్మాణానికి సంబంధించి పరిహారం జమ కావడం ఎంతో ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- సజ్జల సుబ్బులమ్మ, వేలేరుపాడు

హామీ ఇచ్చిన గంటల్లోనే సొమ్ము జమ



మంత్రి నిమ్మల హామీ ఇచ్చిన కొద్ది గంటల్లోనే పోలవరం పరిహారం ఖాతాలో జమ కావడం ఆనందంగా ఉంది. ఇంత కాలం పరిహారం కోసం ఎదురు చూసిన నాకు ఈ రోజు పరిహారం జమ అయింది.

\- బీరం రామాంజనేయులు, వేలేరుపాడు

దుర్గగుడిలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు రాచమర్యాదలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఉద్యోగులు రాచమర్యాదలు చేయడంనిపై విమర్శలు వస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి శుక్రవారం అనంతబాబు వచ్చారు. దేవస్థానం ఉద్యోగులు ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తరువాత ఉద్యోగులు ఎమ్మెల్సీని చైర్మన్ చాంబర్‌లోకి తీసుకెళ్లి రాచమర్యాదలు చేశారు. చైర్మన్ కానీ, పాలక మండలి సభ్యులు కానీ చాంబర్‌లో లేనప్పుడు అనంతబాబును ఎలా తీసుకెళ్తారని పలువురు విమర్శించారు. విషయం తెలుసుకున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ చాంబర్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి సమాచారాన్ని తమకు తెలియపరచాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో పొడి వాతావరణం

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. దీనికితోడు బంగాళాఖాతం నుంచి తేమగాలులు కూడా వీయడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2, 3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అక్కడక్కడ వర్షాలు కురిశాయి. శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో రాత్రిపూట చలి పెరుగుతోంది. రానున్న రెండురోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, దక్షిణ మయన్మార్, ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతుంది. దీని ప్రభావంతో ఆదివారం నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత బలపడి బంగ్లాదేశ్ వైపు పయనిస్తుందని అంచనా వేస్తున్నారు. కాగా, దక్షిణ కోస్తా జిల్లాల్లో కొన్నిచోట్ల ఆదివారం పిడుగులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కృష్ణానదికి మరికొన్ని రోజులు వరద ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందన్నారు.



వరుడు కావలెను



★ ఆర్యవైశ్య/21y&23y&25y&27y&29y&31y&33y&35y&37y&39y&41y&43y&45y&47y&49y&51y&53y&55y&57y&59y.జి. సుప్రజాగుప్త "మాసేవ" (Since 1998) : PH: 9291503949 AJH-15544

★ 58y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT ఫ్యామిలీ పెన్షనర్/ సొంత ఇల్లు రెంట్స్/ పిల్లలు లేరు / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-15544

★ 58y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT JOB పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ ప్రాపర్టీ / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-15544

★ వైశ్య / 48y / రెండవ పెళ్ళి / విడో / GOVT ఫ్యామిలీ పెన్షనర్/ సొంత ఇల్లు రెంట్స్/ పిల్లలు లేరు / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 8125076013 AJH-15544

★ రెడ్డి / విడో / 45y/ కుల పట్టింపు లేదు / GOVT. JOB / మంచి ప్రాపర్టీస్ / సొంత ఇల్లు గల అందమయిన వధువుకి వరుడు కవలెను / అన్ని వయస్సులు వారికి 1ST & 2ND మ్యారేజ్లు మావద్ద కలవు. ఫోన్ : 8143226625 AJH-15545

★ రెడ్డి / విడో / కుల ఆస్తి పట్టింపు లేదు /వయస్సు 35y/ Qly: Degree, PVT. JOB / గల అందమైన వధువుకి వరుడు కావలెను ఫోన్ నం : 8074131208 AJH-15545

★ 2వ పెళ్లి, CNB, వైశ్య, 54 / ఎత్తు 5.5 / BHMS/ డాక్టర్ / మంచి జీతం/ కోట్ల స్థిరాస్తులు, 20ఎకరాలు పంట పొలాలు, విల్లాలు గల అందమైన వధుకికి మంచి వరుడు కావలెను. ఫోన్: 6304448107 AJH-15545

★ రెడ్డి 2ND (కుల-ఆస్తి) పట్టింపు లేదు / AGE: 32, Q: Pharmacy / సొంత ఇల్లు బిజినెస్ & మంచి ప్రాపర్టీస్ / గల వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సులు వారికి 1ST లేదా 2వ సంబంధాలు కలవు. ఫోన్ : 9704782370 AJH-15545

★ బ్రాహ్మణ / 35 / 5.3 / Degree / Pvt Job అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పౌరోహితం వరుడు కావలెను. Ph: 9701743336 AJH-15545

★ పద్మశాలి / B.Tech / Govt. Bank Asst Manager /. మంచి జీతము / 5'5" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 9398524192 AJH-15545

★ వడ్డెర / MBA / Govt. Jr.Asst. డిస్ట్రిక్ ఆడిట్ డిపార్ట్మెంట్ / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618008271 AJH-15542

★ యాదవ / BSC / Govt. HO / హార్టికల్చర్ Dept / 5'5" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15542

★ SC మాదిగ / B.Tech / C.Govt. బ్యాంక్ P.o/ పంజాబ్ నేషనల్ బ్యాంక్ / మంచి జీతం / 5'2" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15542

★ 2వ పెళ్లి / కుల ప్రసక్తి లేదు / B.Tech MBA/ సేల్స్ మేనేజర్ / IT మంచి జీతం/ వైశ్య, / ఎత్తు 5.4 / 37సం.ల అందమైన వధుకికి వరుడు కావలెను. ఫోన్: 9963757612 AJH-15542

★ మంచి ఆస్తి 35 సం.లు వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. అన్ని సంబంధాలు 1వ, 2వ Govt. ఎంప్లాయ్, పెన్షనర్స్ సంబంధాలు కలవు, స్త్రీలకు ఫ్రీ సర్వీస్, ఫాస్ట్ సెటిల్మెంట్ ఫోన్: 6281147818 AJH-003443

★ 45/ సెకండ్ మ్యారేజ్ వధువునకు తగిన ఆంధ్రప్రదేశ్ కి చెందిన వరుడు కావలెను (నో బ్రోకర్స్) ఫోన్ నం.: 9160826515 AJH-003443

★ బ్రాహ్మణ వధువు / 26 Age / Study: 10th Class / Father Pvt Job & Mother House Wife, One Sister Married No Brothers, పౌరోహితం Also OK. శాఖ పట్టింపు లేదు. Ph: 8121031369 AJH-2654

★ రెడ్డి, కాపు, బలిజ / 10 to డిగ్రీ / వయస్సు 25 to 40 సం.లు /1వ మ్యారేజ్, 2వ మ్యారేజ్ కొరకు ఆంధ్ర, తెలంగాణ. సంప్రదాయ కుటుంబ వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ ఆచారులు, వైశ్యబ్రాహ్మిన్స్, నాయి బ్రాహ్మిన్స్ / మొదటి సంబంధం / వయస్సు 26 to 36 సం.లు/ 10 to డిగ్రీ ఉన్న అమ్మాయిలకు వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ పద్మశాలి, పట్టుశాలి, దేవాంగ, లింగాయతులు / 1వ మ్యారేజ్ / సొంత ఇల్లు / 10 to డిగ్రీ / వయస్సు 25 to 35 సం.లు/ అమ్మాయిలకు వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ మున్నూరు కాపు, చౌదరి / మొదటి సంబంధం, రెండవ సంబంధం / వయస్సు 26 to 40 సం.లు సొంత ఇల్లు, వ్యాపారం, ఉన్న వారికి సంప్రదాయ కుటుంబ వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ కమ్మ - కుల ఆస్తి పట్టింపులేదు, వయస్సు 30, 5.5, మంచి రంగు, MBBS, సొంత క్లినిక్, 7 ఎకరాల భూమి, 2 ఇల్లు ఉన్న వధువుకి వరుడు కావలెను. ఏదైనా ఉద్యోగం లేదా వ్యాపారం అయిన సరే అర్జంట్ మ్యాచ్ వాట్సాప్ నెం: 9160373010 AJG-249443

★ యాదవ 33 Yrs., B.Tech. 5'.4" ప్రభుత్వ ఉద్యోగినికి (జీతం : 8 Lakhs P.A.) తగిన వరుడు కావలెను. డైరెక్ట్ : 79974 86067 AJT - 1772

వధువు కావలెను



★ Goa, Engineer, 5'-8", వధువు కావలెను. Exp: Orphan / First / wid / Div. Caste, Age No Bar, కట్నం లేదు. సంప్రదించండి: 6304751936 AJH-28217

★ Balaji Naidu / 32 years / Only Son / S.S.L.C Pass / Working in Private Company / Job / Own / House in Bangalore City / First Marriage Looking for suitable Girl From any Caste / any language / any state. Cont: 7760119455 AJH-15545

★ ముదిరాజ్ / కట్నప్రసక్తి లేదు / M.Tech / C. Govt /. అకౌంటెంట్ ఆఫీసర్ / ఇన కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9618007652 AJH-15545

★ కుల ప్రసక్తి లేని 49 సంవత్సరాల డాక్టర్‌కు ఏ బాదరాబందీలేని తగిన వధువు కావలెను. డైరెక్ట్ వాట్సాప్ సంప్ర: 7676805552 AJH-15544

★ SC మాల, ఏకైక కుమార్తె / B.Tech / Govt Asst / ఇంజనీర్ / జెన్‌కో / మంచి జీతం / 5'8" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-15542

★ యాదవ / కట్న ప్రసక్తి లేదు / B.Tech / C.Govt. Asst. ఇంజనీర్ / HPCL / మంచి జీతము / 5'7" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్: 6303439893 AJH-15542

★ రజక / కట్న ప్రసక్తి లేదు / M.Tech / C.Govt. ఇన్స్పెక్టర్ కస్టమ్స్ & GST / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9550166072 AJH-15542

★ పద్మశాలి / MSc / Agri / Govt. AEO / అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8297439565 AJH-15542

★ రాజులు / 44, 5'.5" Bsc / పెయిర్ మేనేజర్ / మంచి జీతము / హైదరాబాద్ / సొంత ఇల్లు గల వరునికి క్షత్రియ 1వ, 2వ బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి పద్మశాలి, 1వ వధువు కావలెను డైరెక్ట్: 8885861136 AJH-003443

★ మాల క్రిస్టియన్ సెకండ్ మ్యాచ్ వయసు 36 సంవత్సరాలు ఎత్తు 5/7 చదువు బిటెక్ నెలకు 80,000 జీతం వరుడికి వధువు కావలెను. ఫస్ట్ సెకండ్ క్రిస్టియన్ సంబంధాలు చూడబడును. సెల్: 7794911019 AJD:244477

★ కాపు కన్వర్టెడ్ క్రిస్టియన్ సెకండ్ మ్యాచ్ వయసు 34 సం॥లు ఎత్తు 5/5 చదువు బీటెక్ జీతం లక్ష రూపాయలు వరుడికి వధువు కావలెను. క్రిస్టియన్ సెకండ్ మ్యాచ్ సంబంధాలు చూడబడును. సెల్: 9676982230. AJD:244476

కళ్యాణ వేదిక

★ ఆర్యవైశ్య & ALL కొన్ని వేల ప్రొఫైల్స్ మా 1000 + వాలుగు గ్రూపులలో మీ ప్రొఫైల్ పెట్టి పెళ్లి కుదుర్చబడను. (1st & 2nd) Rs.2118/- లేదా Rs.518/- అడ్వాన్స్ కట్టి సంప్ర: RK మ్యారేజ్ కన్సల్టెన్సీ - 8332000801 AJH-15544

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 AJH-15544

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-15544

★ కమ్మ, సంబంధములు U.S, U.K, ఆస్ట్రేలియా, కెనడా మొదటి రెండవ సంబంధములు కలవు. 28Y డైవర్స్ 50cr, 26Y M.B.A 50 cr, 10cr, B.Tech 25Y 5cr, M.B.A, B.Tech 27Y అమ్మాయిలు కలరు. 200crs వరకు అబ్బాయిలు, అమ్మాయిలు కలరు. డాక్టర్స్, వ్యాపారస్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావలెను. డైవర్స్‌లు మా ప్రత్యేకత. కొడాలి మ్యారేజెస్, తాడేపల్లిగూడెం, సెల్: 99127 11669 AJN-242462

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921386, 9703618806, 9985921380.

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

★ వివాహాలు అందరికి సకాలంలో జరగాలని బాధ్యతతో అన్ని కులాల సంబంధాలను మంచి సర్వీస్‌తో చూస్తాము. స్వదేశీ, డాక్టర్, విదేశీ, వ్యాపార, అన్ని స్థాయిల Matches. ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ WhatsApp 6304826162 AJH-648

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-003473

★ స్వాతి పరిణయ మ్యారేజ్ బ్యూరో / కేవలం కమ్మ/చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. దండమూడి శ్రీనాథ్. ఫోన్ : 8019658575 / 8019658575 Whatsapp. AJH-003474

★ కాకతీయ మ్యారేజస్ వారి అన్ని బ్రాంచెస్‌లో పేదలకు ఫజులేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. ఫోన్ : 9391 999 999/ 709 3200 333 AJH-15543

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మ్యాట్రిమోని

The Ultimate Kamma's (ELITE MATCHES)

Ch: Prabhakar : 9100404026 RKR : 9100652122

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ : 1991/5:10/DM Medical Oncology/300 Crs. ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ Business Family నుండి వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1997/6 feet/B.Tech/ MS UK/500 Crs. ప్రాపర్టీ Indiaలో Settled/ Business వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1997/6 feet/ B.Tech/ Software/ 35 Lakshs P/A/ 100 Crs. ప్రాపర్టీ గల వరుడికి Software or Business వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1994/5.11/ M.S General Surgery/ 40 Crs ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5.10/ M.Tech/300 Crs. ప్రాపర్టీ Own Business గల వరుడికి తగిన Good Family నుండి వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1989/5.8/B.Tech MBA/ 40 Crs. ప్రాపర్టీ/డైవర్సీ Business వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1985/5.10/M.Tech/ 50 Crs. ప్రాపర్టీ/ Builder Own Construction/ డైవర్సీ గల వరుడికి 1వ 2వ వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1993/5.10/B.Tech/ MS USA/USD 200/ 50Crs. ప్రాపర్టీ/ గల వరుడికి India or USA వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5.11/M.S USA/ USD 180 100 Crs. Indiaలో Rental Income గల వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : డైవర్స్ 1990/6feet/ MBA 20 Crs/ Software Job గల వరుడికి తగిన 1వ 2వ వధువు కావలెను. Cont: 9100404026

వరుడు కావలెను

★ కమ్మ : 1999/5:6/B. Tech/100 Crs. ప్రాపర్టీ గల వధువుకు Software or Business Well Settled వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1996/5:7/B. Tech PGDM/ Software/ 36 Lakshs P/A/ 50 Crs ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1998/5:7/B.Com MBA/ Own Industry/ 50 Crs ప్రాపర్టీ గల వధువుకు Well Settled Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1992/5:4/MBA/ 36L/75 Crs ప్రాపర్టీ /Good Education Family గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1992/5:6/B. Arch / MS USA/ 3000 Crs ప్రాపర్టీ /India Settled గల వధువుకు Good Education వున్న వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5:4/11 M/Fair/ 5L Month/ 75 Crs ప్రాపర్టీ /Business గల వధువుకు Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : డైవర్సీ/1991/5:4/B.Tech/ 30L PA/ 20 Crs ప్రాపర్టీ గల వధువుకు Software or Business 1వ 2వ వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 2001/5:3/B.Tech/200 Crs/ Software Job గల వధువుకు తగిన Software or Business Well Settled వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1993/5:7/B.Arch/100 Crs ప్రాపర్టీ గల వధువుకు Job or Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1996/ 5:4/M.S. in Computers USA/ USD 200/100 Crs ప్రాపర్టీ గల వధువుకు India or USA వరుడు కావలెను. Cont: 9100404026

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com

EXCLUSIVE CHOWDARY COMMUNITY Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr. B.Tech MS 31 /20 Cr. B.Tech MS / 33 / 15 Cr. B.Tech MS / 37 / 70 Cr. B.Tech MS Citizen 28 / USA వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. B.Tech MS UK return 26 / 100 Cr. B.Tech MBA UK 30 / India వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Tech MS Sweedon / 10 Cr B.Tech MS UK / 9 Cr B.Tech Irland / 20 Cr. Australia B.Tech MS / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. MBBS MD GM 27 / Cr MS Orthopedics 34 / 20 Cr MBBS Pediatrics / 10 Cr MBBS Radiology వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr / MBBS PG USA 30 / 100 Cr. USA Citizen Doctor 29/27 USA Doctor వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr. B.Tech 28 LPA /30 B.Tech 5 Cr. 18 LPA / 7 Cr B.Tech 13 LPA 30 / 10 Cr B.Tech 80LPA 33 / వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 2వ పెళ్ళి / 34 B.Tech / MS USA 10 Cr / India Business 50 Cr, 42 / M.Tech 39 Bengalore 1.5 Cr PA Salary వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి / 20 Cr. B.Tech IIT Business 32/10 Cr MBA 12LPA 30 / 15 Cr. B.Tech 80LPA 40 /50 Cr B.Com Business 42 వరులకి తగిన వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizen Doctor 50 Cr / 20 Cr 28 USA Doctor / 30 Cr, 32 USA Doctor వరులకు వధువు కావలెను సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం (USA) : రెండో పెళ్ళి 34 B.Tech MS 20 Cr / 37 B.Tech MS 15 Cr / 20 Cr B.Tech MS 39 / 10 Cr B.Tech MS USA Citizen 45 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 38 MBBS PG Doctor / 28 MBBS ENT / 50 Cr MBBS MD Pediatrics / 10 Cr MBBS MD Pediatrics 25 / 28 MDS Vijayawada / 27 MBBS Gynaecology వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండోపెళ్ళి 500 Cr Bangalore 39 / 70 Cr MPharmacy Law 35 / 20 Cr B.Tech 34 / 100 Cr B.Tech 37 / 15 Cr B.Tech MS 38 వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 32 PG Doctor / 28 BA JD(LAW) / 23 B.Tech BCS / 28 BA Texas 70 Cr / USA Citizen వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 MBBS కార్డియాలజిస్ట్ / 28 MBBS జనరల్ మెడిసిన్ / 25 MBBS పెడియాట్రీషియన్ డాక్టర్ వధువులకు తగిన వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr BDS MS UK 28 / 10 Cr / B.Tech MS UK వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10Cr MTech IIIT 31 / 10 Cr BE 28 / 26 B.Tech 25 LPA / 27 B.Com CA Final / 28 MPharmacy / 25 BTech 30 / B.Tech వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం రెండవపెళ్ళి : 38 B.Tech MS India / 37 B.Tech MS USA / 38 B.Tech MS USA / 28 B.Tech MS UK 28 / B.Tech MS Australia వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 MDs Doctor / 29 MBBS PG Doctors / 32 LLB లాయర్స్ / 32 B.Tech IIIT Swe వధువుకి వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం USA : 10 Cr. B.Tech MS 38 / 20 Cr. B.Tech MS 35 / 20 Cr. Doctor 32 / B.Tech MS 25 / B.Tech MS 30 వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10Cr. USA 27 Doctor Pediatrics. 32 USA Citizen Doctor 20 Cr వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031



కర్నూలు జిల్లా కాల్వ బుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న శ్రీ విజయేంద్ర సరస్వతి

కాల్వబుగ్గలో కంచి పీఠాధిపతి

బుగ్గ రామేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని కాల్వబుగ్గ ఆలయాన్ని కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శనివారం దర్శించుకున్నారు. బుగ్గ రామేశ్వరుడికి రుద్రాభిషేకం, భ్రమరాంబకు కుంకుమార్చన పూజలు చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి రావడంతో ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విజయేంద్ర సరస్వతి స్వామీజీని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. భక్తులందరూ భక్తి, సేవాభావంతో హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేశారు.

రాయల కాలం నాటి శిలా శాసనాలు లభ్యం

ప్రొద్దుటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలో ఓ ఇంటి నిర్మాణం కోసం పునాదులు తీస్తుండగా రెండు శిలా శాసనాలు బయట పడ్డాయి. ఈ శిలాశాసనాలు శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటివిగా తెలుస్తోంది. వెన్నపూస భరత్‌రెడ్డి అనే వ్యక్తి ఈ శిలా శాసనాలను ఫేస్‌బుక్‌లో పెట్టారు. వాటిని కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో ఉన్న ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పరిశీలించి అందులో ఉన్న విషయాలను తెలియజేశారు. ఈ శిలా శాసనం శక 1444, చిత్రభాను మాఘ శుద్ధ 7న రాశారని, దీనిని చారిత్రక పద్ధతిలో వివరిస్తూ క్రీస్తు శకం 1523 సీ.శ జనవరి 24 శనివారంగా తెలియచేసింది. శ్రీకృష్ణ దేవరాయలు తన భార్య తిరుమల దేవి యోగ్యత కోసం కవులూరు గ్రామంలో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసినట్టు వెల్లడించారు. ఆలయ ప్రాకారం కోడి నిర్మాణంలో రికార్డు చేశారని తెలిపారు.



వెలుగుచూసిన శిలా శాసనాలు



జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ప్రసాదం అందజేస్తున్న చైర్మన్ రాధాకృష్ణ

దుర్గమ్మ సన్నిధిలో న్యాయమూర్తులు

విజయవాడ (ఇంద్రకీలాద్రి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బి.రాధాకృష్ణ, అర్చక స్వాములు, అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేయగా.. చైర్మన్ అమ్మవారి చిత్రపటం, లడ్డు ప్రసాదం, శేష వస్త్రం బహూకరించారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి: రాహుల్

న్యూఢిల్లీ/అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఎక్స్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది నిర్వాసితులయ్యారని, జీవనోపాధిని కోల్పోయారని అన్నారు.

తుఫాన్ నష్టంపై తప్పుడు అంచనాలు

- బంటుమిల్లిలో పంట పొలాలను పరిశీలించిన షర్మిల



బంటుమిల్లి మండలం సాతులూరులో పొలాన్ని పరిశీలిస్తున్న షర్మిల

కృత్తివెన్ను (కృష్ణాజిల్లా), నవంబరు1: మొంథా తుఫాన్ నష్టాన్ని అంచనా వేయటంలో ప్రభుత్వం విఫలమైందని పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం సాతులూరు రోడ్డు వద్ద దెబ్బతిన్న పంట పొలాలను శనివారం ఆమె పరిశీలించారు. రైతులు, స్థానికులతో మాట్లాడి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో రూ.800 కోట్లు మాత్రమే తుఫాన్ నష్టంగా ఉంది. కాంగ్రెస్ లెక్కల ప్రకారం రూ.20 వేల కోట్లకు పైబడే ఉందని భావిస్తున్నాం. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి. జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి. నష్టాన్ని కేంద్రమే భరించాలి. రైతులకు ఉచిత భీమా అమలు చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

పంట నష్టం జాబితాలపై అభ్యంతరాలు చెప్పొచ్చు

- ఇంకా నష్టం అంచనాలు నమోదు చేస్తాం: వ్యవసాయశాఖ

అమరావతి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రాష్ట్రవ్యాప్తంగా 1.38 లక్షల హెక్టార్లలో పంట ముంపునకు గురైనట్లు ప్రాథమిక అంచనా ఉండగా, శనివారం సాయంత్రం 6 గంటల వరకు 69 శాతం పంట నష్టం వివరాలు నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. 14 జిల్లాల్లో సామాజిక తనిఖీ పూర్తయ్యిందని వెల్లడించింది. 24 జిల్లాల్లో 391 మండలాల్లోని 3,553 గ్రామాల్లో 95,583 హెక్టార్లలో పంట నష్టం నమోదు పూర్తి చేసినట్లు తెలిపింది. పంట నష్టం అంచనా గడువు ముగియడంతో 'రైతుల్లో గడువు గుబులు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై వ్యవసాయశాఖ వివరణ ఇచ్చింది. రైతులు ఆందోళన చెందొద్దని, పంట నష్టం నమోదులో లేని వారు, రైతుసేవా కేంద్రంలో సంప్రదించి, వివరాలు అందించాలని కోరింది. ఇంకా నీరు తొలగించాల్సిన ప్రాంతాల్లోనూ నష్టం అంచనా వేస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో చెప్పారు.

రిలయన్స్ ఫౌండేషన్ కృషికి సీఎం ప్రశంస

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో ప్రజల ప్రాణాలు, పంటలను, చేపల వేటకు వెళ్లిన వారిని రక్షించడానికి రిలయన్స్ ఫౌండేషన్ చేసిన కృషిని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. తుఫాను సమయంలో పోరాట స్ఫూర్తిని కనబర్చిన వారిని శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. సుమారు 1.65 లక్షల మంది రైతులు, మత్స్యకారులకు నిర్దిష్ట సమాచారం అందించి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో రిలయన్స్ ఫౌండేషన్ కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

ఇద్దరు రిటైర్డ్ ఈఎన్‌సీల సేవలు కొనసాగింపు

జలవనరుల శాఖలో శుక్రవారం పదవీ విరమణ చేసిన ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు కె.నరసింహమూర్తి, ఎస్‌కే వెంకటాచార్యుల సేవలను మరో ఏడాది వినియోగించుకునేలా వారిని పునర్నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులిచ్చారు. శాఖ ప్రాజెక్టుల విభాగం ఈఎన్సీ నరసింహమూర్తి పోలవరం నిర్మాణ బాధ్యతలనూ పర్యవేక్షిస్తున్నారు. ఆయన రిటైర్ కాగా, కొత్త ఈఎన్సీని నియమిస్తే ప్రాజెక్టు పనుల్లో వేగం మందగిస్తుందని ప్రభుత్వం భావించింది.

ఉపాధి మెటీరియల్ నిధులు రూ.887 కోట్లు మంజూరు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు రూ.887 కోట్లు మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. నిధులు విడుదల కావడంతో ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు చెల్లించే అవకాశమేర్పడింది.

ఏకీకృత సెలవుల క్యాలండర్ తేవాలి: ఏపీ చాంబర్స్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు ప్రకటిస్తున్న సెలవులను హేతుబద్ధీకరించి, అన్ని శాఖలకూ వర్తించేలా ఏకీకృత సెలవుల క్యాలెండర్‌ను అమలులోకి తేవాలని ఏపీ చాంబర్స్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఉద్యోగులపై దాడిచేసిన జేసీపై చర్యలు తీసుకోవాలి

దళిత ఉద్యోగులను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన చిత్తూరు జాయింట్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏపీ వాణిజ్యపన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడుకె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఎం.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలోని సంఘ కార్యాయలంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి: రామకృష్ణ

తాడేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి. ఇతర కమ్యూనిస్టులతో కలిసి ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలి' అని సీపీఐ నేత కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో మాట్లాడతూ 'మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నాం. అణగారిన వర్గాల కోసం మావోయిస్టులు ఎన్నో కష్టనష్టాలు భరించారు. ప్రాణాలు త్యాగం చేశారు. వారికి మా సానుభూతి ఎప్పుడూ ఉంటుందని' అన్నారు.

సైబర్ గ్యాంగ్‌కు సంకెళ్లు

- 11 మందిని అరెస్టు చేసిన ఏలూరు పోలీసులు
- డిజిటల్ అరెస్టు పేరిట అంతర్జాతీయ ముఠా మోసాలు
- యూపీ నుంచి అమెరికా వరకూ వీరి నెట్‌వర్క్
- మ్యూల్ ఖాతాల నుంచి డిజిటల్ రూపంలోకి డబ్బు మార్పు
- డిజిటల్ అరెస్టే లేదు.. 1930కు కాల్ చెయ్యండి: ఐజీ రవికృష్ణ, ఎస్పీ శివ కిశోర్



సైబర్ గ్యాంగు నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బు, సెల్‌ఫోన్లు తదితరాలను పరిశీలిస్తున్న సైబర్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ, ఏలూరు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ తదితరులు

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒక సాధారణ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో అంతర్జాతీయ సైబర్ ముఠా ఆట కట్టించారు ఏలూరు పోలీసులు. ఒక బ్యాంకు మేనేజర్, మహారాష్ట్రకు చెందిన పోలీసు సహా 11 మందితో కూడిన గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. వీరిని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అభినందించారు. ఆ వివరాలను మంగళగిరిలోని పోలీసుల రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సైబర్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ, ఏలూరు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ శనివారం విలేకరులకు వివరించారు. ఏలూరు టూ టౌన్ పరిధిలోని 66 ఏళ్ల మహిళ సెల్‌ఫోన్‌కు సెప్టెంబరు చివరి వారంలో ఒక వీడియో కాల్ వచ్చింది. మొదట టెలికం డిపార్ట్‌మెంట్ అని ఒకరు, ఆ తర్వాత యూనిఫామ్ వేసుకుని పోలీసు అంటూ మరొకరు లైన్‌లోకి వచ్చారు. 'మీ ఆధార్ కార్డును నేరంలో వాడారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ వారెంట్ చూపించి 72 గంటల పాటు బెదిరించారు. ఆమె ఖాతాలో ఉన్న డబ్బులతో పాటు బంగారం తాకట్టు పెట్టి రూ.52లక్షల వరకూ చెల్లించినా సైబర్ నేరగాళ్లు బెదిరిస్తూనే ఉన్నారు. దీంతో బాధితురాలు జిల్లా ఎస్పీ కిశోర్‌కు చెప్పడంతో ఏలూరు టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో సెప్టెంబరు 24న కేసు నమోదు చేశారు. 23 మంది పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి దేశంలోని ఆరు రాష్ట్రాల్లో నెల రోజులపాటు 14వేల కిలోమీటర్లు తిరిగి కేసును ఛేదించారు. కర్ణాటక, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, గోవాల్లో ఉన్న పదకొండు మందిని అరెస్టు చేశారు. నేపాల్, చైనా, కాంబోడియా, సింగపూర్, అమెరికాల్లోనూ ఈ గ్యాంగ్ సభ్యులు ఉండటంతో వారినీ అరెస్టు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థల సహాయం కోరారు. ఈ గ్యాంగ్ కాంబోడియా, నేపాల్‌కు చెందిన వీవోఐపీ నంబర్లతో ఫోన్ కాల్స్ చేసి నకిలీ పోలీస్ ఐడీలు, వారెంట్లు చూపించి బాధితుల్ని బెదిరిస్తారు. డిజిటల్ అరెస్టు పేరిట నిర్బంధించి ఎవ్వరితోనూ మాట్లాడనీయకుండా భయపెట్టి సేఫ్ అకౌంట్స్ పేరుతో మ్యూల్ ఖాతాల్లోకి డబ్బులు బదిలీ చేయించుకుంటారు. అకౌంట్లలోకి వచ్చిన డబ్బుతో వీలైనంత వేగంగా క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేసి మొత్తం డబ్బు రూపాన్నే మార్చేస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి, సీతాపూర్, బారాబంకీ జిల్లాల్లో పోలీసు స్టేషన్ సెట్ వేసుకున్న సైబర్ ముఠా బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్ము బెంగళూరులోని మ్యూల్ ఖాతాలకు బదిలీ చేయించుకుంది. ఈ వ్యవహారంలో మహారాష్ట్రలోని నాగపూర్‌లో బ్యాంకు మేనేజర్, యావత్మల్‌లోని ఒక పోలీసు ప్రమేయం బయటపడింది. నిందితుల నుంచి 12స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్, సిమ్ బాక్స్, 40కిపైగా క్రిప్టో లావాదేవీలు, చైనాకు చెందిన 112 అక్రమ పేమెంట్ గేట్‌వేలు, 150కిపైగా మ్యూల్ ఖాతాలు, బైనాన్స్ వాలెట్ లావాదేవీలు సీజ్ చేసినట్లు ఐజీ, ఎస్పీ వెల్లడించారు. దీనికి పొరుగు రాష్ట్రాల పోలీసులతో పాటు కేంద్ర సంస్థలైన సెర్ట్-ఇన్, ఐ4సీ, భారత్‌పోల్ సహకారం తీసుకున్నట్టు తెలిపారు. 'డిజిటల్ అరెస్టు అనేది మన దేశంలోని ఏ చట్టంలోనూ లేదు. ఎవరైనా డిజిటల్ అరెస్టు పేరు చెప్పి వీడియో కాల్ చేస్తే భయపడకుండా వెంటనే 1930కు ఫోన్ చెయ్యండి' అని సూచించారు.

ప్రతి పోలీసుస్టేషన్‌లో ఒక సైబర్ వారియర్: ఆకే రవికృష్ణ

ఆండ్రాయిడ్ ఫోన్లలోని సోషల్ మీడియా గ్రూపులకు వచ్చే ఏపీకే ఫైళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని, ముఖ్యంగా పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని ఆకే రవికృష్ణ సూచించారు. రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి త్వరలో 26 పోలీసు స్టేషన్లు ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఇటీవల ఎంపికై శిక్షణ తీసుకొంటున్న 6,100 మంది పోలీసులకు తప్పనిసరిగా సైబర్ నేరాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పోలీసుస్టేషన్లోనూ ఒక సైబర్ వారియర్(కానిస్టేబుల్)ను నియమించి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైబర్ మోసాలు బాగా పెరుగుతున్నాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ప్రతి నెలా రూ.70కోట్లకు పైగా సైబర్ మోసాల్లో పోగొట్టుకుంటున్నారన్నారు.

ఫోన్ రీస్టార్ట్ చేసినా పనిచేసేలా..

సైబర్ దొంగలు ఏ విధంగా డబ్బు కొల్లగొట్టి, ఎలా మార్చుకొంటున్నారో ఫోరెన్సిక్ విశ్లేషణలో తేలింది. SMSrelease202507151.1.0.apk అనే యాప్ చైనాకు చెందిన admin.yespayment.net సర్వర్‌తో కనెక్ట్ అయినట్లు తేలింది. SMSలను ఆటోమెటిక్‌గా ఫార్వర్డ్ చేయడంతో పాటు ఫోన్ రీస్టార్ట్ చేసిన తర్వాత కూడా పనిచేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. క్రిప్టో ట్రేసింగ్‌లో కాజేసిన డబ్బు USDT స్టేబుల్ కాయిన్ రూపంలో Binance ప్లాట్‌ఫామ్‌లోకి మార్చి, తర్వాత చైనీస్ యువాన్(CNY)లోకి మళ్లించినట్లు బయట పడింది. దర్యాప్తులో EIP4337, EIP7702 వంటి స్మార్ట్ కాంట్రాక్టు ప్రోటోకాల్స్ ఉపయోగించి ఆటోమేటిగ్గా గుర్తించేందుకు వీళ్ల వాలెట్ల ద్వారా నిధులు క్రిప్టోకు బదిలీ అయినట్లు వెల్లడైంది.



డైపర్లు మార్చినంత ఈజీగా పార్టీల మార్పు

- అలాంటి వారికి పోలింగ్ బూత్‌ల్లోనే సమాధానం
- యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలి: వెంకయ్య

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు డైపర్లు మార్చినంత సులభంగా రాజకీయ నాయకులు రోజుకో పార్టీ మారుతున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కడపలో రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి వేడుక సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైకులు విరగ్గొట్టడం, కుటుంబ సభ్యుల పట్ల అసభ్యంగా మాట్లాడటానికి అసెంబ్లీ, పార్లమెంట్‌లను వేదికగా మార్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌ల్లోనే సమాధానం చెప్పారని గుర్తు చేశారు. దేశ సమైక్యత, దేశాభివృద్ధికి, దేశ విలువలను కాపాడడంలో నేటి యువత కీలకపాత్ర పోషించాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు.

వైద్యవిద్యకు ఎన్టీఆర్ విశ్వవిద్యాలయమే నాంది

- దేశంలో ఆ ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది
- ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి
- ఘనంగా 39వ వ్యవస్థాపక దినోత్సవం



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య కోసం దేశంలోనే మొదటిసారిగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం.. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తెలిపారు. ఈ ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు దక్కుతుందన్నారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 39వ వార్షికోత్సవాన్ని శనివారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. మధుమూర్తి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించాలని నాడు ఈ విశ్వవిద్యాలయాన్నిఏర్పాటు చేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వల్ల నేడు మారుమూల పల్లెలకు కూడా వైద్యం అందుబాటులోకి రావడం మంచి పరిణామమని చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ జి.రఘునందన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యవిద్యలో యూజీ, పీజీ సీట్లు పెరగడం సంతోషకరమన్నారు. వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో 554 కాలేజీలు పనిచేస్తున్నాయని, వర్సిటీలో రిసెర్చ్ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. యూనివర్సిటీకి అమరావతిలో ప్రభుత్వ భూములను కేటాయించడంలో గవర్నర్ నజీర్ పాత్ర కీలకమని ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు వర్సిటీ ప్రాంగణంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి ఉద్యోగులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి, సైకియాట్రిస్ట్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్షమాపణ చెబుతున్న హెచ్‌ఎం మరియాజోషిత

మీ వేంకటేశ్వరస్వామి వచ్చి పరీక్షలు రాస్తాడా?

- విద్యార్థితో హెడ్ మాస్టర్ అనుచిత వ్యాఖ్యలు
- మండిపడిన తల్లిదండ్రులు, హిందూ సంఘాలు
- హెచ్‌ఎం బహిరంగ క్షమాపణ, సమసిన వివాదం

ఆమదాలవలస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి పట్ల ఓ ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. తిరుపతి వెళ్లేందుకు సెలవు ఇవ్వకపోవడంతో పాటు స్కూలుకు వచ్చాక అనుచితంగా మాట్లాడడంపై హిందూ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు మండిపడ్డారు. వారి వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పట్టణంలోని మూడో వార్డు ఊసవానిపేటకు చెందిన నికేష్‌నాయుడు పార్వతీశునిపేటలో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అక్టోబరు నెల 9, 10 తేదీల్లో తిరుపతి వెళ్లడానికి సెలవు కావాలని హెచ్‌ఎంను విద్యార్థి తండ్రి ధర్మేంద్ర కోరినప్పటికీ ఆమె నిరాకరించారు. అయినా ఆయన కుమారుడిని తీసుకుని తిరుమల వెళ్లారు. తర్వాత నికేష్ నాయుడు యథావిధిగా పాఠశాలకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం పరీక్షలు సరిగా రాయలేదంటూ అతన్ని హెచ్‌ఎం కొట్టారు. మీ వేంకటేశ్వరస్వామి వచ్చి పరీక్షలు రాస్తాడా? అంటూ ఆమె వ్యంగ్యంగా మాట్లాడడంతో తండ్రికి చెప్పాడు. విషయం తెలిసి ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ దళ్ విశ్వహిందూ పరిషత్ సంఘాలతో పాటు పలువురు తల్లిదండ్రులు, అయ్యప్ప, భవానీ భక్తులు శనివారం పాఠశాలకు వచ్చి యాజమాన్యం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఆమదాలవలస ఎస్‌ఐలు ఎస్.శ్రీనివాస్, ఎస్.కాంతారావు అక్కడకి చేరుకుని మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. వారు పాఠశాలకు వచ్చి హిందూ సంఘాలు, తల్లిదండ్రులతో.. హెచ్‌ఎంతో మాట్లాడారు. హిందూ ధర్మం, మాలధారణ, పూజల పట్ల అనుచితంగా వ్యవహరించబోనని మరియాజోషిత సంజాయిషీ పత్రం ఇస్తూ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

టీటీడీకి భాష్యం కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి విరాళం

- నెలలో వెంగమాంబ అన్నప్రసాద భవనానికి కొత్త పాత్రలు

తిరుమల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన భవనంలోని ప్రధాన వంటశాలలో దాదాపు రూ.కోటి వ్యయంతో అధునాతన వంట పరికరాలు ఏర్పాటుకానున్నాయి. వంటశాలలో ప్రస్తుతం 22 స్టీమ్ బాయిలర్స్ ఉన్నాయి. దాదాపు 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వీటి పనితీరు మందగించింది. పైగా నిత్యం మరమ్మతులకు గురవుతున్న క్రమంలో టీటీడీ నూతన వంటపాత్రల(వెసెల్స్) ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ క్రమంలోనే భాష్యం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వీటి ఏర్పాటుకు ముందుకు వచ్చింది. 500 లీటర్ల వెసెల్స్ 8, రూ.300 లీటర్ల వెసెల్స్ 14 కొనుగోలుకు దాదాపు రూ.కోటి వరకు ఖర్చవుతుండగా, ఈ మొత్తాన్ని భాష్యం కన్‌స్ట్రక్షన్స్ విరాళంగా ప్రకటించడంతో పాటు ఆ సంస్థే తయారుచేసి టీటీడీకి అందజేయనుంది. ఇందులో భాగంగా టీటీడీ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఇప్పటికే కొలతలు, అవసరమైన టెక్నాలజీ వంటి వివరాలను ఆ సంస్థ సేకరించి బెంగుళూరులో వెసెల్స్ ను తయారు చేయిస్తోంది. నెల రోజుల్లో నూతన వంటపాత్రలు టీటీడీకి అందనున్నాయి.



వెంగమాంబ అన్నప్రసాద వంటశాలలో ప్రస్తుతం ఉన్న బాయిలర్స్

తొలుత తాత్కాలిక వంటశాల ఏర్పాటు

ప్రస్తుతం వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉన్న ప్రధాన వంటశాలను రానున్న ఇరవై ఏళ్లకు ఉపయోగపడేలా ఆధునికీకరించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో అన్నప్రసాదాల వితరణకు ఆటంకం కలగకుండా భవనం వెలుపల తాత్కాలిక వంటశాల ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. నూతన వెసెల్స్‌ను తొలుత ఇందులో ఏర్పాటు చేసి, వాటి పనితీరు బాగుంటే ప్రధాన శాశ్వత వంటశాలలో ఏర్పాటు చేస్తారు.

ఎంపీడీవో భార్య చేతివాటం!

- బస్సులో తోటి ప్రయాణికురాలి పర్సు చోరీ
- విషయం తెలిసినా.. దాచిన ఎంపీడీవో
- పోలీసుల అదుపులో భార్యాభర్తలు

విజయవాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆమె ఓ మండల స్థాయి అధికారి (ఎంపీడీవో) భార్య. అయితే ఆ విషయం మరిచి తోటి ప్రయాణికురాలి పర్సు కొట్టేసింది. ఎంపీడీవో ఈ విషయాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం. మూడ్రోజుల క్రితం విజయవాడ బస్టాండ్‌లో జరిగిన ఈ దొంగతనానికి సంబంధించి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఓ ఎంపీడీవో గుంటూరులో నివాసం ఉంటారు. ఆయన కుమార్తె విజయవాడ బెంజి సర్కిల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గత నెల 29న (బుధవారం) కుటుంబమంతా విజయవాడ వచ్చారు. తిరిగి మధ్యాహ్నం పీఎన్‌బీఎస్‌లోని గుంటూరు బస్సులు ఆగే ప్లాట్‌ఫాం వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఓ స్టాఫ్ నర్సు కూడా ప్లాట్‌ఫాంపై నిలబడి ఉన్నారు. ఆమె బస్సు ఎక్కుతున్న క్రమంలో ఎంపీడీవో భార్య తోసుకుంటూ కుమార్తెతో కలిసి బస్సు ఎక్కింది. ఈ క్రమంలో నర్సు పర్సును కాజేసిన ఆమె ఆ బస్సు దిగేసింది. టాయిలెట్‌కు వెళ్లి వచ్చిన భర్తతో మరో బస్సులో వెళ్దామని చెప్పగా.. ఎంపీడీవో వద్దని చెప్పి, అదే బస్సు ఎక్కించారు. గుంటూరులో బస్సు దిగిన నర్సుకు పర్సు కనిపించలేదు. బాధితురాలు 30న కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాట్‌ఫాంపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నర్సు చేతిలో ఉన్న బ్యాగ్‌ను ఎంపీడీవో భార్య అదే పనిగా చూస్తుండడాన్ని గమనించారు. ఎంపీడీవో కుమార్తె యూనిఫాం ఆధారంగా కళాశాలకు వెళ్లి విచారించారు. ఆమె ఫొటో చూపించగానే వారి చిరునామా బయటపడింది. పోలీసులు శుక్రవారం గుంటూరులో ఎంపీడీవో కుటుంబాన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, చోరీ బయటపడింది. కాగా, బాధితురాలు తన పర్సులో 14 గ్రాముల బంగారం, రూ.5 వేలు ఉంటే ఫిర్యాదులో మాత్రం 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.35 వేలు ఉన్నట్టు పేర్కొన్నారు.

సాగర్ ప్రధాన కాలువకు గండి

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



గండిని పూడ్చే ప్రాంతంలో అధికారులు

త్రిపురాంతకం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండల పరిధి గణపవరం సమీపంలో సాగర్ ప్రధాన కాలువకు గండిపడింది. దీంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. తుఫాన్ తగ్గిన మరుసటి రోజు గణపవరం చెరువుకు వరద ఉధృతంగా రావడంతో కాలువ కట్టకు గండిపడినట్టు తెలుస్తోంది. అందిన వివరాల మేరకు.. గణపవరం చెరువు అలుగు పారడంతో రెండు రోజుల కిందట ఆ నీరంతా సాగర్ కాలువకు చేరింది. ఆ ప్రదేశంలో ఉన్న ఎస్కేప్ పూడిపోయిన కారణంగా కట్ట పొర్లి తెగిపోయింది. సమాచారం అందుకున్న ఎన్నెస్పీ అధికారులు విషయం బయటకు పొక్కకుండా రాత్రింబవళ్లు యంత్రాల ద్వారా గండిని పూడ్చే పనిలో ఉన్నారు. ఎన్నెస్పీ వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని చలమయ్య దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LIMITED
Corporate office: H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati-517503

TENDER NOTICE

Bids through e-procurement are invited from the eligible bidders for (1) Providing 521 Nos. of Network MPLS links, Video Conferencing ILL (Internet Leased Line) links and IBW (Internet Bandwidth) link to the locations in 9 circles of APSPDCL. For Further details: **www.apeprocurement.gov.in** **CHIEF GENERAL MANAGER/PROJECTS & IT**
(2) Renovation of Gudur Division Office in Tirupati Circle. For Further details: **www.apeprocurement.gov.in**
CHIEF GENERAL MANAGER/P&MM & CIVIL
(3) Sealed bids are invited for eligible bidders for erection of 11 Nos. 25KVA DTRs and 11KV & LT line in Gooty Division & Bifurcation of existing 11KV Town-1 Rayadurg feeder and other works in Anantapur Circle. For further details: **www.apspdcl.in** **SUPERINTENDING ENGINEER/Opn/ANANTAPURAM**

తెలంగాణ ప్రభుత్వం::పోలీస్ శాఖ
అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్) కార్యాలయం, తెలంగాణ, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc. No. OCTOPU-SSEC/STRE/IETS/1/2025-S SECTION తేది:31.10.2025
తెలంగాణ, హైదరాబాద్, పోలీస్ శాఖ, ఆక్టోపస్ కు దిగువ ఐటమ్ సరఫరా కొరకు తయారీదారులు మరియు టెండరు నిర్దిష్ట అధీకృత డీలర్లు/పంపిణీదారుల నుండి ఇ-టెండరు కోరబడుచున్నది.

క్ర. సం.	గ్రూప్	ఐటమ్ కోడ్	టెండరు నం.	సరఫరా చేయవలసిన ఆర్టికల్ పేరు	అవసరమైన సుమారు పరిమాణం
1	ఆపరేషనల్ & ట్రైనింగ్ ఎక్విప్‌మెంట్	OSE/01	Rc.No.OCTOPU-SSEC/STRE/IETS/1/2025	బుల్లెట్ రెసిస్టెంట్ జాకెట్ల సరఫరా	100 నం.లు
2		OSE/02	Rc.No.OCTOPU-SSEC/STRE/IETS/2/2025	బుల్లెట్ రెసిస్టెంట్ హెల్మెట్ల సరఫరా	100 నం.లు

టెండరు విధానం మూడు-బిడ్ విధానం అనగా "ప్రీ-క్వాలిఫికేషన్ బిడ్", "టెక్నికల్ బిడ్" మరియు "వాణిజ్య / ఆర్థిక బిడ్". టెండరు షెడ్యూల్ ఫారమ్ మరియు కాంట్రాక్టు నిబంధనలు **04.11.2025/10:30** గం.ల నుండి **24.11.2025/14:30** గం.ల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ **(www.tender.telangana.gov.in)** నుండి పొందవచ్చును. బిడ్డర్లు ఇ-టెండర్ ప్రాసెసింగ్ ఛార్జీల కోసం రూ.200/- (రూపాయలు రెండు వందలు మాత్రమే) డిమాండ్ డ్రాఫ్టును అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆక్టోపస్, తెలంగాణ, హైదరాబాద్ పేరున పంపవలెను మరియు **24.11.2025/17:00** గం.ల ముందు ఇ-టెండర్లను దాఖలు చేయవలెను.
సం/- అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్)
తెలంగాణ, హైదరాబాద్
DIPR RO No.10104-PP/CL/ADVT/1/2025-26 తేది:01.11.2025

కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ వారి ప్రకటన
ఆర్ నెం.2187/2014/M1 **వేలం నోటీసు** తేది:29.10.2025.
కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ ఆధీనములోని రేవు "ఇబ్రహీంపట్నం ఫెర్రీ నుండి గుంటూరు జిల్లా, రాయపూడి ఫెర్రీ వరకు కృష్ణానది పై లాంచి తిప్పుకొనుటకు 2025-2026 సం.మునకు (అనగా ది. 15.11.2025 నుండి ది.14.11.2026 వరకు) రు.22,55,000/- లుగా నిర్ణయించబడిన అప్ సెట్ ధరకు లాంచీ తిప్పుకొని, సుంకము వసూలు చేసుకొనుటకు గానూ ది.11.11.2025న సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము, మచిలీపట్టణం నందు నిర్వహించబడును. వేలంలో పాల్గొనువారు ఉదయము గం.11.00 లు నుండి మధ్యాహ్నం గం.1.00 లు లోపు సీల్డ్ టెండర్ వేయుటకు, మరియు బహిరంగ వేలము మధ్యాహ్నం గం.3.00 లకు నిర్వహించబడును. జిల్లా ప్రజా పరిషత్ వారు నిర్దేశించిన షరతులకు లోబడి వేలం నిర్వహించుటకు గాను ముందుగా పాటదారులు (సీల్డ్ టెండర్ దారులు మరియు బహిరంగ వేలములో పాల్గొనువారు) చెల్లించవలసిన ధరావతు రూ.5,64,000/- లు డిమాండ్ డ్రాఫ్ట్ తో సంబంధింత ధ్రువపత్రములు ముఖ్యకార్యనిర్వాహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, కృష్ణా, మచిలీపట్టణం వారి పేరున తీసుకొని వేలంలో పాల్గొనవలెను. ఇతర వివరములకు/ షరతులకు కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము నందలి M సెక్షన్ మరియు ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయపు పనివేళలందు సంప్రదించి తెలుసుకొనగలరు.
ముఖ్యకార్యనిర్వాహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, కృష్ణా, మచిలీపట్టణం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

నార్సిసిస్టిక్... జగన్!

జగన్ తన గురించి ఎంత గొప్పగా ఊహించుకుంటారో.. ఆయనని అభిమానించేవారు కూడా అదే విధంగా ఆయన గురించి గొప్పగా ప్రచారం చేస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మూక అంతా ఊహాలోకంలో విహరిస్తుంటారు. నిజానికి జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వారికి పెద్దగా ఒరిగింది ఏమైనా ఉందా అంటే అది కూడా కనిపించదు. శరభ శరభ అని కీర్తించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై బురద చల్లినందుకు మహా అయితే నెలవారీ చెల్లింపులు అందుతూ ఉండొచ్చు. తనను తాను జగన్ ఎలా ఊహించుకుంటారో ఆయన మద్దతుదారులు కూడా అలానే తలచుకొని పోస్టులు పెడతారు. మొత్తంగా జగన్‌రెడ్డి అనే అతను ఒక అసాధారణ వ్యక్తి అని వారంతా నమ్ముతారు. జగన్ లాంటి వాడు మళ్లీ పుట్టడని కూడా ప్రచారం చేస్తారు. ఒక రకంగా ఇది నిజమే. నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ముదిరిన జగన్ లాంటి వాడు మళ్లీ ఎప్పుడు పుడతాడో చెప్పలేం!

"ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సృష్టించిన విపత్తు ఈ మొంథా తుఫాను" అని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అదే సమయంలో "ముఖ్యమంత్రిగా లేకపోయినా తుఫాను నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు జగన్‌రెడ్డి" అని తన సొంత మీడియాలో ప్రచారం చేయించుకున్నారు. సాధారణ ప్రజలకు ఈ రెండు వ్యాఖ్యానాలు వింతగా అనిపిస్తాయి. మొంథా తుఫానును చంద్రబాబు సృష్టించడం ఏమిటి? ప్రకృతి విపత్తు సంభవించి ప్రజలు అవస్తలు పడాలని చంద్రబాబే కాదు– జగన్‌రెడ్డి కూడా కోరుకోరు కదా! అదే సమయంలో ముఖ్యమంత్రిగా లేకపోయినా ఈ విపత్తు నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు అని తనకు తానే కితాబు ఇప్పించుకోవడం వింతల్లోకెల్లా వింత. నిజానికి తుఫాను తీరం దాటినప్పుడు ఆయన రాష్ట్రంలోనే లేరు. బెంగళూరులో ఉన్నారు. తుఫాను ముప్పు తగ్గిన తర్వాత రాష్ట్రానికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును కాసేపు తిట్టి మళ్లీ బెంగళూరు వెళ్లిపోయారు. గత ఏడాది బుడమేరుకు వరద వచ్చినప్పుడు కూడా జగన్‌రెడ్డి 'ఇది మనిషి సృష్టించిన విపత్తు' అని విమర్శించారు. జగన్‌రెడ్డి ప్రవర్తన చూసిన వారికి వింతగా ఉంటుంది. దీన్ని లోతుగా అధ్యయనం చేస్తే ఆయన 'నార్సిసిస్టిక్ డిజార్డర్' అనే మానసిక సమస్యతో బాధపడుతున్నట్టు స్పష్టమవుతుంది. అంతర్జాతీయంగా పేరొందిన అమెరికాలోని మెయో క్లినిక్ ఈ వ్యాధి ఉన్న వారిలో కనిపించే లక్షణాలను స్పష్టంగా నిర్వచించింది. ఈ వ్యాధి లక్షణాలలో ప్రముఖమైనది... ఒక వ్యక్తి తనకు తాను గొప్పవాడిగా భావిస్తూ అధిక ప్రాముఖ్యత ఇచ్చుకోవడం, దీనితోపాటు విపరీతమైన అహంభావం కలిగి ఉండటం! అర్హత లేని సందర్భాలలో కూడా తనను గొప్పగా ఊహించుకొని తనను తాను ప్రేమించుకుంటూ ఇతరులు కూడా తనను అభినందించాలని, సన్మానించడం ద్వారా గుర్తించాలని కోరుకుంటారు. ఇతరుల పట్ల కనీస సానుభూతి ఉండదు. తనను ప్రతి ఒక్కరూ నిరంతరం ప్రశంసించాలని కోరుకుంటూ తన గొప్పతనాన్ని అతిగా ఊహించుకుంటారు. తానొక ప్రత్యేకమైన వ్యక్తినని, ప్రత్యేక గౌరవానికి అర్హుడనని నమ్ముతూ మితిమీరిన ప్రశంసలకోసం ఎదురుచూస్తుంటారు. ఇతరులు ఏమనుకుంటారో అన్న చింత ఉండదు. అపరిమిత విజయాలను సాధించానని, అంతులేని అధికారం అనుభవిస్తున్నానని, అందగాడినని–మొత్తంగా తానొక ప్రత్యేకమైన వ్యక్తినని ఊహాలోకంలో విహరిస్తుంటారు. తాను చేసిన పనులను అసాధారణ ఘనకార్యాలుగా మిగతా వారంతా భావించాలని, తాను ఏమి చేసినా, చెప్పినా ఇతరులు ప్రశ్నించకుండా అనుసరించాలని కోరుకుంటారు. ఇతరుల అవసరాలు, మనోభావాలు వారికి పట్టవు. తనను ప్రత్యేకమైన వాడిగా గుర్తించని వారినందరినీ శత్రువులుగా భావిస్తారు. అలాంటి వారి పట్ల దురుసుగా వ్యవహరిస్తారు. తమకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించనప్పుడు వారికి కోపం వస్తుంది. సహనం నశిస్తుంది. ఇలా చెప్పుకొంటూ పోతే సాధారణ మనుషులలో కనిపించని అనేక లక్షణాలు ఈ వ్యాధితో బాధపడుతున్న వారిలో ఉంటాయి. వైద్య పరిభాషలో ఇదొక తీవ్రమైన మానసిక సమస్య. దీనికి మందులు కూడా ఉండవు. ఈ సమస్యతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండటమే మందు అని వైద్యులు చమత్కరిస్తుంటారు.

జగన్ చేతలు...

జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చే వరకు అతని గురించి ప్రజలకు తెలియదు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత అతడి ప్రవర్తనను గమనిస్తే... తనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఎవరైనా అంగీకరించాల్సిందే! ముఖ్యమంత్రి అయిన కొత్తలో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనే వారితో 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసేవారు. తాను ధరించిన టోపీలపై కూడా 'సీఎం సర్' అని రాసి ఉండటం చూశాం. ఈ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పని చేశారు. వాళ్లెవ్వరూ 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసుకోలేదు. అంటే, జగన్‌రెడ్డి మాత్రమే ముఖ్యమంత్రిగా తాను ప్రత్యేకమని, ప్రజలందరూ తనను అభిమానించి ప్రత్యేకంగా గుర్తించి గౌరవించాలని కోరుకున్నారన్న మాట! తన మాటకు ఎదురు చెప్పిన వారిని ఆయన దారుణంగా అవమానించేవారు. బహుశా ఈ కారణం వల్లనే కాబోలు అఖిల భారత సర్వీసు అధికారులు సైతం ఆయన ముందు మోకరిల్లేవారు. ఇది కూడా ఆ వ్యాధి లక్షణమే! నిన్నగాక మొన్న వైద్య కళాశాలలను పీపీపీ మోడల్లో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శిస్తూ... అధికారంలో ఉన్నప్పుడు తాము నిర్మించిన వైద్య కళాశాల భవనాలను చూసిన వారంతా 'ఆహా' అని మెచ్చుకోవాలని, తనకు శాలువాలు కప్పి సత్కరించాలని చెప్పుకొచ్చారు. ఇది కూడా సదరు మానసిక సమస్యతో బాధపడుతున్న వారిలో కలిగే భావనే. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం ఇలాంటి సందర్భాలను ఎన్నింటినో చూశాం! ఇప్పుడు అధికారం కోల్పోయినప్పటికీ... తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారని తాను నమ్ముతూ, అందర్నీ నమ్మవలసిందిగా కోరుతున్నారు. ఇది కూడా నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణమే. తమాషా ఏమిటంటే, జగన్‌రెడ్డిలో కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు ఆయన చుట్టూ ఉన్న వారిలోనూ కనిపిస్తున్నాయి. కాకపోతే తక్కువ స్థాయిలో! జగన్ తన గురించి ఎంత గొప్పగా ఊహించుకుంటారో.. ఆయనని అభిమానించేవారు కూడా అదే విధంగా ఆయన గురించి గొప్పగా ప్రచారం చేస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మూక అంతా ఊహాలోకంలో విహరిస్తుంటారు. నిజానికి జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వారికి పెద్దగా ఒరిగింది ఏమైనా ఉందా అంటే అది కూడా కనిపించదు. శరభ శరభ అని కీర్తించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై బురద చల్లినందుకు మహా అయితే నెలవారీ చెల్లింపులు అందుతూ ఉండొచ్చు. సోషల్ మీడియాలో జగన్ మద్దతుదారులు పెడుతున్న పోస్టులను చూస్తే ఆయన తల్లి విజయమ్మకు కూడా నా బిడ్డలో ఇన్ని అసాధారణ లక్షణాలు ఉన్నాయా అన్న అనుమానం కలగకమానదు. తనను తాను జగన్ ఎలా ఊహించుకుంటారో ఆయన మద్దతుదారులు కూడా అలానే తలచుకొని పోస్టులు పెడతారు. మొత్తంగా జగన్‌రెడ్డి అనే అతను ఒక అసాధారణ వ్యక్తి అని వారంతా నమ్ముతారు. జగన్ లాంటి వాడు మళ్లీ పుట్టడని కూడా ప్రచారం చేస్తారు. ఒక రకంగా ఇది నిజమే. నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ముదిరిన జగన్ లాంటి వాడు మళ్లీ ఎప్పుడు పుడతాడో చెప్పలేం!


ఆయనేం చేసినట్లు?

ఇప్పుడు మొంథా తుఫాను గురించి జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయానికి వద్దాం! ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన ప్రజలను ప్రభుత్వాలు మరింత మెరుగ్గా ఆదుకోవాలని కోరడం లేదా బాధితులకు సహాయం చేయడంలోగానీ, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో గానీ విఫలమయ్యారని విమర్శించడం సహజం. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారే ప్రకృతి విపత్తు సంభవించింది. అప్పుడు ఆయన పెద్దగా హైరానా పడలేదు. 'నేను ప్రార్థన బాగా చేస్తాను. అయినా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే మనం ఏం చేయగలం? జరిగేది ఏదో జరుగుతుంది' అని నిర్వేదంగా వ్యాఖ్యానించారు. రైతులు, ఇతర బాధితులలో మనోధైర్యం కల్పించే ప్రయత్నం కూడా చేయలేదు. అంతా విధి లిఖితం అని సరిపెట్టుకోమన్నారు. ఇప్పుడు అదే మనిషి మొంథా తుఫాను ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన విపత్తు అని అలవోకగా అనేశారు. నార్సిసిస్టిక్ వ్యాధి ఉన్నవారు ఇతరులను కించపరుస్తారని వైద్యులు చెబుతారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డిలో ఆ లక్షణం ఉన్నట్టే కదా? ఏ ముఖ్యమంత్రి అయినా పకృతి వైపరీత్యాలు సంభవించాలని కోరుకుంటారా? లేదా విపత్తులను సృష్టిస్తారా? ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అవినీతి జరిగిందని విన్నాం. శవాలపై పైసలు ఏరుకోవడం చూశాం. అంతేగానీ తుఫానులకు ఫలానా ముఖ్యమంత్రి కారణం అని ఇంతవరకు ఎవరూ విమర్శించలేదు. ఇప్పుడు జగన్ మీడియా, ఆయన సోషల్ మీడియా చేసిన, చేస్తున్న ప్రచారం విషయానికి వద్దాం! ముఖ్యమంత్రిగా లేకపోయినా తుఫాను నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు జగన్ అని కీర్తించుకోవడం ఏమిటి? తుఫాను అనంతరం జరిగిన సహాయక చర్యలలో జగన్ పాత్ర ఏముంది? ప్రజలను ఎలా కాపాడారు? ఇలా భావించడం కూడా నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణమే. అర్హత లేకపోయినా తనకు తాను అధిక ప్రాధాన్యత ఇచ్చుకోవడం, తనను అందరూ ప్రశంసించాలని, సన్మానించాలని కోరుకోవడం ఈ వ్యాధి లక్షణాలే కదా! జగనన్న లాంటి సంకల్పం ఉంటే సూర్యుడైనా సలాం కొట్టాల్సిందేనట! మొంథా తుఫానుకు ముందూ వెనుకా జగన్‌రెడ్డి పాత్ర సున్నా! తుఫాను రాష్ట్రంపై విరుచుకుపడినప్పుడు ఆయన అసలు ఏపీలోనే లేరు. తుఫాను తీరం దాటి శాంతించిన తర్వాత మాత్రమే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. ఒక్కరోజు అక్కడే ఉన్నప్పటికీ... అడుగు బయటపెట్టకుండా శుక్రవారం నాడే బెంగళూరు వెళ్లిపోయారు. అంటే తన పాత్ర ఏమీ లేని సందర్భాలలో కూడా ఆయన తనకు తాను భుజకీర్తులు తగిలించుకుంటారన్నమాట! ఇతరులతో కీర్తింపజేసుకుంటారన్నమాట! ఏఐ అంటే ఏమిటో జగన్ ఆ మధ్య తేల్చిపడేశారు. డేటా సెంటర్ నుంచి డేటా తీసుకొని, దానికి మైండ్ అప్లై చేస్తే అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవుతుందని చెప్పి నవ్వులపాలు అయ్యారు. దీనిపై పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారుగానీ, అలా చెప్పగలగడం కూడా ఈ వ్యాధి లక్షణమే. తనకు తెలియని అంశం ఏదీ ఉండదని, ఏ విషయమైనా అలవోకగా చెప్పేయగలమన్న మితిమీరిన ఆత్మవిశ్వాసం ఈ వ్యాధి ఉన్న వారికి ఉంటుంది.

మొంథా తుఫానుకు ముందూ వెనుకా జగన్‌రెడ్డి పాత్ర సున్నా! తుఫాను రాష్ట్రంపై విరుచుకుపడినప్పుడు ఆయన అసలు ఏపీలోనే లేరు. తుఫాను తీరం దాటి శాంతించిన తర్వాత మాత్రమే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. ఒక్కరోజు అక్కడే ఉన్నప్పటికీ... అడుగు బయటపెట్టకుండా శుక్రవారం నాడే బెంగళూరు వెళ్లిపోయారు. అంటే తన పాత్ర ఏమీ లేని సందర్భాలలో కూడా ఆయన తనకు తాను భుజకీర్తులు తగిలించుకుంటారన్నమాట!

సంక్షోభాలే సోపానాలుగా...

చంద్రబాబుపై జగన్ చేసిన విమర్శల విషయానికి వద్దాం! సమకాలీన రాజకీయాలలో సంక్షోభాలను తనకు అనుకూలంగా మలచుకోవడంలో చంద్రబాబు ప్రథమ స్థానంలో ఉంటారు. 1984లో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినప్పుడు చంద్రబాబులోని శక్తియుక్తులు బయటపడ్డాయి. అదే చంద్రబాబు తర్వాత కాలంలో లక్ష్మీపార్వతి కారణంగా పార్టీ సంక్షోభంలోకి జారుకుంటున్నదని గ్రహించి అదే ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసి పార్టీని, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకొని మూడు దశాబ్దాలుగా ఎన్నో సంక్షోభాలను అధిగమించి పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇక అధికారంలో ఉన్నప్పుడు తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నిద్రాహారాలు మాని సహాయ పునరావాస చర్యలపై దృష్టి పెడతారు. ఇలాంటి సందర్భాలలో చంద్రబాబు ఒకింత అతి చేస్తారని కొంత మంది భావిస్తారుగానీ... ఆయన అలాంటి సందర్భాలను తనకు లభించిన అవకాశాలుగా స్వీకరిస్తారు. మొంథా తుఫాను సందర్భంలో కూడా ఆయన ఇలాగే పని చేశారు. సాంకేతిక విజ్ఞానం కూడా అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఎప్పటికప్పుడు తుఫాను సమాచారాన్ని అందిస్తూ ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, రహదారులు ధ్వంసం అవడం సర్వసాధారణం. తిరిగి సాధారణ పరిస్థితులు రావడానికి వారం పది రోజులు పట్టేది. ఇప్పుడు ఒక్క రాత్రిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రాత్రికి రాత్రి రహదారులపై కూలిన చెట్లను తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. తుఫాను తాకిడికి గురైన ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని బాహాటంగానే చెబుతున్నారు. ప్రభుత్వ సిబ్బంది నిద్రాహారాలు మాని మరీ పునరుద్ధరణ పనులు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించాలి. ప్రజాభిప్రాయం ఇలా ఉండగా... ముఖ్యమంత్రిని విమర్శించడం, ప్రకృతి విపత్తుకు ఆయనే కారణమని జగన్ నిందించడం వింతగా ఉంది. కూటమి నాయకులు కొంత కాలంగా జగన్‌రెడ్డిని సైకోగా అభివర్ణిస్తున్నారు. ఆయనలో సైకో లక్షణాలు ఉన్నాయా లేదా అన్నది వైద్యులు మాత్రమే నిర్ణయించాలి. అయితే, దాదాపు దశాబ్ద కాలంగా జగన్‌రెడ్డిని గమనిస్తున్న వారికి ఆయనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఇట్టే తెలిసిపోతుంది. అయితే, వైద్యులు ఇప్పటివరకు ఆయనలో ఈ లక్షణాలు ఉన్నాయని గ్రహించలేదు. ఎందుకంటే వారికి ఆ ఊహ కూడా రాలేదు. బహుశా ఈ వ్యాధి లక్షణాల కారణంగానే జగన్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలు కూడా అంతుబట్టకుండా ఉంటాయి. ప్రజాక్షేత్రంలో బలం ఉన్న నాయకులు కూడా ఆయన ముందు చేతులు కట్టుకొని ఎందుకు నిలబడతారో అర్థం అవుతుంది. తానొక అసాధారణ నాయకుడినని ఆయన వారందరినీ నమ్మించి ఉంటారు. ఈ కారణంగానే ఆయన మద్దతుదారులు కనీస వెరపు లేకుండా జగన్ కోసం పనిచేస్తున్నారు. తన మాటకు ఎవరు ఎదురు చెప్పినా ఆయనలో ఆగ్రహం పెల్లుబుకుతుంది. సహనం నశిస్తుంది. ఇతరులలో గొప్ప లక్షణాలు ఉంటే వాటిని గుర్తించి గౌరవించడానికి నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిరాకరిస్తారు. బహుశా ఈ కారణంగానే కాబోలు రాజశేఖరరెడ్డి కంటే గొప్ప పాలనను అందిస్తానని తాను అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిని గుర్తించడానికి కూడా జగన్ నిరాకరించారు. చంద్రబాబుపై ద్వేషంతో చీదరించుకుంటారు. తాను తప్ప అన్యులు మంచి చేయరని ఈ వ్యాధి ఉన్నవారు భావిస్తుంటారు కనుకే జగన్‌రెడ్డి కూడా కూటమి పాలనలో ఏపీ సర్వనాశనం అయిందని చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే విమర్శలు మొదలుపెట్టారు. చంద్రబాబు పాలనలో ఒక్కటంటే ఒక్కటీ మంచి పని జరగలేదని తాను నమ్ముతూ ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తన గొప్పతనం ముందు ఇతరులు బలాదూర్ అని నార్సిసిస్టిక్ వ్యాధి ఉన్నవాళ్లు భావిస్తారు. జగన్ విషయంలో ఇప్పుడు జరుగుతున్నది కూడా ఇదే. తాను అధికారంలో ఉన్నప్పుడు ఒక్క తప్పు కూడా చేయలేదని భావించడానికి కూడా ఈ వ్యాధే కారణం. ఉదాహరణకు కాపు, కమ్మ కులస్తుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఈ రెండు కులాల వారిని వేటాడి వేధించడం గుర్తు లేదన్నట్టుగా ఇప్పుడు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు. కమ్మ వాళ్లను జాతి శత్రువులుగా భావించిన ఆయన కాపులను కూడా ఆ జాబితాలోకి చేర్చారు. జన సేనాని పవన్ కల్యాణ్ విషయమే తీసుకుందాం. కాపు సామాజికవర్గం అమితంగా ఇష్టపడే ఆయనను ఎన్ని రకాలుగా వేధించారో... పావలాగాడు, ప్యాకేజీ స్టార్ అని ఎలా కించపరిచారో చూశాం. తన మనో వికారాలను ప్రజలు గుర్తించకుండా ఉండటానికి 'క్లాస్ వార్' అని వామపక్షాల నినాదాన్ని జగన్ అందిపుచ్చుకున్నారు. కాపులను కాపులతోనే తిట్టించారు. కమ్మ వారిని కమ్మ వారితోనే తిట్టించారు. ఈ క్రమంలో పేర్ని నాని, ముద్రగడ పద్మనాభం వంటి వారిని చేరదీశారు. చివరికి ముద్రగడ పద్మనాభం తన పేరును పద్మనాభరెడ్డి అని మార్చుకోవలసిన దుస్థితి కల్పించారు. ఇక వల్లభనేని, కొడాలి నాని వంటి వారి గురించి తెలిసిందే. ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నాం. అప్పుడు ఆ రెండు కులాలను వేధించిన జగన్‌రెడ్డి ఇప్పుడు ఆ రెండు కులాలను విడదీయడానికి స్కెచ్ గీశారు.



జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత అతడి ప్రవర్తనను గమనిస్తే... తనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఎవరైనా అంగీకరించాల్సిందే! ముఖ్యమంత్రి అయిన కొత్తలో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనే వారితో 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసేవారు. తాను ధరించిన టోపీలపై కూడా 'సీఎం సర్' అని రాసి ఉండటం చూశాం. ఈ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వాళ్లెవ్వరూ 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసుకోలేదు. అంటే, జగన్‌రెడ్డి మాత్రమే ముఖ్యమంత్రిగా తాను ప్రత్యేకమని, ప్రజలందరూ తనను అభిమానించి ప్రత్యేకంగా గుర్తించి గౌరవించాలని కోరుకున్నారన్నమాట! తన మాటకు ఎదురు చెప్పిన వారిని ఆయన దారుణంగా అవమానించేవారు. బహుశా ఈ కారణం వల్లనే కాబోలు అఖిల భారత సర్వీసు అధికారులు సైతం ఆయన ముందు మోకరిల్లేవారు. ఇది కూడా ఆ వ్యాధి లక్షణమే!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను మాత్రమే అర్హుడినని జగన్‌రెడ్డి తనకు ఉన్న మానసిక సమస్య వల్ల బలంగా నమ్ముతున్నారు. జగన్‌లో ఉన్న నార్సిసిస్టిక్ లక్షణాల వల్లనే ఆయన ఎత్తుగడలను నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ముందుగా పసిగట్టలేకపోతున్నారు.

కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు...

కాపులను కూటమి నుంచి దూరం పెట్టడానికి కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారు. ఇందుకోసం కాపు సామాజిక వర్గానికి చెందిన కొందరిని చేరదీశారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా జగన్ మనుషులు అక్కడ వాలిపోతూ కులాల మధ్య కుంపట్లను రాజేస్తున్నారు. తాజాగా కాల్ మనీ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న ఒక మహిళకు సంబంధించిన కేసులో ఏ సంబంధం లేని కల్లూరు శ్రీనివాస్ అనే కమ్మ సామాజికవర్గానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త పేరు బయటకు తెచ్చారు. కర్లపూడి శ్రీను అనే పేరు బదులు కల్లూరు శ్రీను అని ఆత్మహత్య చేసుకున్న శేషమ్మ వీడియోలో అన్నారు. అంతే, అక్కడ కూడా కులాల మధ్య విద్వేషాలు రగిలించడానికి జగన్ తరఫున వకల్తా పుచ్చుకున్నవారు వాలిపోయారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను మాత్రమే అర్హుడినని జగన్‌రెడ్డి తనకు ఉన్న మానసిక సమస్య వల్ల బలంగా నమ్ముతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం తాను అధికారంలో లేనందున ఏదేదో జరిగిపోతోందని బాధపడి పోతున్నారు. జగన్‌లో ఉన్న నార్సిసిస్టిక్ లక్షణాల వల్లనే ఆయన ఎత్తుగడలను నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ముందుగా పసిగట్టలేక పోతున్నారు. తెలుగుదేశం పార్టీకి బలమైన మద్దతుదారులుగా ఉన్న కమ్మ వారిలో కూడా చంద్రబాబుపై వ్యతిరేకత సృష్టించే ప్రయత్నం జగన్‌రెడ్డి చేయగలరని ఎవరైనా ఊహిస్తారా? ఆ సామాజికవర్గానికి చెందిన కొందరిని చేరదీసి, చంద్రబాబు పాలనలో కమ్మ వారికి అన్యాయం జరుగుతోందని... ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాలకు అన్యాయం చేస్తున్నారని, అమరావతిని నిర్వీర్యం చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, జగన్‌రెడ్డి పాలనలో వేధింపులను తట్టుకోలేక కలుగుల్లో దూరి బిక్కు బిక్కు మంటూ బతుకు వెళ్లదీసిన కమ్మ సామాజికవర్గంలో కొందరు ఈ ప్రచారాన్ని నమ్ముతున్నారు. మెయో క్లినిక్ వాళ్లు ఇచ్చిన నిర్వచనంలో ఈ లక్షణం కూడా ఉంది. విషాదం ఏమిటంటే, నార్సిసిస్టిక్ డిజార్డర్‌కు మందు లేకపోవడం. అంటే నయం కాని మానసిక సమస్యతో బాధపడుతున్న జగన్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భరించాల్సిందే. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాబోయే భారత ప్రధాని అని ఇదే జగన్‌రెడ్డి ప్రచారం చేయించుకోవడం గుర్తుంది కదా? అంటే ఆయనలో ఈ మానసిక సమస్య తీవ్రరూపం దాల్చుతోన్నదన్న మాట. జగన్మోహన్‌రెడ్డిలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? లేవా? అన్న విషయం స్పష్టం చేయాల్సిన బాధ్యత సైకాలజిస్టుల మీద ఉన్నది. ఆయనలో ఈ వ్యాధి లక్షణాలు లేవని వారు నిర్ధారిస్తే మరేదో సమస్య ఉందని సరిపెట్టుకోవచ్చు. అంతవరకు జగన్ విషయంలోనూ, ఆయన రాజకీయాల విషయంలోనూ ప్రజలే అప్రమత్తంగా ఉండాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భయం చచ్చిపోతే, అవినీతి బరితెగిస్తుంది

ఒక సీనియర్ పోలీసు అధికారి ఎప్పుడు అవినీతి పరుడవుతాడు? సమాధానం– 'అతనికి భయం లేకపోతే.'

అవినీతి లాభదాయకమని తెలిసినప్పుడు. తనను ఎవరూ పట్టుకోలేరని నమ్మినప్పుడు. తనను రక్షించేవారు ఉన్నారని తెలిసినప్పుడు. తన భాగస్వాములు తనకు భయపడతారని, చట్టానికి కాదు అని తెలిసినప్పుడు. తనను ఎవరూ బహిర్గతం చేయలేరని, ఎందుకంటే తాను వారి రహస్యాలను కూడా బయట పెట్టగలడని తెలిసినప్పుడు– అప్పుడు తెగులు ప్రారంభం అవుతుంది.

ఒకసారి అవినీతి మొదలైతే, అది మౌనంగా వ్యాపిస్తుంది. ఇటీవల ఒక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) అవినీతిలో పట్టుబడి జైలులో ఉండటం ప్రజల నమ్మకాన్ని మరోసారి కుదిపేసింది. ఇతను ఇంతకాలం, అంత ఎలా దాచుకున్నాడు కాదు. అసలైన ప్రశ్న– ఇతని గురించి ఎంతమందికి మందికి తెలుసు? ఎవరెవరు లాభపడ్డారు?

పోలీసు వ్యవస్థలో ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాలు ఉన్నా, ఇంత పెద్ద అవినీతి ఎవరికీ తెలియకపోవడం నమ్మశక్యం కాదు. కానీ హోదాలు శాసించే వ్యవస్థలో, మౌనం ఆధారంగా నడిచే వ్యవస్థలో అవినీతి గురించి తెలియడం, దానికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడం చాలా భిన్నమైన విషయాలు.

అవినీతిపరుడు ఒంటరిగా కాదు, మౌనంగా సహకరించే వారి మధ్యలో జీవిస్తాడు. అతని సహచరులు లంచాలు పంచుకోకపోయినా, మౌనం పంచుకుంటారు. అతని సీనియర్లు అతని లోభాన్ని నమ్మకపోయినా, ప్రశ్నించకుండా ఉండటానికి ఇష్టపడతారు. జూనియర్‌లు చూస్తారు, నేర్చుకుంటారు– నిజాయితీ అనేది లాభదాయకమైంది కాదని భావిస్తారు. క్రమంగా ఒక ప్రమాదకరమైన అంచనాకు వస్తారు– వ్యవస్థలో అవినీతి మినహాయింపు కాదు, వ్యవస్థాగత యంత్రం నడవడానికి కందెన అనే నమ్మకం ఏర్పడుతుంది. అందుకే ఒక సీనియర్ అధికారి అవినీతి సొమ్ముతో దొరికిపోయినప్పుడు కలిగే విభ్రాంతి చాలా కృత్రిమంగా ఉంటుంది. పోలీస్ వ్యవస్థలో పనిచేసే వారందరికీ తెలుసు, అవినీతి దారితప్పిన వ్యక్తిది కాదు, అది లోతుగా వ్యాపించిన వ్యాధి అని.

ఐపీఎస్‌ను 'ఎలైట్' సర్వీస్‌గా పిలుస్తారు. నిజంగా చాలా మంది అధికారులు ధైర్యంగా, నిజాయితీగా పని చేస్తారు. అందుకు చాలా మూల్యం కూడా చెల్లిస్తారు. కానీ ఈ 'ఎలైట్' అనే పదం కొందరికి రక్షణ కవచంగా మారింది. చట్టానికి అందనంత దూరంలో ఉన్నట్లు భావిస్తారు. రాజకీయ సంబంధాలు, బ్యూరోక్రటిక్ శక్తి, అనుచరుల విశ్వాసం కలగలిపి వారికి రక్షణ కవచం ఉన్నట్లు భావన కలిగిస్తుంది. బదిలీలు మేనేజ్ చేయవచ్చు, విచారణలు ఆలస్యం చేయవచ్చు, ఫైళ్లు మాయమవుతాయి. పర్యవేక్షణ వ్యవస్థలు తప్పు చేసిన వారిని జవాబుదారీ చేయడం కంటే కాపాడడానికే ఉపయోగపడతాయి. ఈ విధంగా శిక్షల నుంచి రక్షించే వలయం ఏర్పడుతుంది.

**ఆరోగ్యకరమైన వ్యవస్థలో రెండు రకాల భయాలు ఉంటాయి– తప్పు చేయడం అంటే భయం... పట్టుబడడం అంటే భయం... భయపడడానికేమి లేదని ఒక సీనియర్ అధికారి భావిస్తే, అవినీతి అనివార్యం అవుతుంది. వ్యవస్థ తనను జవాబుదారీ చేస్తుందని నమ్మితే, నిజాయితీ తిరిగి వస్తుంది.
ఏది ఎంచుకుంటామనేది మన చేతుల్లోనే ఉంది– మౌనంగా ఉండడమా లేక ధైర్యంతో ఎదుర్కోవడమా? మౌన అంగీకారమా లేక మనస్సాక్షితో ప్రశ్నించడమా? ఎందుకంటే చట్టాన్ని అమలు చేసేవారు దానికి భయపడకపోతే, ఆ చట్టానికి అర్థమే ఉండదు.**



ఒక ఆరోగ్యకరమైన వ్యవస్థలో రెండు రకాల భయాలు ఉంటాయి– తప్పు చేయడం అంటే భయం... పట్టుబడడం అంటే భయం. ఇవి రెండూ లేకపోతే, అవినీతి తప్పని సరిగా విజృంభిస్తుంది. నాయకత్వ స్థాయిలో ఉన్న చాలా మందికి ఈ భయాలు పోయి చాలా కాలమైంది. రాజకీయ ప్రాబల్యం ఒక రక్షణ వలయం వారికి. వ్యవస్థీకృత జడత్వం ఇంకొక రక్షణ వలయం. నిశ్శబ్దంగా లేక పంచుకున్న అవినీతి వల్ల సహకరించేవారు ఈ రక్షణ వలయాన్ని పూర్తి చేస్తారు. వ్యవస్థను తప్పుదారి పట్టించగలను, దర్యాప్తును ప్రభావితం చేయగలను, విచారణను తొక్కి పెట్టగలను అని అధికారి భావించినంత కాలం, నీతిగా ఉండడం అనేది వీలైతే పాటించే ఒక సుగుణం.

ఒక సీనియర్ అధికారి పట్టుబడితే, అది కేవలం అతని పరాభవమే కాదు– మొత్తం పోలీసు వ్యవస్థపై మచ్చ. నిజాయితీపరులైన వందలాది అధికారుల విశ్వసనీయతను అది బలహీనపరుస్తుంది. ప్రజలు పోలీసులను రక్షకులుగా కాకుండా, యూనిఫామ్‌లో ఉన్న వేటగాళ్లుగా చూస్తారు. నిజాయితీ గల ఒక కానిస్టేబుల్ లేదా ఎస్పీ తాము ఒంటరివాళ్లమై పోయామని భావిస్తారు. అవినీతి పై నుంచి కిందికి పాకుతుంది– హెడ్‌క్వార్టర్స్ నుంచి వీధిలోని రోజువారీ మామూళ్లు వసూలు చేసే బీట్ కానిస్టేబుల్ వరకు. అవినీతిని మౌనంగా భరిస్తే చెల్లించే మూల్యం కేవలం డబ్బులో కాదు– దిగజారే మనోబలంలో ఉంటుంది.

ఒకరిని సస్పెండ్ చేయడం లేదా అరెస్ట్ చేయడం సరిపోదు. వ్యవస్థను శుద్ధి చేయాలంటే లోతుగా చూడాలి– అవినీతికి సహకరించిన నెట్‌వర్క్‌లు, మౌనంగా ఉన్న అధికారులు, లాభపడిన రాజకీయ నాయకుల వైపు చూడాలి. స్వతంత్ర విజిలెన్స్, స్వేచ్ఛతో కూడిన విచారణలు అవసరం. పోలీస్ విభాగంలో ఉన్న విజిల్ బ్లోయర్లకు రక్షణ అవసరం. బదిలీలను రాజకీయ ప్రభావం నుంచి రక్షించాలి.

అత్యంత ముఖ్యంగా– పోలీస్ వ్యవస్థలో చట్టం పట్ల భయాన్ని పునరుద్ధరించాలి, రాజకీయ నాయకులు అంటే కాదు. పదవులు, హోదాలు అవినీతి పరులను రక్షించలేవనే విశ్వాసాన్ని కలిగించాలి. పట్టుబడడం అంటే పరువు పోవడమని, బేరసారాలకు తలుపులు తెరవడం కాదని తెలియజెప్పాలి. అప్పుడు మాత్రమే అతను తీసుకునే ప్రమాణం– "భయమూ, పక్షపాతం లేకుండా సేవ చేయడం"– అర్థవంతమవుతుంది.

భయపడడానికేమి లేదని ఒక సీనియర్ అధికారి భావిస్తే, అవినీతి అనివార్యం అవుతుంది. వ్యవస్థ తనను జవాబుదారీ చేస్తుందని నమ్మితే, నిజాయితీ తిరిగి వస్తుంది. ఏది ఎంచుకుంటామనేది మన చేతుల్లోనే ఉంది– మౌనంగా ఉండడమా లేక ధైర్యంతో ఎదుర్కోవడమా? మౌన అంగీకారమా లేక మనస్సాక్షితో ప్రశ్నించడమా. ఎందుకంటే చట్టాన్ని అమలు చేసేవారు దానికి భయపడకపోతే, ఆ చట్టానికి అర్థమే ఉండదు.

▪ డా. కిరణ్ బేడీ
తొలి మహిళా ఐపీఎస్ అధికారి
అనువాదం: ప్రొఫెసర్ మురళి కర్ణం (నల్సార్)



తుఫాను నష్టంపై కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



కాకుమానులో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ అన్సారియా

నష్టపోయిన రైతులకు అన్యాయం జరగదు

- సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులుతో కలిసి శనివారం పర్యటించిన డాక్టర్ పెమ్మసాని సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి నష్టాలపై సమీక్షించారు. పంట నష్టం లెక్కింపు ఎలా జరుగుతున్నది, నష్టపరిహారం ఎలా చెల్లిస్తారు అనే అంశాలపై ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన అరటి, పసుపు, కూరగాయలు, పూలతోటల సాగుకు ఎంత ఖర్చు అవుతుంది, ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందని అధికారులను ప్రశ్నించారు. వరి దాదాపుగా 2,500 హెక్టార్లలో నీట మునిగిందని, తేమ శాతం పెరిగేటువంటి అవకాశం ఉందని అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. ఎక్కడా రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులకు పెమ్మసాని సూచించారు. ప్రకృతి సహకరించకపోయినా ప్రభుత్వం సహకరించే విధంగా చేయాలనే ఉద్దేశంతో ఈ సమీక్ష చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు, నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాలు, పొలాలు నీట మునిగాయని వారందరికీ న్యాయం జరగాలన్నారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, డీఏవో అయితా నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్లు పెంచిన ఘనత టీడీపీదే

కాకుమాను: సామాజిక పెన్షన్లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కాకుమానులో శనివారం పెమ్మసాని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అనంతరం పునరావాస బాధితులకు రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, కూటమి పార్టీల నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నువ్వుల సునీల్‌చౌదరి, వడ్రాణం హరిబాబు, నల్లమోతు పూర్ణచంద్రరావు, అగస్టీన్, తహసీల్దారు వెంకటస్వామి, ఎంపీడీవో యుగకీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి..రూ.కోటి నష్టం

- తుఫాన్‌తో కోల్పోయిన ఆదాయం
- డిపోలకే మూడు రోజులు బస్సులు పరిమితం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఆర్టీసీకి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. తుఫాన్ ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోవాల్సి వచ్చింది. మరో వైపు తుఫాన్‌తో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. దీంతో గత నెల 27 నుంచి 29 వరకు చార్జీల రూపంలో వచ్చే ఆదాయానికి గండిపడింది.



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్

ఇక అరకొరగా బస్సులు తిరిగినా చాలా తక్కువగా ప్రయాణికులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు. గతంలో నిత్యం గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి చార్జీల రూపంలో రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం వచ్చేది. తుఫాన్‌తో గుంటూరు జిల్లాలోని అన్ని డిపోల్లోనూ రోజువారీ వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని జిల్లా ప్రజారవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. ఇక తుఫాన్ తీరం దాటిన తర్వాత 29న దాదాపుగా అత్యధిక శాతం సర్వీసులు డిపోలకే పరిమి తమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని రూట్లలో బస్సులను రద్దు చేశామని డీపీటీవో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ప్రయాణికులు ప్రయాణాలకు దూరమవడంతో బస్టాండ్లలో వ్యాపారాలు లేక వ్యాపారులకూ నష్టాన్ని మిగిల్చింది. ప్రయాణికుల్లేక బస్టాండ్లలో దుకాణ దారులు దుకాణాలను మూడు రోజులు మూసేశారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

బిల్లులు ఇవ్వకపోతే.. పనులు చేయం

నల్లబ్యాడ్జీలతో కార్పొరేషన్ కాంట్రాక్టర్ల నిరసన

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధి పోర్టల్‌లో బిల్లును చెల్లించాలని లేకపోతే పనులు నిలిపివేస్తామని జీఎంసీ కాంట్రాక్టర్లు తేల్చిచెప్పారు. బిల్లులకు సంబం ధించి శనివారం నగరపాలక సంస్థ కమిషనర్‌తో జరిగిన సమావేశాన్ని కాంట్రాక్టర్లు బహిష్కరించారు. అనంతరం నల్లబ్యాడ్జీలతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులకు సంబంధించి సీఎఫ్ఎంఎస్ నుంచి డీలింగ్ చేసినప్పటికీ కమిషనర్ కార్యాలయంలో మూడు నెలలుగా జాప్యం జరుగుతుందన్నారు. నిధి పోర్టల్‌లో బిల్లులను అప్లోడ్ చేసి ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో చెల్లింపులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. బిల్లుల విషయంలో అభ్యర్థిస్తున్నప్పటికీ కమిషనర్ క్రమపద్ధతి పాటించకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. పలు దఫాలు వినతి పత్రాలు అందజేసినప్పటికీ కమిషనర్ బిల్లులు చెల్లింపులో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బిల్లులకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలకు వివరాలు అందజేశామన్నారు. తమ సమస్య పరిష్కరించకపోతే ఆదివారం నుంచి పనులను నిలిపివేస్తామని నాయకులు హెచ్చరించారు.

పురాలకు పన్ను నొప్పి

- ఆస్తి పన్ను వసూలులో అలసత్వం
- బకాయిలు రూ.76.51 కోట్లు
- పట్టణాల్లో కుంటుపడుతున్న ప్రగతి



మునిసి పాలిటీలకు ఏళ్ల తరబడి 'పన్ను' నొప్పి పట్టి పీడిస్తోంది. పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వసూలులో అలసత్వం తాండవిస్తోంది. సాధారణ నిధుల లేమితో పట్టణాల్లో ప్రగతి కుంటు పడుతోంది. వడ్డీ రాయితీ ఇస్తున్నా.. బకాయిలను సిబ్బంది వసూలు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అంతంతమాత్రమే. కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లింపు, ప్రజలకు మౌలి క వసతులు కల్పనకు పన్ను ఆదాయంపైనే మునిసిపాలిటీలు ఆధార పడుతున్నాయి. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటనల పన్ను పెద్దఎత్తున ఎగవేస్తున్నా చోద్యం చూస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పురపాలక సంఘాలకు రూ.76.51 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాల్సి ఉన్నట్లు మునిసిపల్ పరిపాలన విభాగం లెక్కలు చెబుతున్నాయి. పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా వ్యాపార, వాణిజ్య, రాజకీయ పార్టీల ప్రచార బోర్డు లు ఉంటున్నాయి. వీటి ద్వారా వచ్చే ప్రకటన పన్ను పక్క దారి పడుతోంది. నిబంధనల ప్రకారం ఈ పన్ను విధిం చడంలో.. పట్టీపట్టనట్లు పురపాలకులు వ్యవహరిస్తున్నారు. ప్రకటనలు, వీటి ద్వారా వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఏటా ఒక్కొక్క మునిసిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతుంది. ప్రకటనల ఆదాయం పెంచుకునే ప్రయత్నాలు లేవనే చెప్పాలి. కొందరు యాడ్స్ ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై మునిసిపాల్టీలకు రావాల్సిన ఆదాయాన్ని వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా రాజకీయ, ప్రైవేట్ వ్యక్తుల కార్యక్రమాల సందర్భంగా వేల సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నిటికీ (మిగతా 6వ పేజీలో)

జీఎంసీ ఆర్ఐ సస్పెన్షన్

- గాంధీపార్కు, మరుగుదొడ్ల నగదు స్వాహా



గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని గాంధీ పార్కు, మరుగుదొడ్లకు సంబం ధించి రోజు వారీ ఆదాయాన్ని స్వాహా చేసిన జీఎంసీ ఆర్ఐ కె.సుబ్బారావుని సస్పెండ్ చేసి నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తన పరిధిలోని గాంధీ పార్కు, మరుగుదొడ్ల నుంచి వచ్చే ఆదాయాన్ని ఏ రోజుకారోజు జీఎంసీకి జమ చేయాలి. అయితే ఆయన సంబంధిత గుమస్తాల నుంచి నగదు వసూలు చేసి ఆ సొమ్ముని జేబులో వేసుకున్నాడు. ఇలా ఇప్పటి వరకు 6,44,875 నగదు ను కార్పొరేషన్ ట్రెజరీకి చెల్లించలేదు. ఈ క్రమంలో తొలుత గాంధీ పార్కుకు చెందిన నగదును ఆర్ఐ ట్రెజరీకి చెల్లించడంలేదని మున్సిపల్ అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టగా గాంధీపార్కుతో పాటు మరుగుదొడ్ల ఆదాయాన్ని జీఎంసీకి జమ చేయకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారులు తేల్చారు. అధికారుల నివేదిక ఆధారంగా సుబ్బారావుని విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతడిపై క్రిమినల్ కేసు నమోదు చేయించా లని ఆదేశాలు జారీ చేశారు. మరుగుదొడ్లతో పాటు గాంధీపార్కు ప్రారంభం నుంచి రోజువారీ కలెక్షన్లు, కల్యాణ మండపాల నుంచి వసూ లు చేసిన పన్నులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్ఐలు అక్రమాలకు పాల్పడుతుంటే పై అధికారులు ఏమి చేస్తున్నారనేది అంతుపట్టని విషయంగా మారింది. ఏడాది నుంచి జీఎంసీ ఆదాయానికి గండికొట్టి సొంతానికి వాడుకున్నా వారిపై పర్యవేక్షణ అధికారులు తెలుసుకోలేక పోవడంపై నగరవాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూపు అడ్మిన్లు సహకరించాలి

- అసత్య ప్రచారాలతో సమాజంలో అలజడులు
- అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ వకుల్‌జిందాల్



గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు వాట్సాప్ గ్రూపు అడ్మిన్లు సహకరిం చాలని ఎస్పీ వకుల్‌జిందాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అపోహలకు దారితీసే పోస్టుల వల్ల సమాజంలో అలజడులు రేగుతాయన్నారు. ఈ నేపథ్యంలో వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లకు నోటీసులు ఇచ్చామన్నారు. గ్రూపుల్లో ప్రచా రమవుతున్న సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సామా జిక మాధ్యమాలను సరైన మార్గంలో ఉపయోగించాలనే అవగాహన కల్పించడమే నోటీసుల ఉద్దేశమన్నారు. అడ్మిన్ వివరాలు, గ్రూపులో ఎంత మంది ఉంటారు, గ్రూపులో ప్రచారం అవుతున్న సమాచారం గురించి అడ్మిన్‌కి అవగాహన ఉందా? అనే వివరాలను నోటీసుల ద్వారా సేకరిస్తున్నామన్నారు. పై సమాచారాన్ని తెలుసుకోవడానికే తప్ప ఎవ రినీ కట్టడి చేయడం, భయపెట్టడం లేదా బెదిరించడం కోసం కాద న్నారు. అందరూ సోషల్ మీడియాలపై అవగాహనతో వ్యవహరించాల న్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అంశాల్లో వాస్తవాలను పరిశీలిం చి, ధ్రువీకరించిన సమాచారాన్నే గ్రూపుల్లో పంచుకోవాలన్నారు. సామా జిక మాధ్యమాలను దుర్వినియోగం చేయకుండా, సన్మార్గంలో ఉప యోగించడం ద్వారా శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.

అమృత్ సరోవర్ పనులు వేగవంతం చేయాలి

9 లోగా వెంగళాయపాలెం చెరువు అభివృద్ధి పూర్తి కావాలి • అధికారులకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు మండలం వెంగళాయపాలెం గ్రామంలోని చెరువు వద్ద డబ్ల్యూసీ పథకం కింద చేపట్టిన మోడల్ అమృత్ సరోవర్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ అధికారులకు ఆదేశించారు. చెరువు అభివృద్ధి పనులను శనివారం కృష్ణతేజ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టంచేశారు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన(పీఎంకేఎస్‌వై)పై జిల్లాలో ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని, ఈ నేపథ్యంలో చెరువును పరిశీలించేందుకు ప్రజా ప్రతినిధులు, ఉన్నాతాధికారులు రానున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అమృత్ సరోవర్ పనులను 9వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువు కట్టను పటిష్ఠ పరిచి, వాకింగ్ ట్రాక్‌తో పాటు సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓపెన్ జిమ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ఏడీ శివప్రసాద్, జేడీ సునీత, పర్యవేక్షణ అధికారి శాంతరావు, జిల్లా డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, డ్వామా పీడీ వి.శంకర్, డీపీవో నాగసాయికుమార్, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

ఉత్సవాలపై ఆరా



అమరావతి : క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు (పాత చిత్రం)

- ప్రార్థనలు, వేడుకలపై ప్రభుత్వం దృష్టి
- నివేదిక పంపాలని అధికారులకు ఆదేశాలు
- కాశీబుగ్గ దుర్ఘటనతో ముందస్తు భద్రతకు ఏర్పాట్లు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ దుర్ఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద తొక్కిసలాట జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోతుండటంతో భద్రత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఇక నుంచి జరగబోయే ఉత్సవాలను ఒక క్యాలెండర్ రూపంలో తయారు చేసి పంపాలని సూచించింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఏమిటి? వాటిల్లో జరిగే ఉత్సవాల నిర్వహణ, అవి ఏ తేదీల్లో జరుగుతాయి. సగటున ఎంతమంది భక్తులు వస్తారు. అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలే ఏమిటి వంటి వివరాలపై నివేదిక రూపొందించి పంపాలని ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు వాటిని నివేదించేందుకు కలెక్టరేట్ల అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా పరిధిలోని దేవాలయాలు, చర్చిలలో ఏటా పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దర్గాల వద్ద కూడా ఉరుసు ఉత్స వాలు భారీగా జరుగుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రముఖ ఆలయాలు, చర్చిలు, దర్గాల వద్ద ఉత్సవాలు జరిగేటప్పుడు ఆయా నిర్వాహక కమిటీలు ముందుగానే పోలీసులకు తెలియజేస్తాయి. దాంతో వాటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి తొక్కిసలాట జరగకుండా క్రమబద్ధీకరిస్తుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమరావతి, మంగళగిరిలో రథోత్సవం భారీగా జరుగుతోంది. అలాగే పొన్నూరు, చేబ్రోలు, బాపట్ల, తెనాలిలోనూ వివిధ పండుగల సమయాల్లో ఉత్సవాలు జరుగుతుంటాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ మహాసభలు, గోరంట్లలో హోసన్నా మందిరం ఉత్సవాలు జరుగుతుంటాయి. వీటికి ఏటా వేలల్లో భక్తులు తరలి వస్తుంటారు. మస్తాన్‌దర్గా, పెదకాకాని బాజీబాబా ఉరుసు మహోత్సవాలు, ఫిరంగిపురంలో చర్చి ఉత్సవాలకు కూడా జనాలు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇవికాక కంతమరాజు కొండూరు, కొండపాటూరు తిరునాళ్ల, గోవాడలోని ఆలయాల వార్షికోత్సవాలు కూడా భారీగా నిర్వహిస్తారు. పల్నాడు జిల్లాలోని కారంపూడిలో వీరారాధన ఉత్సవాలకు కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. శివరాత్రి సమయంలో కోటప్పకొండ తిరునాళ్ల, అమరావతిలో రథోత్సవం, బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవాలు జరుగుతాయి.

బాపట్ల జిల్లాలోనూ భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ప్రార్థనాలయాలు ఉన్నాయి. కొన్ని దేవాలయాలు దేవదాయశాఖ ఆధీనంలో లేకపోవడంతో అవి ప్రైవేటు కమిటీల పర్యవేక్షణలో కొనసాగు తున్నాయి. దీని వలన వాటిల్లో జరిగే ఉత్సవాల గురించి పోలీసుశాఖకు తగిన సమాచారం ఉండటం లేదు. దీని వల్ల అనూహ్యంగా భక్తులు వస్తే తొక్కిసలాట జరుగుతున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలే జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ప్రభుత్వం అన్ని దేవాలయాలకు సంబంధించిన ఉత్సవాలతో ఒక క్యాలెండర్‌ని రూపొందించాలని నిర్ణయించింది. ఆ మేరకు తగిన భద్రత చర్యలు చేపట్టడం ద్వారా ఇకపై తొక్కిసలాట సంఘటనలకు ఆస్కారం లేకుండా చూసేందుకు నివేదికలను పంపాలని ఆదేశించింది.

ఆంధ్రజ్యోతి అందిస్తుంది

అద్భుతమైన ఉద్యోగ అవకాశం



మంచి వాక్చాతుర్యము, కృషి, పట్టుదల, ఆసక్తి, ఉత్సాహము, ఓర్పు నేర్పులతో ఎదుటి వారిని మెప్పించి ఒప్పించి

అడ్వర్‌టైజ్‌మెంట్స్ సేకరించే సమర్థులకు అవకాశం

రిప్రజంటేటివ్స్ * Males Only

విద్యార్హత : Inter / Degree

వయస్సు : 22 సం॥ నుండి 35 సం॥ల మధ్య

అనుభవం : తెలుగులో చక్కగా మాట్లాడటం, చదవటంతో పాటు ఇంగ్లీషు భాష పై అవగాహన ఉంటే చాలు.

పనిచేయవలసిన కేంద్రాలు : గుంటూరు సిటీ, బాపట్ల, రేపల్లె

ఆసక్తి కలవారు పూర్తి వివరములతో కూడిన బయోడేటాను bm.gnt@andhrajyothy.com కు మెయిల్ పంపవచ్చును.

(నేరుగా సంప్రదించదలచిన వారు 7-11-2025 న ఈ దిగువ అడ్రస్‌లో 11 AM to 1 PM లోపు సంప్రదించవచ్చు.)

ఆంధ్రజ్యోతి, 4/1 బ్రాడీపేట, 3వ అంతస్తు, రఘుమాన్షన్స్, గుంటూరు.

'డాక్టర్ రెడ్డీస్'లో ఉద్యోగాలకు ఏఎన్‌యూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బోటనీ, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ విద్యార్థులు హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ లేబోరేటరీస్‌లో ఇంటర్న్‌షిప్‌తో పాటు శాశ్వత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఈ నెల 3 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతి విద్యార్థికి నెలకు రూ.25వేలు పారితోషకం లభించనుంది. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు రూ.5 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అరిస లక్ష్మి అనూష, జి.సత్తిబాబు, భావనా, వేమూరి శైలజ, రోహిణి లింగుడు, సొంగా అజయ్ సుజిత్ ఈ అవకాశాన్ని దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య విద్యార్థులను అభినందించారు. ప్రాంగణ నియామకాల అధికారులు డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య ఉమామహేశ్వరరావు, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

పీజీ, యూజీ పరీక్షల ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బీటెక్, బీఈడీ, ఎంఎస్సీ నానో టెక్నాలజీ, ఎంటెక్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు శనివారం విడుదల చేశారు. రీవాల్యూయేషన్ దరఖాస్తులు ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని సూచించారు. పేపర్‌కు రూ.1,860, జవాబు పత్రాల పరిశీలనకు రూ.2,190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

'చలపతి' ఆంజనేయులుకు డాక్టరేట్


వైవీ ఆంజనేయులు

తాడికొండ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులుకు అమెరికాలోని వెర్మంట్‌లో ఉన్న బర్లింగ్టన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విద్యా, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ఇచ్చింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేజీ నుంచి పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను స్థాపించి విద్యా ప్రదాతగా చలపతి ఆంజనేయులు పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవ చేశారు. యలమంచిలి ఫౌండేషన్ ద్వారా విద్యా, వైద్యం, ఆధ్యాత్మికం పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి వైవీ ఆంజనేయులుకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని చలపతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

చింతలతండాలో వైసీపీ కార్యకర్త ఉన్మాదం

● మహిళను కత్తితో పొడిచిన చందర్‌నాయక్

విజయపురిసౌత్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వితంతవును లోబరుచుకోవడమే కాకుండా.. ఆమె ద్వారా ఆర్థికంగా లబ్ధి పొంది.. తిరిగి నగదు ఇవ్వాలన్నందుకు వైసీపీ కార్యకర్త కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మాచర్ల మండలం చింతలతండాలో జరగగా.. ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. చింతలతండా గ్రామానికి చెందిన రమావత్ రాణితో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రమావత్ చందర్ నాయక్ సాన్నిహిత్యం ఏర్పరుచుకున్నాడు. ఆమె ద్వారా కొంతమంది నుంచి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలంగా అప్పుల వాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని రాణిని అడుగుతున్నారు. దీంతో డబ్బులు ఇవ్వాలని గత నెల 13న చందర్‌నాయక్‌పై రాణి ఒత్తిడి తెచ్చింది. ఆగ్రహానికి గురైన చందర్‌నాయక్ అదే రోజు కత్తితో రాణిని పలుమార్లు పొడిచాడు. ఎస్ఐ అశోక్ రాణిని మాచర్ల గుంటూరుకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స అనంతరం బయటకు వచ్చిన బాధితురాలు శనివారం మీడియాతో తనగోడు వెల్లబోసుకుంది. అయితే.. నిందితుడు చందర్‌నాయక్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేస్తాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ● రూ.10 కోట్ల విరాళంతో ముందుకొచ్చిన దక్కన్ టుబాకో


ఎంవోయూతో డీఎంఈ రఘునందన్, రమణ యశస్వి, షఫిక్ ఖాన్, చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని రాబోయే నాలుగేళ్లల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేశామని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.10 కోట్ల వ్యయంతో నూతన ఆర్థో, ట్రామా బ్లాక్‌ను నిర్మించేందుకు దక్కన్ టుబాకో ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ముందుకు వచ్చింది. శనివారం శుశృత హాల్‌లో దీనిపై ఎంఓయూ కుదిరింది. కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రభుత్వం తరపున వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జి.రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, దక్కన్ టొబాకో ఎక్‌పోర్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షఫిక్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దక్కన్ సంస్థ ప్రపంచస్థాయి నాణ్యత ప్రమాణాలతో జీ ప్లస్ ఐదు అంతస్తులతో ఆర్థో, ట్రామా బ్లాక్‌ను నిర్మిస్తుందని తెలిపారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభి స్తారని, 18 నెలల్లో పనులు పూర్తి చేస్తారని వివరించారు. ఈ బ్లాక్‌లో 85 సాధారణ పడకలు, 15 ఐసీ యూ బెడ్స్, రెండు ఆపరేషన్ థియే టర్లు, ఫిజియోథెరపీ యూనిట్ వంటివి ఉంటాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ..14 నెలల్లోనే గుంటూరు జీజీహెచ్‌కు రూ.82 కోట్లు సీఎస్ఆర్ నిధులు సమకూర్చినట్లు పెమ్మసాని వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ అజీజ్ ఖాన్ ఆర్థో అండ్ ట్రామా బ్లాక్‌గా నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత, కూటమి నేతలు గాదె వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, వడ్రాణం హరిబాబు, హెచ్‌డీఎస్ సభ్యులు డాక్టర్ ఎస్.ఉమాశంకర్, డాక్టర్ సయ్యద్ రసూల్ పాల్గొన్నారు.

కడుపు మంటతో రగిలిపోతున్నారు

● రాష్ట్రాభివృద్ధిని తట్టుకోలేని వైసీపీ నేతలు ● ఎమ్మెల్యేలు యరపతినేని, కన్నాలక్ష్మీనారాయణ

దాచేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్, పరిశ్రమలు రావడం, సూపర్ 6 పథకాలు అమలవడంతో.. ఎక్కడా లేని ఆవేదన, కడుపు మంటతో వైసీపీ నేతలు రగిలిపోతున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలో ఏదో ఒకటి జరగాలి, ప్రభుత్వం అప్రతిష్ట కావాలి, కులాల కుంపట్లో చలి కాచుకోవాలనేలా వారి తీరు ఉందని మండిపడ్డారు. గత ఎన్నికల్లో 11 సీట్లతో ఆ పార్టీని ప్రజలు సరి పెట్టినా ఆత్మవిమర్శ చేసుకోలేదని, వారి భాషలో మార్పు లేదని యరపతినేని దుయ్యబట్టారు. శనివార పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పతనమైందన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా ఒకటవ తేదీ వచ్చిందంటే రాష్ట్రంలో పెద్ద పండుగగా మారింది. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం గంట కూడా ఆలస్యం చేయకుండా లబ్ధిదారులకు అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో కూడా ఆరు వందలు, ఏడు వందల రూపాయలు పింఛను ఇస్తుంటే.. ఇక్కడ నాలుగు వేల రూపాయలు ఇస్తున్నామన్నారు.

2029లో జగన్ మోహన్‌రెడ్డి గెలిచే పరిస్థితి లేదు

దాచేపల్లి ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేనితో పాటు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై విలేకరులతో మాట్లాడుతూ.. 2029 ఎన్నికల్లో పులివెందుల నుంచి జగన్‌మోహన్‌రెడ్డి గెలిచే పరిస్థితులు లేవని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం కనుమరుగైందని కన్నా విమర్శించారు. పోలీసు కేసులు పెట్టడం మినహా జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

సాతులూరులో పోలీసుల కార్డెన్ సెర్చ్

మారణాయుధాలు, 28 మోటారు బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మారణాయుధాలతో డీఎస్పీ హనుమంతరావు, సీఐ సుబ్బనాయుడు తదితరులు

నాదెండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో పోలీసులు శనివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు, రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో గల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో పాటు పత్రాలు లేని 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా వారి వివరాలను పోలీసులకు అందించాలన్నారు. ఈ తనిఖీల్లో పట్టణ సీఐ రమేష్, ఎస్ఐలు పుల్లారావు, చెన్నకేశవులు, అనీల్, రహమతుల్లా, 127 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పురాలకు పన్ను నొప్పి..

(5వ పేజీ తరువాయి)

ప్రకటన పన్ను వసూలు చేయాలి. కానీ, పరిస్థితి ఇందుకు భిన్నం గా ఉంది. పన్ను వసూలు చేయక పోగా.. వాటిని తొలగించడానికి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తు పరిస్థితి కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నెలకొంది. ప్రకటనల పన్ను ఆదాయం పెంచుకొనే దిశగా పురపాలకుల చర్యలు లేవన్న విమర్శలున్నాయి.

పేరుకుపోతున్న ఆస్తి పన్ను బకాయి

ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో సహా పన్నుల బకాయిలు భారీగానే ఉన్నాయి. ఈ జిల్లాలో రూ.61.63 కోట్లు పన్ను బకాయిలు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. జీఎంసీలో రూ.53.11 కోట్లు, మంగళగిరి మునిసిపాల్టీలో రూ.4.89కోట్లు బకాయిలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని మునిసిపాల్టీలకు సంబంధించి రూ.3.72 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది. చీరాల పురపాలక సంఘంలో రూ.1.92 కోట్లు వసూలు చేయాలి. పల్నాడు జిల్లాలోని మునిసిపాల్టీల్లో రూ.11.16 కోట్లు బకాయి ఉంది. ఒక్క నరసరావుపేట మునిసిపాల్టీలో రూ.3.62 కోట్లు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మునిపాల్టీల్లో రూ.2 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. బకాయి వసూలు చేస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఈ దిశగా పురపాలకులు స్పందించాలి.

దేశంలో పది అగ్రశ్రేణి కళాశాలల్లో ఒకటిగా జీఎంసీ

● ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి


డాక్టర్ సుందరాచారిని అభినందిస్తున్న మహిళా వైద్యులు

గుంటూరు మెడికల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కాలేజీని దేశంలోని పది అగ్రశ్రేణి మెడికల్ కళాశాలల్లో ఒకటిగా నిలబెట్టడం తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. జీఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుందరాచారి బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కాలేజీలో జీఎంసీ 365 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 80 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విద్యా సంస్థలో తాను చదివి, ప్రిన్సిపాల్‌గా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. కళాశాలలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తే వైద్య విద్య బోధన ప్రమాణాలు మరింత మెరుగౌతాయని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి లెక్చర్ గ్యాలరీని ఆధునీకరించి, అధునాతన స్మార్ట్ బోర్డులతో, సాంకేతిక వసతులతో బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రయోగశాలలను కూడా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో గుంటూరు మెడికల్ కాలేజ్ అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు, సామాజిక సేవా భావం కలిగిన దాతలు కలిసి సుమారు రూ.7.7 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కళాశాల సీడీఎస్ నిధుల ద్వారా సుమారు రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గుడి వద్ద వివాదం.. తెరుచుకోని ఆలయ ద్వారాలు

చుండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్నంగివారిపాలెంలోని తుంగభద్ర కాల్వ పక్కనే ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర పాన వినాశేశ్వరస్వామి దేవాలయం వద్ద శనివారం పూజలు విషయంలో వివాదం ఏర్పడింది. ఏండోమెంట్ పరిధిలోని ఈ దేవాలయానికి శాశ్వత ధర్మకర్తనంటూ గ్రామానికి చెందిన గాదె బాలకోటిరెడ్డి దేవాలయ తాళాలు తన దగ్గర ఉంచుకుని తలుపులు తెరవలేదు. శనివారం కార్తిక మాస ఏకాదశి పర్వదినం కావడంతో భక్తులు పూజల కోసం అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ అధికారి నాగలక్ష్మి ఆలయంపై ఎలాంటి హక్కులు, అధికారులు లేవని ఇది ఎండోమెంట్ పరిధిలోనిదని బాలకోటిరెడ్డిని వారించినా.. తాళాలు ఇవ్వలేదు. గ్రామ సర్పంచ్ శ్రీరామమూర్తి, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసినా, ఈవో నచ్చజెప్పినా వినకపోవడంతో.. మధ్యాహ్నం వరకు వేచి ఉన్న మహిళా భక్తులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానని ఈవో తెలిపారు.


గుడి తాళాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్న బాల కోటిరెడ్డి

ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ విద్యార్థుల పాత్ర కీలకం

● సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌చంద్ర

గుంటూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ విద్యార్థులు కీలక భూమిక పోషిస్తారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్‌చంద్ర అన్నారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటి, స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌చంద్ర మాట్లాడుతూ స్వచ్ఛతా లక్ష్యాలను సాధించేందుకు ఆరోగ్య వృత్తి నిపుణులు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వం, పారిశుధ్యం అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేమూరి వసుంధర తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ, స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సీబీసీ ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.


మొక్కలు నాటుతున్న అధికారులు సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌చంద్ర తదితరులు

స్టాలిన్‌బాబు సేవలు చిరస్మరణీయం : రామకృష్ణ

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుగా, విద్యార్థి, యువజనోద్యమ నేతగా, ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకుడిగా బొప్పూడి స్టాలిన్‌బాబు అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశంసించారు. బొప్పూడి స్టాలిన్‌బాబు ఆత్మీయ నివాళి సభ గుంటూరు శ్యామలనగర్‌లోని మెట్టు మల్లారెడ్డి కన్వెన్షన్ హాలులో శనివారం జరిగింది. అవగాహన సంస్థ కార్యదర్శి కొండ శివరామిరెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ స్టాలిన్‌బాబు ఉపన్యాసం సుదీర్ఘంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. మరికొంత కాలం ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగి ఉంటే సురవరం సుధాకర్‌రెడ్డి తరువాత అంతటి స్థాయికి ఎదిగి ఉండేవారన్నారు. విలువలనేవే లేకుండా పోతున్న ప్రస్తుత సమాజంలో ఇంతమంది శ్రేయోభిలాషులు, మిత్రులను సంపాదించుకున్న స్టాలిన్ బాబు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 'స్టాలిన్' అనే పేరు ఒక స్ఫూర్తి అని, అటువంటి పేరు పెట్టుకున్న స్టాలిన్ బాబు వందలాది మంది ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు తయారు కావడానికి కారకుడు అయ్యాడని అన్నారు. ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ భీమిశెట్టి మార్కండేయులు మాట్లాడుతూ ఎల్ఐసీలో ఎంతోమంది నాయకులను తయారు చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారన్నారు. వారిలో తాను ఒకడినని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ సీఈవో నాగళ్ళ రఘు రామ్ మాట్లాడుతూ స్టాలిన్‌బాబు సంఘజీవి అని, ఎంతో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వారని కొనియాడారు. స్టాలిన్ బాబు విజయాల వెనుక ఆయన సతీమణి మరుధ్వతి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా స్టాలిన్‌బాబు చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆర్.రాము, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వర రావు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

→ తెనాలిలో మా షాపులో పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత : టెన్త్ టు డిగ్రీ, జీతం : 10,000/- సంప్రదించండి సెల్ : 9885128384
AJG-248944

→ గుంటూరు అరండల్‌పేట నందు ప్రముఖ హోటల్లో వర్క్ చేయుటకు టిఫిన్ మాస్టర్, హెల్పర్స్, వెయిటర్స్, కెప్టెన్, హోటల్ బాయ్స్ కావలెను. సంప్రః 99009 61963.
AJG-249444

→ TATA లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకు ఏజెంట్స్ కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. సంప్రః 94908 66938.
AJG-239721

లీకేజీ సమస్యలా?

→ బాత్‌రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజీపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్రః 9642458892
AJG-248896

బోర్ వెల్స్

→ విజయ బోర్ వెల్స్ : 4-1/2, 6-1/2; 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్రః 98662 22717, 98481 83887.
AAA-10313

మీ సర్టిఫికేట్స్ పోయినవా?

→ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొః సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616.
AJG-249237

అమ్మకము

→ కోటి గ్రానైట్స్ - న్యూ స్టాక్, Export Finished, బల్క్ స్టాక్ గ్రానైట్ స్లాబులపై ప్రత్యేక డిస్కౌంట్, సాయిబాబు రోడ్, కొరిటెపాడు, గుంటూరు. సెల్ : 94402 49796
AJG-249441

రియల్ ఎస్టేట్

→ దీపావళి ఆఫర్ : పల్నాడు జిల్లా, నరసరావుపేట & చిలకలూరిపేట, NH-16 హైవే వద్ద తక్కువ ధరకే ప్లాట్లు - స్పాట్ రిజిస్ట్రేషన్, సంప్రః 88975 98338.
AJG-249406

→ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మర్రెడెనా ప్లాట్లు అ/కొ. సంప్రః జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత, Ph : 9492770739.
SAAA-951

స్థలం అమ్మకము

→ తెనాలి, చెంచుపేట టీటీడీ కళ్యాణ మండపం ప్రక్క రోడ్డులో 389 చ.గ. స్థలం అమ్మకమునకు కలదు. సంప్రదించండి : 98491 85750, 79896 72718.
AJG-249095

→ తెనాలి, ఐతానగర్ నుండి తేలప్రోలు రోడ్డులో కంటి హాస్పిటల్ ఎదురు 255 గజాలు, నందుల పేట భాస్కరరావు దిబ్బ దగ్గర 153 గజాల స్థలాలు అమ్మకమునకు కలవు. C/o : R.R. ఫర్నిచర్, గాంధీచౌక్, తెనాలి. సంప్రః 9866032266, 8125559945.
AJG-248937

PLOT FOR SALE

→ గుంటూరులోని మిర్చి యార్డు ప్రక్కన గల సుబ్బారెడ్డి నగర్ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ వెనుక తూర్పు 74 గజాలు ప్లాట్ ఇళ్ల మధ్యలో అమ్మకానికి కలదు. గజం 13,000/- సంప్రః 99080 54955.
AJG-249298

→ కొండవీడు ఇస్కాన్ టెంపుల్ స్పైసెస్ పార్క్, ఏపీ ప్రభుత్వ లాజిస్టిక్ పార్క్, వినోదక్రీడల ప్రాంత పరిధిలో గల జయకృష్ణ బృందావనం వెంచర్ 60' రోడ్‌కు CRDA అప్రూవ్డ్ ప్లాటు అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. సంప్రః 90523 65959.
AJG-249440

→ పాత గుంటూరు, బాలాజీ నగర్ 100ft. రోడ్ నందు ప్లాట్ నెం. 9 మెయిన్ రోడ్ ఫేస్‌లో జీరో లైన్ నందు నార్త్ ఫేస్ కొలతలు : వెడల్పు 36.6, లోతు 53 కొలతలు గల 214.94 గజాల ప్లాట్ అమ్మకానికి కలదు. సంప్రః 96423 00696, 98482 18869, 99853 37361.
AJG-249439

→ For sale of 40x60 rectangular 267 Sq Yards west facing corner bit with south road also at Venkataramana colony, Guntur. Cell: 94400 74770
AJR-240419

ఇల్లు అమ్మకము

→ పొన్నూరు రోడ్ పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌కు 200 మీ.ల దూరంలో తూర్పు ఫేస్ గల 272 చఃగః 2 అంతస్తుల ఇల్లు అమ్మకానికి కలదు. అద్దె 45,000 వచ్చును. ఇంటి ముందు 100 అః రోడ్ ఉంది. సంప్రః 63027 27534.
AJG-249442

→ గుంటూరు, బ్రాడీపేట 2/17-18వ లైన్, BH కాలేజీ ఎదురు, 225 చఃగః (వెః27 X పొః72) పాత డాబా, సౌత్ ఫేస్ డాబా ఇల్లు అమ్మబడును. సంప్రః 8919144162.
AJG-249363

FLAT FOR SALE

→ గుంటూరు, గుజ్జనగుండ్ల పెద్ద పలకలూరు రోడ్డు కరెంటు ఆఫీసు, Opp. రోడ్డులో సాయి కృష్ణనగర్, 3వలైన్‌లో శ్రీ సాయి కృష్ణ ఆర్చెడ్‌లో 3BHK ఇండిపెండెంట్ ఫ్లాట్స్ మొత్తం 5.2313Sft తూర్పు ఫేసింగ్ ఫుల్ ఫినిష్డ్ ఫ్లాట్ అమ్మబడును. ఫోన్ : 9849470552.
RK-613

→ గుంటూరు, మల్లిఖార్జునపురం హరిహర ఎంక్లేవ్ నందు 3BHK (2900 Sft) నార్త్ ఫేస్, ఫుల్లీ ఫినిష్డ్, 5 ఫ్లోర్స్, 5 ఫ్లాట్స్ అమ్మకం సంప్రః 9391511135.
AA-297

→ గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు భగత్‌సింగ్ బొమ్మ దగ్గరలో రెడీ టూ ఆక్యూపై 3BHK 2300 Sft, డ్యూప్లెక్స్ ఈస్ట్ ఫేసింగ్ అమ్మకం. సంప్రః 9490960449.
AA-280

అద్దెకు

→ మంగళగిరిలో గౌతమబుద్ధ రోడ్, మసీదు ఎదురు తూర్పు ఫేసు షాపు ముందు భాగము 12x25 వెనుక గోడౌను 27x57 మొత్తం 1800 చ.అ అద్దెకు ఇవ్వబడును. చ.అ. 40 రూ. ✆ 8639676544, 9394530322
AJB-259806

కమర్షియల్

→ 3BHK ఇండిపెండెంట్ హౌస్ గ్రౌండ్ ఫ్లోర్ ఆఫీసులకు / రెసిడెన్షియల్‌గా అద్దెకు కలదు. కార్ పార్కింగ్ సౌకర్యం, బండ్లమూడి కాంప్లెక్స్, అమరావతి రోడ్డు, గుంటూరు. సంప్రః 9490217918, 86398 44228.
AAA-10144

→ హాస్టల్స్/హాస్పిటల్స్‌కు అనువైన 12 B/R విత్‌అటాచ్ బాత్‌రూమ్స్ 1&2 ఫ్లోర్లు అద్దెకు కలదు, చుట్టుగుంట సెంటర్ సిగ్నల్స్ దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. ✆ 94905 11849
AJB-235771

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!


ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	91103 23914
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	97048 67908
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

SUPER HIT



మైత్రి కాంప్లెక్స్	గుంటూరు
వి.ప్లాటినో కాంప్లెక్స్	గుంటూరు
శ్రీలక్ష్మి	తెనాలి
గోరంట్ల కాంప్లెక్స్	ఒంగోలు
శ్రీనివాస	సత్తెనపల్లి
శ్రీ వెంకటేశ్వర	చిలకలూరిపేట

SUCHIN CINEMAS RELEASE

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, చిట్టాబత్తిన చిట్టిబాబు

చేనేత, చర్మకారులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులు, చర్మకారులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. నియోజకవర్గంలోని సంజీవనగర్, రాజీవ్ నగర్ కాలనీల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబుతో కలిసి శనివారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిదారులకు అండగా నిలిచేందుకు సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికుల కోసం పథకం ప్రవేశపెట్టి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచిందని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని నిలిపి వేసిందని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. మొంథా తుపాను నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నంటే నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా 24 గంటలు పర్యవేక్షించామన్నారు. పింఛన్ తీసుకుంటూ భాగస్వామిలో ఒకరు చనిపోతే మరొకరికి వెంటనే పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బారది, గోళ్ల ప్రభాకర్, కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మొంథా బాధితులకు నిత్యావసరాల పంపిణీ

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత భౌతికశాస్త్ర అధ్యాపకులు మేకా తులసమ్మ మొంథా తుపాను బాధితులకు శనివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. తుపానుతో నష్టపోయిన గుంటూరు నగర శివారు ప్రాంతం నాగారం కాలనీవాసులకు నెలకు సరిపడా బియ్యం, కందిపప్పు, నూనె తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. కొత్తపేటలోని లలితా హాస్పిటల్లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో దాత తులసమ్మతో పాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, లలితా హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ పీవీ రాఘవశర్మ, డాక్టర్ పీ విజయ, డాక్టర్ అనురాగ్, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బాధితులకు నిత్యావసర వస్తువులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర, తులసమ్మను అభినందించారు. గతంలో తుపాను బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు తులసమ్మ వ్యక్తిగతంగా రూ.5 లక్షల నగదును విరాళంగా అందజేసినట్లు మేయర్ గుర్తు చేశారు.



బియ్యం అందజేస్తున్న మేయర్ రవీంద్ర, దాత తులసమ్మ

నేడు ఉచితంగా ఎముకల పటుత్వ పరీక్షలు

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్లో ఆదివారం ఉచితంగా ఎముకల పటుత్వ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ, పంచకర్మ వైద్యనిపుణులు కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరంలో ముంబైకి చెందిన గుఫిక్ హెల్త్‌కేర్ కంపెనీ సహకారంతో రూ.2 వేలు విలువైన ఎముకల పటుత్వ పరీక్షలు ఉచితంగా చేస్తామని ఆయన వివరించారు. వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో క్యాల్షియం, మినరల్స్ స్థాయి తగ్గి ఎముకలు బలహీనపడతాయని ఆయన వివరించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా నాడీ పరీక్షలు, బీపీ, కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు.



వికాస్ ఆసుపత్రి యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ గళ్ళా రామచంద్రరావు, ఎమ్మెల్యేలు నసీర్, గళ్ళా మాధవి

అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ కేంద్రం వికాస్ హాస్పిటల్

● సీఎండీ గళ్ళా రామచంద్రరావు, ఎమ్మెల్యేలు నసీర్, గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యాధునిక సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా వికాస్ హాస్పిటల్ ఉందని, హాస్పిటల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మరో యూనిట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఆసుపత్రి సీఎండీ గళ్ళా రామచంద్రరావు, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్ అన్నారు. అమరావతి రోడ్డులోని, రాయల్ ఓక్ ఎదురుగా నవంబరు 1న నూతన క్లినిక్ ప్రారంభోత్సవ వేడుక జరిగింది. వికాస్ హాస్పిటల్ సీఎండీ గళ్ళా రామచంద్రరావు క్లినిక్‌ను లాంఛనంగా ప్రారంభించగా, కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్, టీడీపీ నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎండీ గళ్ళా రామ చంద్రరావు క్లినిక్ లక్ష్యాన్ని వివరించారు. కుటుంబం మొత్తానికి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా, ప్రజలకు మరింత చేరువలో ఉండేలా వికాస్ క్లినిక్‌ను రూపొందించామన్నారు. వైద్య నిపుణుల సేవలను మరింత ఎక్కువ మంది ప్రజలకు చేరువ చేయాలనేది తమ నిరంతర లక్ష్యమని, అదే నిబద్ధతతో తాము నిపుణులైన కన్సల్టెన్సీ, సౌకర్యవంతమైన ఇన్‌క్లినిక్ డయాగ్నోస్టిక్ సేవలను గుంటూరు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

నేడు పీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావన్‌గార్డెన్స్‌లో ఉన్న ఈపీఎఫ్‌ఓ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ఏపీ స్టేట్ ఈపీఎఫ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌వీ హనుమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కార్పొరేట్ ఆస్పత్రులు ఇందులో భాగస్వామ్యం అయ్యాయన్నారు. పెన్షనర్స్‌తో పాటు ప్రస్తుతం సర్వీసులో ఉన్న మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా వైద్య సలహాలు, మందులు అందిస్తారని తెలిపారు. ఈ సదుపాయాన్ని పెన్షనర్స్ అంతా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిర్యాణము
శ్రీ గింజుపల్లి చిన్న వీరయ్య చౌదరి గారు
మేనేజింగ్ పార్టనర్: శ్రీ జీ.వీ.ఆర్ చౌదరి మెడికల్ స్టోర్స్
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు.
శ్రీ జీవీఆర్ చౌదరి మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్
బృందావన్ గార్డెన్స్, గుంటూరు
ది.01-11-2025 శనివారం స్వర్గస్తులైనారని తెలియపర్చుటకు చింతిస్తున్నాం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ అశ్రునయనాలతో అంజలి ఘటిస్తున్నాం.
కీ.శే. గింజుపల్లి చిన్న వీరయ్య చౌదరి గారు
జననం: 05-08-1951 మరణం: 01-11-2025
ఇట్లు: కుటుంబ సభ్యులు
అంతిమయాత్ర: ది.02-11-2025 ఆదివారం ఉ. 10 గంటలకు గుంటూరు, కె.వి.పి. కాలనీ రోడ్ లోని శ్రీ నిలయం అపార్ట్‌మెంట్‌లోని మా స్వగృహము నుండి బయలుదేరును.
KALYANI ADS

మాతృ మరణాల నివారణ అందరి బాధ్యత

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైరిస్కు గర్భిణీలను డాక్టర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మాతృ మరణాల సమీక్షా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రాజీవ్ గాంధీ నగర్, ఐపీడీ కాలనీ, సుద్దపల్లి డొంక, ఏటుకూరు పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన నాలుగు మాతృ మరణాలపై కమిటీ సభ్యులు సమీక్ష జరిపారు. ఇందులో మూడు మాతృ మరణాలు నివారించదగినవిగా, ఒక మరణం నివారించలేనిదిగా కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, మాతృ మరణాల నివారణ అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, డీఐవో డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, హెల్త్ సూపర్‌వైజర్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



మధురవాణికి అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, రమణ యశస్వి

మధురవాణికి గానరత్న అవార్డు

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన సాహితీరత్న చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వర్ధమాన గాయని ఎంఎస్ మధురవాణికి గాన రత్న అవార్డును ప్రదానం చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుత హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు తదితరులు మధురవాణికి గానరత్న అవార్డును, మెమోంటోను ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆమె సేవలను అభినందించారు. మధురవాణి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్‌లో యాంకర్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రమణ యశస్వి పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు.

అమరజీవి త్యాగాలను విద్యార్థులు విస్మరించొద్దు

● గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

గుంటూరు(విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని విద్యార్థులు స్మరించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆలోచన వల్ల ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆర్.కుమార్ లైబ్రేరియన్స్ జి.శ్రీనివాసరావు వి.విజయ కుమార్ జూనియర్ అసిస్టెంట్స్ జి.శ్రీనివాసరావు వై.బ్రహ్మయ్య టైపిస్ట్ జి.రాజేష్ రికార్డు అసిస్టెంట్ యం. సంజయ్ ఆఫీస్ సబార్డినేట్స్ పర్వీన్ సుల్తానా వి. రాజేశ్వరి సి.హెచ్. వంశీ కృష్ణ కె.ఫణిభూషణం ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం ముందుకు సాగాలి

● మాజీ ఎంపీ మోదుగుల

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం మరింత ముందుకు సాగాలని మాజీ ఎంపీ, వైసీపీ కోఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాల కల ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. అనుకోని పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయిందని, అభివృద్ధిలో రెండూ ముందుకు సాగాలని కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా వైసీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పలువురు కార్పొరేటర్లు, నాయకులున్నారు.

తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలి : కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏఈల వారీగా ప్రజలకు తాగునీటి సరఫరా, డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. అధికారులు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సానుకూల ధోరణితో అర్థం చేసుకొని పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. శనివారం కమిషనర్ కావేరి నగర్, కేవీపీ కాలనీ మెయిన్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీరాం నగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ అంగడి రాజేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జ్యోతి బసు, చిత్రంలో డిప్యూటీ సీఈవో కృష్ణ

కోటేశ్వరరావు సేవలు అభినందనీయం

● సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌గా తన వృత్తి ధర్మాన్ని 39 సంవత్సరాల పాటు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్న బాల కోటేశ్వరరావు సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతిబసు అన్నారు. పంచాయతీరాజ్‌లో డ్రైవర్‌గా పనిచేసిన మైనేని బాల కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అభినందన, వీడ్కోలు సభలో సీఈవో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు ఆయన సతీమణి రజిని దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఏవో సాగర్ రెడ్డి, కోటేశ్వరరావు నాయక్, సుబ్బారావు, వలీ, పృథ్వి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గింజుపల్లి చిన్నవీరయ్య చౌదరి కన్నుమూత



చిన్న వీరయ్య చౌదరి (ఫైల్)

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిన్నాటవర్ సెంటర్‌లోని చౌదరి మెడికల్ షాపు వ్యవస్థాపకుడు గింజుపల్లి వెంకటరామయ్య చౌదరి మూడో కుమారుడు గింజుపల్లి చిన్న వీరయ్య చౌదరి (76) శనివారం గుంటూరులో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. వారి తండ్రి వెంకటరామయ్య చౌదరి సుమారు ఏడున్నర దశాబ్దాల కిందట జిన్నాటవర్ సెంటర్‌లో జీవీఆర్ చౌదరి మెడికల్స్‌ను ఏర్పాటు చేశారు. జిన్నాటవర్ సెంటర్‌తో పాటు బృందావన్‌గార్డెన్స్‌లోని షాపు ద్వారా వినియోగదారులకు నాణ్యమైన ఔషధాలు అందిస్తూ సేవలందిస్తున్నారు.

ఏసీబీపై విద్యార్థులకు అవగాహనుండాలి

గుంటూరు(విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) పనితీరుపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏసీబీ గుంటూరు రెంజ్ విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అక్రమార్కుల్ని గుర్తించేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని, ఇందు కోసమే తమ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల విభాగంలో మెంపల్లి జ్యోతి, పి.శాంతిశ్రీ, షేక్ జహీరా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుతులు సాధించారు. అదే విధంగా వ్యాసరచన పోటీల్లో టి.తబిత, పి.శైలజ, వి.పూజ మొదటి మూడు స్థానాలు సాధించారు. పోటీలల్లో గెలుపొందిన వారికి ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఏసీబీ ఎస్సైలు నాగరాజు, సుబ్బారావు, మన్మథ, సురేష్‌బాబు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర తదితరులు

పక్షవాతం చికిత్సల్లో ప్రతి నిమిషం విలువైందే

● న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం దాడి చేసిన తర్వాత రోగుల చికిత్సల్లో ప్రతి నిమిషం విలువైనదేనని న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు తెలిపారు. మంగళదాస్ నగర్‌లోని కిమ్స్ శిఖర ఆసుపత్రిలో శనివారం న్యూరో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ, పక్షవాత లక్షణాలు గమనించిన మొదటి నాలుగున్నర గంటలలో చికిత్స ప్రారంభిస్తే ప్రాణాలను రక్షించవచ్చని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. త్వరగా గుర్తించండి, వెంటనే స్పందించండి అనే సందేశం అందరూ పాటించాలని ఆయన సూచించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ముఖం వాలిపోవడం, చేతి బలహీనత, మాట తడబడటం వంటివి పక్షవాత లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. న్యూరో విభాగం యూనిట్ అధిపతి డాక్టర్ ఎన్‌వి హరి కుమార్ మాట్లాడుతూ కిమ్స్‌లో 24 గంటల ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ సేవలు, క్యాథ్ ల్యాబ్ సదుపాయం ఉండటం వల్ల పక్షవాత బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పక్షవాతం నుండి కోలుకున్న రోగులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం హరికథాగానం

గుంటూరు(తూర్పు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం కళ్ళం హరనాధ రెడ్డి జయంతి సందర్భంగా శ్రీకృష్ణ రాయబారం హరికథాగానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, జాగర్లమూడి మల్లికార్జునరావు తదితరులు ప్రారంభించారు. ప్రముఖ హరికథకురాలు వేదవతి భాగవతారిణి హరికథను ప్రారంభిస్తూ శ్రీకృష్ణుడు రాయబారంలో చూపిన చాతుర్యం, ధర్మం, కౌరవ సభలోని సన్నివేశాలను వర్ణిస్తూ తన బాణీలో పలు పద్యాలను ఆలపించి శ్రీకృష్ణ రాయబారంలో కృష్ణుడు చూపిన దౌత్యం, ధర్మం, దుర్యోధనుడితో జరిగిన సంభాషణలు ప్రధానాంశాలుగా తీసుకొని హరికథ రూపంలో తెలిపి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి తబలపై నాగప్రసాదు, కీబోర్డుపై మల్లేశ్వరరావులు చక్కటి వాయిద్య సహకారం అందించారు.

వైభవంగా శ్రీ పుష్ప యాగం



స్వామి వారికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

గుంటూరు (తూర్పు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి శ్రీ పుష్పయాగం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో విశేష స్నపన, అలంకార పూజ, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. అనంతరం 16 రకాల పుష్పాలతో స్వామివారికి శ్రీ పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిపారు. పూజానంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపికలు

గుంటూరు(క్రీడలు) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో క్రికెట్ జట్ల ఎంపికలు శనివారం ఇన్నర్ ఇన్నర్ రింగ్ రోడ్డులోని శుభం క్రికెట్ అకాడమీలో జరిగాయి. అండర్-14, 17 బాల బాలికలకు జరిగిన ఈ పోటీలను పెదకాకాని జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్వహించింది. పోటీలలో జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు కె.భాస్కరరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా క్రికెట్‌కున్న ఆదరణ వల్ల ఎక్కువమంది బాలబాలికలు క్రికెట్‌పై మక్కువ చూపుతున్నారని అన్నారు. అండర్-14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలను గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలను సెలక్షన్ కమిటీ కార్యదర్శి డి.భూపాల్ రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు టి.లక్ష్మీపతి, వి.అజయ్, సీహెచ్.నాగరాజు, వి.భార్గవి, ఎం.స్వప్న నిర్వహించారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

పేదల ముఖంలో చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గంలో మస్తాన్ దర్గా వెనక రోడ్డులో శనివారం ఆమె ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి ఇంట్లో సంతోషం వెల్లివిరుస్తోందని, అదే తమ ప్రభుత్వానికి దీవెనని అన్నారు. అనంతరం నగరంపాలెం పాత దుస్తుల బజార్‌లోని చిరు వ్యాపారుల సమస్యలపై స్థానికులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమావేశమయ్యారు. దశాబ్దాలుగా పాత దుస్తుల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న 70 నుంచి 80 కుటుంబాల వారిని అక్కడ నుంచి ఖాళీ చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేయగా, వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని అప్పట్లో మున్సిపల్ కార్పొరేషన్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికీ ఆ హామీ నెరవేరలేదని తెలిపారు. వారి అభ్యర్థన మేరకు తాను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చానని, ప్రజల జీవనాధారం దెబ్బతినకుండా, అభివృద్ధికి ఆటంకం లేకుండా సమతౌల్య పరిష్కారం తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. తదనంతరం భాగ్యనగర్ మహాప్రస్థానం రోడ్‌లో తుఫాన్ ప్రభావిత ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు సహాయాన్ని ఎమ్మెల్యే మాధవి శనివారం అందజేశారు.

కాశీబుగ్గ ఘటన అత్యంత బాధాకరం

● ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల



డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట దురదృష్టకరమని, దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు నగర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి పంపించడంతోపాటు క్యూలైన్లను వెంటనే క్రమబద్ధీకరించి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసిందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సంఘటనా ప్రదేశానికి రెస్క్యూ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్, మంత్రులు వెళ్ళి సహాయక చర్యలు చేపట్టారన్నారు. వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే శవ రాజకీయం మొదలు పెట్టారని డేగల ప్రభాకర్ విమర్శించారు.

కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికరం

● ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ చైర్మన్ మన్నవ



మన్నవ మోహన్ కృష్ణ

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనపై ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొక్కిసలాట ఘటనలో గాయపడిన భక్తులు త్వరగా కోలుకోవాలని, ఇలాంటి ఘటన జరగటం బాధాకరమన్నారు. తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని, తొక్కిసలాటలో ఇంతమంది మృతి చెందటం బాధాకరమని ఆయన అన్నారు. ప్రైవేటు వ్యక్తి నిర్మించిన ఆలయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవటం విచారకరమన్నారు. ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే భక్తులను క్యూలైన్లలో నియంత్రించేందుకు అవకాశం ఉండేదన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై సీరియస్‌గా వ్యవహరిస్తామని, ప్రభుత్వం తక్షణం వారిపై చర్యలు తీసుకుంటుందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు.



అవగాహన ర్యాలీలో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు గుంటూరులో శనివారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా అవినీతి రహిత వాతావరణాన్ని నెలకొల్పాలనే సంకల్పంతో బ్యాంక్ ఆఫ్ బరోడా అక్టోబరు 27 నుంచి నవంబరు 2 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ మేనేజర్ కిరణ్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ళతో పలు రకాల మోసాలు జరుగుతున్నాయని అన్నారు. వారు పోలీస్, సీబీఐ, ఆర్బీఐ, సైబర్ క్రైమ్ అధికారులమంటూ ఫోన్ లేదా వీడియో కాల్ చేసి డిజిటల్ అరెస్టులో ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నారన్నారు. ఖాతాదారులు, ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండండి- నమ్మడానికి ముందు నిర్ధారించుకోండి- అనుమానాస్పద చర్యలను వెంటనే నివేదించండి అన్న సూత్రాన్ని పాటించాలని కోరారు.

కంటి సంరక్షణలో నూతన ప్రమాణం
SRI GEETHA EYE HOSPITAL
హరిహర సినిమాస్ వెనుక, 4వ లైను, లక్ష్మీపురం, గుంటూరు.
ఫోన్ : 85009 22266
గుంటూరులో 40 సం॥ల అనుభవంగల వైద్యులచే పూర్తి స్థాయి
కంటి హాస్పిటల్ ది.02-11-2025 ఆదివారం
ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 5 గం॥ లకు
గొప్ప ప్రారంభం
ఆహ్వానించువారు :
డా॥ పి. మోహన కృష్ణ M.S (Oph), FVRS, (Aravind Eye Hospital, Coimbatore) Vitreoretinal Surgeon
డా॥ పి. నరసింహారావు M.B.B.S., D.O., (RIO-Chennai)
డా॥ బి. ప్రత్యూష M.S (Oph), FCRS (Aravind Eye Hospital) Anterior Segment Surgeon & Cornea & Refractive Surgeon
ప్రత్యేకతలు:
★ శుక్లం ఆపరేషన్ ★ కంటి నరము & రెటీనా సంబంధిత ఆపరేషన్లు
★ నీటి కాసులు (గ్లాకోమా) చికిత్స ★ కంటి రెప్ప వాలడం, గడ్డల చికిత్స
★ కంటి కాన్సర్ చికిత్సలు ★ కంటి అద్దాలు తొలగించే లేజర్ చికిత్సలు
ఆరోగ్యశ్రీ, EHS మరియు అన్ని ఇన్సూరెన్స్ అందుబాటులో
KALYANI ADS



మండాదిలో సాగవుతున్న ఆకుకూరలు

- మండాదిలో ఆదాయ వనరుగా ఆకుకూరల సాగు
- వచ్చిన నగదుతో ఇతర పంటలకు పెట్టుబడి
- ఆసామి అయినా అరెకరం అరకొత్తాల్సిందే..

ఆదాయ సిద్ధి.. ఆకుకూరకు ప్రసిద్ధి



మాచర్లలో విక్రయిస్తున్న ఆకుకూరలు

మాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్లకు, శుభకార్యాల్లో వంటలకు ఆకుకూరలు కావాలంటే గుర్తొచ్చేది ఆ గ్రామమే.. అనాదిగా గ్రామంలో కొందరు రైతులు ఆకుకూరలు సాగు చేపడుతున్నారు. పదెకరాల ఆసామి అయిన అరెకరమైనా.. ఈ సాగుపై శ్రద్ధచూపుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో కొంతమంది సాగుకు ముఖం చాటేసినప్పటికీ మరికొందరు ఉన్న కొద్దిపాటి నీటితోనే ఆకుకూరల సాగును సాంప్రదాయంగా కొనసాగిస్తున్నారు.

రోజూ మార్కెట్‌కు పంట తరలింపు

వెల్దుర్తి మండలం మండాదిలో ఆకుకూరల సాగు బాగా సాగుతోంది. ప్రధానంగా పాలకూర, చుక్కకూర, తోటకూర, గోంగూర, కోయ తోటకూర, బచ్చలి, పొన్నగంటి కూర, కరివేపాకు, కొత్తిమీర వంటి ఆకు కూరలను సాగు చేస్తున్నారు. వీటిని మాచర్ల పట్టణానికి తీసుకొచ్చి కూరగాయల మార్కెట్లో విక్రయిస్తున్నారు.

అరెకరం రోజుకు 600 కట్టలు వరకు విక్రయిస్తున్నారు. కట్ట రూ.5 నుంచి రూ.10 దాకా అమ్ముతున్నారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని శుభకార్యాలు, ఫంక్షన్లకు ఇక్కడే ఆకుకూరలను కొని తీసుకెళుతారు. మాచర్ల పట్టణానికి 8 కిలోమీటర్ల సమీపంలో ఉన్న ఈ గ్రామం.. హైవే ఆనుకొని ఉండడంతో.. రవాణా సదుపాయం కలిసొచ్చిన అంశం. మండాది నుంచి ఆకుకూరలను మారు వ్యాపారులు కొనుగోలు చేసి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు తరలిస్తుంటారు.



ఆదాయం ఇతర పంటలకు పెట్టుబడి

అరెకరంలో ఆకు కూరలు సాగుచేశా. నాకున్న ఆరెకరాల పొలంలో అరెకరం ఆకుకూరలు సాగు చేస్తున్నా. ఏటా ఆకుకూరల సాగుతో రూ. 70 వేలు దాకా ఆర్జిస్తున్నా. వాణిజ్య పంటల పెట్టుబడికి ఇది ఉపయోగపడుతోంది.

-కోటేశ్వరమ్మ, రైతు

ఆకుకూరల సాగే జీవనాధారం

నాకున్న 25 సెంట్లలోనే ఆకుకూరలు సాగుచేస్తున్నా. ఇదే నాకు జీవనాధారం. వాణిజ్య పంటలేవీ సాగు చేయడం లేదు. ఆకుకూరల సాగుపై వచ్చే రూ. 50 వేలతో కుటుంబ పోషణ జరుగుతోంది.

-వెంకటేశ్వరరెడ్డి, రైతు



నల్లమడ సమస్యకు శాశ్వత పరిష్కారం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



నల్లమడ వంతెన వరకు నడిచి వెళుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

కాకుమాను/గుంటూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లమడ వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు భరోసా ఇచ్చారు. అప్పాపురం శివారు నల్లమడ డ్రెయిన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కలసి ఆయన సందర్శించారు. రేటూరు శివారు జెండా చెట్టు వరకు కారులో విచ్చేసిన కేంద్రమంత్రి అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వరకు ట్రాక్టర్ పైన, అక్కడ నుంచి కిలోమీటరు వరకు నడచి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు చానల్ ఆధునికీకరణ, విస్తరణ కోసం బడ్జెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. నల్లమడ డ్రెయిన్ శాశ్వత పరిష్కారం కింద కెనాల్ విస్తరణ, పూడిక తీతకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆర్థిక భారం వల్ల ఈ పనులు ఏడాదిలో పూర్తి కాలేని పరిస్థితి ఉందన్నారు. నల్లమడ విస్తరణకు సుమారు 450 ఎకరాలు అవసరం కాగా, 120 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని మరో 300 ఎకరాలు ప్రభుత్వం సేకరించాల్సి వస్తుందన్నారు. నల్లమడ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని, అవసరమైతే కేంద్ర నిధులు కూడా మంజూరయ్యే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నల్లమడ డ్రెయిన్‌లో ప్రస్తుతం పేరుకు పోయిన సిల్ట్‌ను యుద్ధ ప్రతిపాదికన తొలగించే చర్యలు తీసుకుంటాన్నారు. తుఫాన్ వలన పంటను నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నల్లమడ వాగు సీ వాల్యూను ఐదు వందల వరకు పెంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం సీ వాల్యూను పెదనందిపాడు, కొండపాటూరుల వద్ద పెంచిందన్నారు. ఆధునీకరణ కోసం నిధులు కూడా మంజూరు చేసిందని, గత వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను నిలిపివేసి, పనులు చేయకపోవడం వలనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. రూ.375 కోట్లతో నల్లమడ పనులు ప్రారంభం అయ్యే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తహసీల్దారు వెంకట స్వామి, ఏవో సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతిగా సీసీఐ పనిచేయాలి

రైతు పక్షపాతిగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పనిచేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పత్తి కొనుగోలుపై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులుతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రైతుల వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీసీఐ వ్యవహరించాలన్నారు. పత్తిని ఆర బెట్టుకునే సదుపాయం రైతుకు లేదని, రైతుల జీవన శైలిని దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. పత్తి కొనుగోలులో ఏర్పడుతున్న సాంకేతిక అవరోధాలు అధిగమించి కొనుగోలు జరిగేటట్లు అధికారులకు సూచనలు చేయడం జరిగిందని వివరించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజా వలి, సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు, మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 1,67,175 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

పులిచింతలలో 43.59 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 43.59 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,27,970 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400 వందలు, ఐదు గేట్ల ద్వారా 1,20,160 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,37,160 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 1,23,904 క్యూసెకులు విడుదల

రెంటచింతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 6 గేట్లను 3 మీటర్లు, 2 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 1,19,736 , టేల్ రేస్ చానల్ ద్వారా 4,168.. మొత్తం 1,23,904 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె. వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 1,17,808 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. శుక్రవారం అర్థరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.5480 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.



పులిచింతలకు విడుదలవుతున్న వరద నీరు

10 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3,088, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,982, 10 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 80,790, మొత్తం ఔట్‌ఫ్లో 1,17,860 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,17,860 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



10 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగర్ నీరు

మిర్చిని ముంచిన మొంథా

- కర్నూలులో వర్షం.. గుంటూరు మిర్చి యార్డుపై ప్రభావం
- ఈ ఏడాది పంట రాక ఆలస్యమంటున్న ట్రేడర్లు
- కోల్డ్ స్టోరేజ్‌ల నిల్వలకు డిమాండ్

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది నవంబరులో కర్నూలు జిల్లా నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే మిర్చి ఈసారి ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. మొంథా తుపాను వల్ల అక్కడ కురిసిన వర్షాలతో వాగులు, చెరువులు ఉప్పొంగి మిర్చి పంటను దెబ్బతీశాయి. ప్రతి గ్రామంలో దాదాపుగా 10 నుంచి 15 శాతం వరకు పంటకు నష్టం జరిగినట్లు అక్కడి రైతుల నుంచి మిర్చియార్డులోని కమీషన్ వ్యాపారులు సమాచారం సేకరించారు. ఇంకా పొలాల్లో నీళ్లున్నాయని, వారం పాటు బాగా ఎండ కాస్తే మొక్కలు నిలదొక్కుకొంటాయని రైతులు వారికి తెలిపారు. ఈ నేపథ్యంలో శీతల గిడ్డంగుల్లో నిల్వఉన్న మిర్చి టిక్కీలకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు.

దిగుబడిపై లేని స్పష్టత

మిర్చి యార్డులో సీజన్ నవంబరు రెండో వారం నుంచి ప్రారంభమవుతుంది. ఇందుకు కారణం కర్నూలు జిల్లాలో సాగు చేసిన మిర్చి అప్పటికే తొలి విడత కోతలు పూర్తి అవుతాయి. దీంతో అక్కడి నుంచి నిత్యం 30 వేల టిక్కీల వరకు రైతులు మిర్చి యార్డుకు తీసుకొస్తుంటారు. ట్రేడర్లు వాటిని నాన్ ఏసీ కేటిగిరి కింద కొనుగోలు చేస్తారు. మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి వచ్చే మిర్చిని ఏసీ కేటిగిరి కింద పరిగణించి కొనుగోళ్లు చేస్తుంటారు. దీంతో నవంబరు నుంచే మిర్చి యార్డులో 60 వేల టిక్కీల వరకు విక్రయం జరుగుతూ కళకళలాడుతుంటుంది. అయితే ఈ సంవత్సరం ఆ పరిస్థితి లేకుండా పోయింది. మరో వారం పది రోజుల్లో కోతలు జరగాల్సి ఉండగా మొంథా తుపానుతో వచ్చిన వరద ప్రవాహం కారణంగా మిర్చి మొక్కలు పలుచోట్ల పక్కకు ఒరిగిపోయాయి. పొలాల్లో నిలిచిన వరద నీటిని రైతులు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. అలానే పక్కకు వరిగిన మొక్కలను నిలబెట్టి పాదు వద్ద కాళ్లతో తొక్కుతున్నారు. ఆ తర్వాత దుక్కులు దున్ని నానో ఎరువులు అందించి మొక్కలు బతికించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దీనివలన పది రోజుల తర్వాతే పంట దిగుబడి ఎంత మేరకు తగ్గుతుందనే దానిపై స్పష్టత వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా మొంథా తుపాను, దసరా, దీపావళి సెలవుల కారణంగా కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న 40 లక్షల టిక్కీలలో పెద్దగా విక్రయం జరగలేదని పేర్కొన్నారు. ఎగుమతుల్లో కూడా అంతగా రైజింగ్ లేదన్నారు. ఏది ఏమైనా మిర్చి యార్డుకు కొత్త పంట రాక మరో నెల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆ లోపు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వఉన్న మిర్చి టిక్కీల విక్రయం జరిగితే రైతులకు కొంత మేలు జరుగుతుందని వివరించారు.



కర్నూలు జిల్లాలో మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న మిర్చి పంట

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం వైఫల్యం

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

గుంటూరు(తూర్పు), నవంబరు1(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహిస్తున్న బస్సు జాతా శనివారం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గూగుల్‌ను పక్కనబెట్టి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమస్యలపై పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు. బస్సు జాతాకు అనుమతి నిరాకరించిన డీజీపీ వ్యవహారశైలి అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఆ పదవికి ఆయన అనర్హుడని విమర్శించారు. డీజీపీ టీడీపీ నేతగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. జీతం ప్రభుత్వం ఇస్తుందా...లేదంటే టీడీపీ ఇస్తుందా అని నిలదీశారు. ఆయన కనుసన్నల్లో లిక్కర్, ఇసుక మాఫియా నడుస్తుందని ఆరోపణలు చేశారు. డీజీపీ వ్యవహారంపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలరాజు, నాసర్ జీ మాట్లాడుతూ పార్వతీపురంలో గిరిజన విద్యార్థులకు నీళ్లు లేక చనిపోతున్నా విద్యాశాఖ మంత్రి, అధికారులు కన్నెత్తి చూడలేదని మండిపడ్డారు. విద్యార్థుల మరణాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నంబరు 77 రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే జాతా ముగిసిన వెంటనే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగపు నాయకుడు పానుగంటి చైతన్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, పల్లాయిస్వామి ఫణీంద్ర నాగభూషణ్, బాల నవ్యశ్రీ, సుమన్ చరణ్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీపీఐ నేత రామకృష్ణ

దినదిన గండం.. 60ఏళ్ల ఉద్యోగం

- ఏఎన్‌యూ అధ్యాపకేతర దినసరి ఉద్యోగుల్లో ఆందోళన
- అన్‌స్కిల్డ్ ఉద్యోగుల విరమణకు పాలక వర్గం చర్యలు
- జనన ధ్రువపత్రాలు లేనివారి వయస్సు నిర్ధారణకు ఎముకల పరీక్షలు
- ఆరు పదులు దాటిన వారు ఇంటికి

ఏఎన్‌యూ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అన్‌స్కిల్డ్ దినసరి ఉద్యోగుల వయస్సు నిర్ధారణకు ఏఎన్‌యూ పాలకవర్గం చర్యలు తీసుకుంది. ఎలాంటి వయసు ధ్రువీకరణ పత్రాలు లేని ఉద్యోగులకు ఎయిమ్స్‌లో ఎముకల పరీక్షలు చేయిస్తోంది. ఈ పరీక్షల్లో 60 ఏళ్లు దాటిన వారికి ఉద్యోగ విరమణ కల్పిస్తోంది. ఇప్పటికే ఇలా పరీక్షల్లో ఉద్యోగ విరమణ వయస్సు పైబడిన నలుగురిని ఇంటికి పంపించింది. అచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శాశ్వత అధ్యాపకేతర ఉద్యోగుల కొరత ఉంది. దీంతో వారి స్థానంలో దినసరి ఉద్యోగులను 15 ఏళ్లుగా వర్సిటీ ఉన్నతాధికారులు నియమిస్తూ వస్తున్నారు. ఇలా 300మందికి పైగా ఆయా విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిని స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్ స్కిల్డ్ మూడు క్యాటగిరులుగా విభజించి వేతనం చెల్లిస్తున్నారు. స్కిల్డ్ కేటగిరికి డిగ్రీని, సెమీ స్కిల్డ్ కేటగిరికి పదవ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అన్ స్కిల్డ్ కేటగిరిక ఎలాంటి అర్హత లేదు. వీరిలో సుమారు వంద మంది లోపు అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు ఎలాంటి విద్యార్హత లేదని సమాచారం.

ఎయిమ్స్‌లో పరీక్షలు..

విశ్వవిద్యాలయం అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు రోజుకు రూ.900కు పైగా వేతనం చెల్లిస్తోంది. ఇటీవల వర్సిటీ పాలకవర్గం వీరి వేతనాలను పెంచడంతో పాటు ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లుగా నిర్ణయించింది. అయితే అన్‌స్కిల్డ్ ఉద్యోగు లకు ఎలాంటి విద్యార్హత, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో.. ఎముకల పరీక్షలు ద్వారా వారి వయస్సును నిర్ధారిస్తున్నారు. ఈ బాధ్యతను మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి అప్పగిస్తూ.. విశ్వవిద్యాలయం లేఖ రాసింది. దీంతో ఉద్యోగులు ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఎముకల పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ పరీక్షల ద్వారా వైద్యులు ఆయా ఉద్యోగుల వయస్సును నిర్ధారిస్తూ.. విశ్వవిద్యాలయానికి వైద్య నివేదికలను పంపుతున్నారు. వీటి ఆధారంగా వర్సిటీ ఆయా ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్లలో వారి వయస్సును నమోదు చేస్తోంది. దీని ద్వారా ఉద్యోగ విరమణ కల్పిస్తోంది.



ఆందోళన.. సందేహాలు

ఎముకల పరీక్షకు ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులు తమ వయసును తక్కువగా చూపించేందుకు వైద్యులతో బేరసారాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎముకల పరీక్ష ద్వారా వయస్సు నిర్ధారణ ఖచ్చితత్వంపై ఉద్యోగుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. ఈ పరీక్షల ద్వారా కొన్ని నెలల క్రితం నలుగురు ఉద్యోగులకు వర్సిటీ ఉద్యోగ విరమణ కల్పించింది. ఇంకా మరికొంత మంది ఇంటికి వెళ్లనున్నారు.

డిగ్రీ లేని వారిలో అలజడి

విశ్వవిద్యాలయం కొందరు దినసరి ఉద్యోగులకు డిగ్రీ అర్హత లేకుండానే స్కిల్డ్ కేటగిరి కింద వేతనాలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారి విద్యార్హత సర్టిఫికెట్లను సమర్పించాలని వర్సిటీ ఆదేశించింది. దీంతో డిగ్రీ అర్హత లేని ఉద్యోగుల్లో అలజడి రేగింది. కొందరు నేటికీ సర్టిఫికెట్లు సమర్పించలేదని తెలిసింది. విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న దినసరి ఉద్యోగుల పరిస్థితి దినదినం ఉద్యోగ విమరణ గండంగా మారింది. ఎముకల పరీక్షల ద్వారా వయస్సును నిర్ధారించడంతోపాటు ఉద్యోగ విరమణ నిబంధనను అమలు చేస్తూ తమ పొట్ట కొట్టొద్దంటూ దినసరి ఉద్యోగుల కోరుతున్నారు.

నెక్లెస్ నయగారం

ఆభరణాలన్నింటిలో నెక్లెస్‌నే ఎక్కువగా ఇష్టపడుతుంటారు మహిళలు. ఎంత ఖరీదైన హారం వేసుకున్నప్పటికీ మెడలో చిన్న నెక్లెస్ పెట్టుకోనిదే అలంకరణ పూర్తికాదు. ఒకప్పుడు బంగారంతో తయారుచేసిన కంటెలు, పట్టెడలు, నాన్ పట్టీలను మహిళలు ఎక్కువగా ధరించేవారు. కాలక్రమేణా ఎన్నో మార్పులు, చేర్పులతో సరికొత్త నెక్లెస్‌లు రూపుదిద్దుకున్నాయి. యువత మెచ్చే ఫ్యాషన్లకు అనుగుణంగా మల్టీలేయర్, చంకీ చోకర్, పెండెంట్ నెక్లెస్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. వజ్రాలు, ముత్యాలు, జాతిరత్నాలు, కుందనాలు, బీడ్స్‌తో రూపొందించిన రకరకాల సంప్రదాయ నెక్లెస్‌లను కూడా మహిళలు ఆదరిస్తున్నారు. నేడు నెక్లెస్ ఒక నగలా మాత్రమే కాకుండా మహిళల వారసత్వానికి, వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తూ జాతీయ అంతర్జాతీయ వేదికల మీద సందడి చేస్తోంది. అలాంటి ట్రెండీ నెక్లెస్‌లపై ఓ లుక్కేద్దామా...



కుందన్ నెక్లెస్

మొఘలుల కాలంలో ఈ తరహా నెక్లెస్‌లు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇప్పుడు మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. పండుగలప్పుడు, వివాహాది శుభకార్యాల్లో సంప్రదాయ దుస్తులమీద చక్కని కుందనాల నెక్లెస్ పెట్టుకుంటే గ్రాండ్ లుక్ వస్తుంది.



కాలర్ నెక్లెస్

ఇది మెడను పట్టి ఉంచుతుంది. ఎలాంటి ముఖాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతుంది. గోల్డ్, పెరల్ పోల్కీలతోపాటు కెంపులు, పచ్చలు, ముత్యాలు, బీడ్స్‌తో రూపొందిచిన రకరకాల కాలర్ నెక్లెస్‌లను మహిళలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌లపై కూడా ఇవి చక్కగా సూటవుతాయి. సింగిల్ లైన్ కాలర్ నెక్లెస్.. రోజువారీ ధరించడానికి అనువుగా ఉంటుంది. మల్టీ లేయర్లను పార్టీలు, ఫంక్షన్లప్పుడు పెట్టుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు.



ఆక్సిడైజ్డ్ నెక్లెస్

ఉద్యోగినులు, కాలేజీలకెళ్లే యువతులు ఈ తరహా నెక్లెస్‌లను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరలు, కుర్తీలు, సల్వార్ సూట్లు, వెస్ట్రన్, సెమీ వెస్ట్రన్ దుస్తుల మీద చక్కగా నప్పుతాయి.

మల్టీ స్ట్రింగ్ నెక్లెస్

ఇది అయిదు లేదా ఆరు వరుసల్లో ఉంటుంది. ఈ నెక్లెస్ ఒక్కటి పెట్టుకుంటే ఏ ఇతర హారాలు వేసుకోనవసరం లేదు. సంప్రదాయ దుస్తుల మీద రిచ్ లుక్ ఇస్తుంది. బంగారు గుండ్లు, పోల్కీలు, ముత్యాలు కుందనాలతో రూపొందించిన మల్టీ స్ట్రింగ్ నెక్లెస్‌లకు డిమాండ్ అధికంగా ఉంటోంది.



సెలబ్రిటీలు కూడా...

భారతీయ ఆభరణాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉంది. భారతీయ శైలిని పాశ్చాత్య శైలితో మేళవించి సరికొత్త డిజైన్లను రూపొందిస్తున్నారు. వీటిని యువత అమితంగా ఇష్టపడుతోంది. ఢిల్లీ, ముంబయి, న్యూయార్క్ నగరాల్లో జీన్స్, టీషర్టులు ధరించి కూడా రకరకాల నెక్లెస్‌లు పెట్టుకుంటున్నారు. కుర్తీల మీద ఆక్సిడైజ్డ్ నెక్లెస్‌లు, షర్టుల మీద ముత్యాల చోకర్లు, మోడరన్ డ్రెస్‌ల మీద లేయర్ నెక్లెస్‌లు ధరించి సరదా తీర్చుకుంటున్నారు యువతులు. ఒకప్పుడు బోసి మెడతో ఫొటోషూట్‌లు తీయించుకోవడానికి ఇష్టపడిన బాలీవుడ్ నటీమణులు, మోడల్స్ నేడు నెక్లెస్‌కు అధిక ప్రాముఖ్యమిస్తున్నారు. దీపిక పదుకునే ఇటీవల ఓ ప్రోగ్రామ్‌లో యాంటిక్ నెక్లెస్ ధరించి కనువిందు చేశారు. కేన్స్ 2025 ఈవెంట్లో డైమండ్ చోకర్ నెక్లెస్ ధరించి అందంగా మెరిశారు ఆలియా భట్. కియారా అద్వానీ, సన్యా మల్హోత్రాలు తరచూ చైన్ నెక్లెస్‌లతో కనిపిస్తున్నారు. సోనమ్ కపూర్ అహూజా ఇటీవల ఓ కార్యక్రమంలో మల్టీ లేయర్ చైన్స్ నెక్లెస్ వేసుకుని వార్తల్లో నిలిచారు. హేలీ బీబర్ తన ఐకానిక్ బబుల్ 'బి' పెండెంట్ చోకర్‌తో కనువిందు చేస్తున్నారు. హాలీవుడ్ సెలబ్రిటీలు సైతం భారతీయ శైలితో కూడిన నెక్‌పీస్‌లు ధరించడానికే ఇష్టపడుతున్నారు. ఇటీవల నికోల్ కిడ్‌మాన్... రత్నాలతో రూపొందించిన నెక్లెస్ ధరించి 'రెడ్ కార్పెట్' ఈవెంట్లో ప్రత్యేకంగా నిలిచారు. సెలీనా గోమెజ్ కూడా చక్కని నెక్లెస్‌లు ధరించి పలు సంగీత అవార్డుల వేదికలమీద కనిపిస్తుంటారు. ఎమ్మా వాట్సన్ ధరించిన సన్నని గొలుసుల నెక్లెస్ యువతులను బాగా ఆకర్షిస్తోంది.





శిరోజాల కొనలు ఇలా పదిలం

కొంతమందికి శిరోజాల చివర్లు చిట్లిపోతుంటాయి. ఆపైన రంగుమారి నిర్జీవంగా కనిపిస్తుంటాయి. అలాకాకుండా శిరోజాలు నల్లగా మెరుస్తూ ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- చాలామంది శిరోజాలను స్టయిల్‌గా మార్చేందుకు స్ట్రయిట్‌నర్స్, కర్లర్స్ వాడుతూ ఉంటారు. వీటిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల వెంట్రుకల చివర్లు చిట్లిపోతుంటాయి. శిరోజాలను స్టయిల్ చేసుకోవడానికి బదులు చక్కగా దువ్వి జడ లేదా పోనిటెయిల్ వేసుకోవడం మంచిది.
- శిరోజాలకు తగినంత తేమ అందకపోయినా చివర్లు చిట్లిపోతుంటాయి. మంచినీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. వారానికి రెండుసార్లు తలకు కొబ్బరినూనె రాసుకుంటూ ఉంటే వెంట్రుకల్లో తేమ నిలుస్తుంది.
- రసాయనాలతో కూడిన షాంపూలు ఉపయోగించడం వల్ల కూడా శిరోజాలు చిట్లుతుంటాయి. మైల్డ్ షాంపూ లేదా కుంకుడుకాయ, మందారాకులతో తలస్నానం చేస్తుంటే సమస్య తీరుతుంది.
- తలస్నానం చేసిన తరువాత శిరోజాలను తువాలుతో గట్టిగా రుద్దుతూ తుడవకూడదు. అలా చేయడం వల్ల జుట్టు చిక్కులు పడుతుంది. చిక్కులు తీయడానికి గట్టిగా దువ్వడం వల్ల వెంట్రుకల కొనలు చిట్లిపోతుంటాయి. కాబట్టి తలస్నానం తరువాత నీళ్లు ఇంకిపోయే వరకూ తలకు మెత్తని తువాలును చుట్టి ఉంచుకోవాలి.



- శిరోజాలను బిగించి ముడి లేదా జడ వేయకూడదు. అలాగని జుట్టు విరబోసుకున్నా సమస్య పెరుగుతుంది. శిరోజాలు వదులుగా ఉండేలా అల్లుకోవాలి. దువ్వెనలు, దిండు కవర్లు శుభ్రంగా ఉంచుకోవాలి. రోజూ పోషకాహారం తీసుకోవాలి.
- శిరోజాల చివర్లు చిట్లినప్పుడు కొనలను మాత్రమే ట్రిమ్ చేయించుకోవాలి.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇన్ వేవ్స్ అండ్ వార్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 03
బారాముల్లా	హిందీ చిత్రం	నవంబర్ 07
అమెజాన్ ప్రైమ్		
రాబిన్‌హుడ్	వెబ్‌సిరీస్	నవంబర్ 02
నైస్ టూ నాట్ మీట్ యూ	వెబ్‌సిరీస్	నవంబర్ 03
జియో హాట్‌స్టార్		
బ్యాడ్ గర్ల్	తమిళ చిత్రం	నవంబర్ 04
ది ఫెంటాస్టిక్ 4	హాలీవుడ్ మూవీ	నవంబర్ 05
సోనీ లివ్		
మహారాణి 4	హిందీ సిరీస్	నవంబర్ 07



జీవితంలో అనేక పాఠాలు నేర్చుకున్నా!

సుస్మితా సేన్, లారా దత్తాల తర్వాత మన దేశం నుంచి మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకొన్న మూడో సుందరి హర్నాజ్ సంధు. సుస్మిత, లారాల మాదిరిగానే హర్నాజ్ కూడా బాలీవుడ్‌లోకి తాజాగా రంగ ప్రవేశం చేసింది. ఆమె నటించిన 'బాగీ 4' ఓటీటీలో కూడా దూసుకువెళ్తోంది. బాలీవుడ్ ప్రవేశం గురించి.. తాను చేయదలుచుకున్న పాత్రల గురించి హర్నాజ్ అంతరంగం ఆమె మాటల్లోనే...

> **నాకిష్టం...**
> నాకిష్టమైన నటి ప్రియాంక చోప్రా. నచ్చిన సినిమా 'ముజే షాదీ కరోగి'. నచ్చిన క్యారెక్టర్ 'షోలే' సినిమాలో బసంతి.

"బాగీ 4 విడుదల తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనేక మంది నాకు ఫోన్ చేసి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటి దాకా నన్ను అందరూ మిస్ యూనివర్స్‌గా మాత్రమే చూశారు. బాగీ తర్వాత నన్ను ఒక నటిగా గుర్తిస్తున్నారు. ఈ విషయం నాకు చాలా ఆనందం కలిగిస్తోంది. ఇది నా తొలి సినిమా. అయితే దర్శకుడు సాజిద్ నదియవాలా, నా హీరో టైగర్ ష్రాఫ్, ఇతర నటీనటులు నన్ను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నారు. మన చుట్టూ ఉన్న వ్యక్తులు మనల్ని చాలా ప్రభావితం చేస్తారు. ముఖ్యంగా సినీ రంగంలో అందరూ కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఏ చిన్న సమస్య ఎదురయినా- అది మొత్తం అందరినీ ప్రభావితం చేస్తుంది. అందుకే ఆడుతూ పాడుతూ పనిచేయాలంటారు. ఈ సినిమా షూటింగ్ అలాగే సాగింది. సెట్‌లో ఉన్న వారందరికీ తాము ఏం చేస్తున్నామో తెలుసు. అందువల్ల ఎటువంటి టెన్షన్ ఎదురవలేదు.

జీవితం మారిన క్షణం

2021లో నాకు మిస్ యూనివర్స్ కిరీటం దక్కింది. ఆ క్షణం నుంచి నా జీవితం మారిపోయింది. అప్పటిదాకా నేను చండీగఢ్‌కు చెందిన ఒక మధ్యతరగతి అమ్మాయిని. మిస్ యూనివర్స్ అయిన తర్వాత నేను మన దేశానికి ప్రాతినిధ్యం వహించే అంబాసిడర్‌ను. నేను చేసే ప్రతి పనిని అందరూ చూస్తూ ఉంటారు. అందువల్ల వేసే ప్రతి అడుగు ఆచితూచి వేయాల్సి వచ్చేది. మాట్లాడే ప్రతి మాట ఆలోచించి మాట్లాడాల్సి వచ్చేది. ఇలా ఈ నాలుగేళ్ల సమయంలో నేను నా జీవితంలో అనేక పాఠాలు నేర్చుకున్నాను. ఇక నేను సినిమా నటిని అవ్వాలనేది కూడా బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయమే! నేను సినీ రంగంలోకి వెళ్తానని చెప్పినప్పుడు మా కుటుంబం నాకు మద్దతు ఇచ్చింది. ముఖ్యంగా మా అమ్మ నాకు కొండంత అండగా నిలిచింది. నేను ఆకాశంలో చుక్కలను అందుకొనేంత ఎత్తుకు ఎదగాలనేది ఆమె ఆశ, ఆకాంక్ష. ఆమె ఆశను నిజం చేయటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను.

ఆరోగ్యకరమైన జీవనం కోసం

ధ్యానం చేయాలి. తగినన్ని నీళ్లు తాగాలి. మన చుట్టూ పాజిటివ్ ఎనర్జీ ఉన్న వ్యక్తులు ఉండేలా చూసుకోవాలి

ఆరోగ్యకరమైన ఆహారం అంటే...

ఇంట్లో వండిన ఆహారాన్నే తింటా. జపనీస్ ఆహారమంటే ఇష్టం. ఇక పంజాబీ ఫుడ్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నేను తినే ఆహారంలో హై ప్రొటీన్, ఎక్కువ ఫైబర్ ఉండేలా చూసుకుంటా. ఉదయాన్నే లేచిన వెంటనే చియా సీడ్స్‌ను నీళ్లలో నానబెట్టి తింటా. ఇక ప్రతి రోజూ ఒక చిన్న కప్పు ఐస్‌క్రీమ్ తింటా.

అందం కోసం


నా దృష్టిలో మంచి హృదయంతో ప్రశాంతంగా ఉన్నవారు అందంగా కనిపిస్తారు. అందుకోసమే నేను లేచిన వెంటనే మెడిటేషన్ చేస్తాను. చల్లటి నీళ్లతో మొహాన్ని కడుక్కుంటా. మెడిటేషన్ వల్ల రోజంతా నా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చల్లటి నీళ్ల వల్ల చర్మం మెరుస్తూ ఉంటుంది. ఇక నేను బయట దొరికే సౌందర్య సాధనాలను వాడను. మా ఇంట్లో తయారుచేసే ఫేస్‌ప్యాక్‌లనే వాడతాను. దీని వల్ల చర్మం దెబ్బతినకుండా ఉంటుంది.

కుండీల్లో ఆకుకూరలు

ఇటీవల అందరూ ఆకుకూరలంటే ఆసక్తి చూపిస్తున్నారు. కుండీల్లోనైనా ఆకు కూరలను పెంచాలనుకుంటున్నారు. ఇలా కుండీల్లో పెంచదగ్గ ఆకుకూరల గురించి తెలుసుకుందాం.



మెంతికూర: ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ఎటువంటి మట్టిలోనైనా సులువుగా పెరుగుతుంది. ముందుగా మెంతులను రెండు గంటలపాటు నీళ్లలో నానబెట్టాలి. తరువాత వాటిని టిష్యూ పేపర్‌లో లేదంటే పలుచని గుడ్డలో మూటకట్టి పెడితే ఒక్క రోజులోనే మొలకలు వస్తాయి. మొలకెత్తిన మెంతి గింజలను కుండీల్లో నాటితే వారంలోపే మెంతికూర చేతికి అందుతుంది. కోకోపీట్ కలిపిన మెత్తటి మట్టిలో ఏడాది పొడవునా మెంతికూర చక్కగా పెరుగుతుంది. వంటింటి కిటికీల దగ్గర, బాల్కనీలో కుండీలు పెట్టుకోవచ్చు.



పాలకూర: ఇది కూడా కుండీల్లో బాగా పెరుగుతుంది. పాలక్ సీడ్స్ తెచ్చి కుండీలో చల్లి కొన్ని నీళ్లు చిలకరించాలి. నాలుగు రోజుల్లో మొలకలు వస్తాయి. పది రోజుల్లో పాలకూర గుబురుగా పెరుగుతుంది. ఆకులను మాత్రమే కోసుకోవాలి. ఆర్నెల్లకోసారి మట్టిలో సేంద్రియ ఎరువులు కలుపుతూ ఉంటే నాలుగేళ్ల వరకూ పెద్ద ఆకులతో పాలకూర పెరుగుతూనే ఉంటుంది.



కొత్తిమీర: ఒక గిన్నెలో కొన్ని ధనియాలను తీసుకుని నిండా నీళ్లు పోసి అయిదు గంటలపాటు నానబెట్టాలి. కొత్తిమీర బాగా పెరగాలంటే మట్టి మరీ మెత్తగా ఉండకూడదు. అందుకే కుండీలోని మట్టిలో కొద్దిగా ఇసుక, కంపోస్టు కలపాలి. తరువాత నానిన ధనియాలు చల్లి నీళ్లు చిలకరించాలి. వారంలో కొత్తిమీర చేతికి అందుతుంది. రోజూ కావాల్సినంత కొత్తిమీరను చేత్తో తుంచుకోవాలి. దీన్ని తుంచుతున్న కొద్దీ కొత్త ఇగుళ్లు వస్తూనే ఉంటాయి.



తోటకూర: ఇది ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో లభ్యమవుతుంది. కుండీలోని మట్టిలో కొద్దిగా వేపపిండి కలపాలి. తరువాత తోటకూర గింజలు చల్లి కొన్ని నీళ్లు చిలకరించాలి. మూడు రోజుల్లోనే మొలకలు వస్తాయి. రోజూ మట్టి తడిసేలా నీళ్లు పోస్తూ ఉంటే తోటకూర చక్కగా పెరుగుతుంది.



బచ్చలి కూర: కుండీలో గింజలు చల్లి పెంచుకోవచ్చు. కొమ్మ తెచ్చి పెట్టినా కూడా త్వరగానే నాటుకుంటుంది. ఈ మొక్కకు ఎక్కువగా ఎండ అవసరం లేదు. నీడలో బాగా పెరుగుతుంది.



చుక్క కూర: ఒకసారి గింజలు తెచ్చి చుక్కకూరను పెంచితే దానినుంచి గింజలు వస్తూనే ఉంటాయి. ఈ మొక్కకి ద్రవరూపంలో ఎరువులు ఇస్తూ ఉండాలి. ఇది చాలా వేగంగా పెరిగే మొక్క.

సోఫా కవర్ కొత్తగా!

కాలక్రమేణా సోఫా కవర్ మీద దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. రకరకాల మరకలు పడుతుంటాయి. తరచూ సోఫా కవర్‌ను ఉతకడం సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి సోఫా కవర్‌ను కొత్తగా మెరిసేలా చేయవచ్చు. ఆ వివరాలు...

- సోఫా కవర్‌పై టీ, కాఫీ, జ్యూస్ మరకలు పడితే ముందుగా వాటిని పొడిగుడ్డతో తుడవాలి. చిన్న గిన్నెలో ఒక చెంచా లిక్విడ్ డిటర్జెంట్ లేదా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి కొన్ని నీళ్లు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో పలుచని గుడ్డను ముంచి దానితో మరకల మీద మెల్లగా తుడవాలి. తరువాత తడిగుడ్డతో అద్దితే మరకలు పూర్తిగా పోతాయి.
- జిడ్డు, నూనె, మేకప్ మరకలు ఏర్పడితే వాటిమీద కార్న్‌ఫ్లోర్, ఫేస్ పౌడర్, బేకింగ్ సోడాలలో ఒకదాన్ని కొద్దిగా చల్లాలి. ఇరవై నిమిషాల తరువాత పాత టూత్‌బ్రష్‌తో రుద్దితే మరకలు తొలగిపోతాయి.



- సోఫా కవర్ మీద ఏవైనా మొండి మరకలు ఏర్పడితే... చిన్న దూది ఉండ మీద రెండు చుక్కల శానిటైజర్ లేదా ఆల్కహాల్ వేసి దానితో రుద్దితే చాలు. మరకలు మాయమవుతాయి.
- వెడల్పాటి గిన్నెలో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తీసుకోవాలి. అందులో ఒక చెంచా బేకింగ్ సోడా, ఒక చెంచా షాంపూ వేసి బాగా కలపాలి. చేతి రుమాలును గుండ్రంగా మడిచి ఆ మిశ్రమంలో ముంచాలి. దానితో సోఫా కవర్‌ను తుడవాలి. తరువాత ఫ్యాన్ వేసి గాలికి ఆరనివ్వాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే మరకలన్నీ పోయి సోఫా కవర్ కొత్తగా కనిపిస్తుంది.

బంగారం ధర రోజు రోజుకు పెరిగిపోతోంది. అదే సమయంలో బంగారానికి ప్రత్యామ్నాయంగా కొందరు భావించే ప్లాటినం ధర స్థిరంగానే ఉంది. ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధరతో మూడు గ్రాముల ప్లాటినం కొనవచ్చు. పెరుగుతున్న బంగారం నగల ధరల వల్ల ఎక్కువ మంది యువతీయువకులు ప్లాటినం వైపు మొగ్గు చూపుతున్నారంటున్నారు ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ డిప్యూటీ కంట్రీ మేనేజర్ పల్లవి శర్మ. ప్లాటినం గురించి ఆమె చెప్పిన విశేషాలివే..



ప్రస్తుతం బంగారానికి ప్రత్యామ్నాయం ప్లాటినమే!



మన దేశంలో ప్లాటినం మార్కెట్ ఎలా ఉంది? మన మహిళలు ప్లాటినం ఆభరణాలు కొంటున్నారా?

మన దేశంలో ప్లాటినం ఆభరణాలను కొనేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా యువతీయువకులు ఈ ఆభరణాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇక్కడ కొన్ని ఆసక్తికరమైన అంశాలను చెబుతాను. ప్లాటినం ఆభరణాలను (అంటే ఉంగరాలు, బ్రాస్‌లెట్స్ వంటివి) పురుషులు ఎక్కువగా కొంటారు. జంటగా ఇద్దరు ఒకే విధమైన ఆభరణాలు కొనాలనుకున్నవారు కూడా ప్లాటినం వైపే మొగ్గు చూపుతారు. అయితే ఈ మధ్యకాలంలో మహిళలు కూడా ప్లాటినం ఆభరణాల వైపు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే అమ్మాయిలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం- ప్లాటినంలో 95 శాతం స్వచ్ఛత ఉండటం. ఇక రెండోది వజ్రాలను పొదిగితే చాలా అందంగా కనిపించటం. ఈ ఏడాది రెండో త్రైమాసిక ఫలితాలను చూస్తే- గత ఏడాది కన్నా 15 శాతం అమ్మకాలు పెరిగాయి.




మన దేశంలో బంగారాన్ని శుభశుచకంగా భావిస్తారు. అలాంటి బంగారంతో ప్లాటినం పోటీ పడగలదా?

> **ప్లాటినం ఆభరణాల స్వచ్ఛత 95 శాతం ఉంటుంది. అందువల్ల ఒక వేళ వీటిని తిరిగి విక్రయించినా ఎక్కువ సొమ్ము లభిస్తుంది. ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రముఖ దుకాణాలలోను ప్లాటినం ఆభరణాలు లభిస్తున్నాయి.**

మన దేశ సంస్కృతి సంప్రదాయాల్లో బంగారం ఒక కీలకమైన పాత్ర పోషిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా పెళ్లిళ్లలో అందరం బంగారు నగలను ధరించటానికే ఇష్టపడేవారు. అయితే ఈ మధ్యకాలంలో యువతీయువకుల అభిరుచులు మారుతున్నాయి. పెళ్లిళ్లలో పెట్టుకొనే నగలను లాకర్‌లో పెట్టి భద్రపరచాలని అనుకొనేవారి సంఖ్య తగ్గుతోంది. ఆ ఆభరణాలను పెళ్లి తర్వాత ప్రతి రోజు ధరించాలనుకుంటున్నారు. తల్లితండ్రుల అభిరుచుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. బంగారానికి ప్రత్యామ్నాయం కావాలని భావించేవారందరూ ప్లాటినం నగలను కొనుగోలు చేస్తున్నారు. ప్లాటినం తెల్లగా ఉంటుంది. దీనితో కూడా రకరకాల ఆభరణాలు డిజైన్లు అందుబాటులోకి వస్తున్నాయి.

బంగారపు ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి కదా... దీని ప్రభావం ప్లాటినంపై ఉందా?



తప్పకుండా ఉంది. బంగారం, వెండిల ధరలు పెరగటం వల్ల ఆభరణాలు కొనే సమయంలో వినియోగదారులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. బంగారం కన్నా తక్కువ ధర ఉండటం వల్ల కొందరు వినియోగదారులు ప్లాటినం ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ప్లాటినం ధర పెరుగుతుందనే భావన వారిలో ఉంది.

స్పోర్ట్స

మహిళల ప్రపంచ కప్ | ఫైనల్ నేడే

అమ్మాయిలూ అస్సలు వదలొద్దు

కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ.. అమోఘమైన ప్రదర్శనతో తుది సమరంలో నిలిచిన భారత మహిళలు.. అందలాన్ని అందుకునేందుకు మిగిలింది ఒక్క అడుగే..
మెగా టోర్నమెంట్‌లో మన ఘనతను చాటి చెప్పాలన్నా.. మహిళల క్రికెట్ చరిత్రలో చిరకాలం మన విజయాన్ని స్మరించుకోవాలన్నా.. కావాల్సింది ఇంకొక్క మ్యాచే!
గ్రూప్ దశలో మూడు ఓటములు బాధించినా, న్యూజిలాండ్‌పై ఘన విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టాం.. చాంపియన్ ఆస్ట్రేలియాను అలవోకగా చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకొచ్చాం.
ఇక.. హర్మన్‌సేన ముందున్నది సాధారణ ప్రత్యర్థి కాదు.. టోర్నీలో సూపర్‌ఫామ్‌తో అదరగొడుతోన్న పటిష్ట దక్షిణాఫ్రికా. అందునా, గ్రూప్ దశలో మనపై గెలిచి జోరుమీదున్న ఆ జట్టుపై ప్రతీకారం తీర్చుకునేందుకు.. ఎనిమిదేళ్ల క్రితం అందినట్లే అంది చేజారిన విశ్వకిరీటాన్ని ఒడిసి పట్టేందుకు.. స్వదేశంలో ప్రేక్షకుల కేరింతల మధ్య సగర్వంగా వన్డే ప్రపంచ కప్‌ను ముద్దాడేందుకు.. ఆ అద్భుత క్షణాలను తనివితీరా ఆస్వాదించేందుకు.. ఇంతకుమించిన తరుణం, అద్భుతమైన అవకాశం, అరుదైన సందర్భం ఇక రాదు! అందుకే.. అమ్మాయిలూ.. మీకు ఆకాశమే హద్దు.. అవకాశం అస్సలు వదలొద్దు!!

ఆల్ ది బెస్ట్ టీమిండియా!!!



మధ్యాహ్నం 3 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవీ ముంబై: అద్భుత పోరాటాలు.. నాటకీయ మలుపులు.. ఉత్కంఠ విజయాలు.. ఇలా సాగిన మహిళల ప్రపంచకప్‌లో కొత్త చాంపియన్‌కు రంగం సిద్ధమైంది. ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత జట్టు.. కలల కప్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆదివారం జరిగే మెగా టైటిల్ ఫైట్‌లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఎన్నో ఏళ్లుగా ప్రపంచ క్రికెట్‌ను ఏలుతున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లేకుండా జరుగుతున్న తొలి ఫైనల్ కావడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది. ఇక.. 2017 ఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో 9 పరుగులతో ఓటమి భారత జట్టును వెంటాడుతూనే ఉంది. ఈసారి గెలుపు రుచి చూడాలని హర్మన్ బృందం బలంగా కోరుకొంటోంది. సొంతగడ్డపై ఆడుతుండడంతోపాటు రెండుసార్లు ఫైనల్ ఆడిన అనుభవం ఉన్న టీమిండియా మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. భారత్ టోర్నీలో తొలిసారిగా 2005లో ఫైనల్ చేరింది. మరోవైపు చిరస్మరణీయ ప్రదర్శనతో తొలిసారి ఫైనల్ బెర్త్ పట్టేసిన అండర్ డాగ్ సౌతాఫ్రికా.. కచ్చితంగా కప్పు నెగ్గాలన్న పట్టుదలతో ఉంది.

నాకౌట్ పంచ్‌తో..

టోర్నీలో హ్యాట్రిక్ ఓటములతో నాకౌట్ అవకాశాలు గల్లంతయ్యే ప్రమాదం నుంచి భారత జట్టు పుంజుకొన్న తీరు వావ్ అనిపించింది. ముఖ్యంగా సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాపై రికార్డు ఛేదన గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. తీవ్ర ఒత్తిడి.. బలమైన బౌలింగ్ వనరులున్న కంగారూలను కసిగా కొట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. జెమీమా రోడ్రిగ్స్ (127) జీవిత కాలం గుర్తుండి పోయే ఇన్నింగ్స్‌తోపాటు కెప్టెన్ హర్మన్ (89) జోరందుకోవడంతో భారత్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. గాయపడిన ఓపెనర్ ప్రతీక స్థానంలో జట్టులోకి వచ్చిన షఫాలీ, డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టుకు అదిరే ఆరంభాన్ని అందించాల్సిన అవసరం ఉంది. జెమీమా, హర్మన్, రిచా, దీప్తి రాణిస్తే భారత్‌కు తిరుగులేదు. బౌలింగ్‌లో పేసర్లు క్రాంతి గౌడ్, రేణుక ఆరంభంలోనే బ్రేక్ ఇస్తే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే చాన్సుంది. టోర్నీలో మెరుగ్గా రాణిస్తున్న స్పిన్నర్లు శ్రీచరణి, దీప్తి అదే తరహా ప్రదర్శనను కొనసాగించాలి. అయితే, ధారాళంగా పరుగులిస్తున్న రాధా యాదవ్ స్థానంలో స్నేహ్ రాణాను ఆడించే అవకాశాలున్నాయి. భారత ఫీల్డింగ్ ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం కూడా ఉంది.

తెగువే ఆయుధం..

టోర్నీలో తడబడుతూ సాగినా కీలక సమయంలో గేర్ మార్చి అంతిమ సమరానికి చేరిన దక్షిణాఫ్రికా బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ లారా వొల్వార్ట్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. మరిజానె కాప్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా మారింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ ఫామ్‌లోకి వస్తే ఆపడం కష్టం. క్లో ట్రయాన్, నడిన్ డి క్లెర్క్ ఫినిషర్లుగా రాణిస్తున్నారు. అయాబొంగా ఖకా, ఎమ్‌లబా, డి క్లెర్క్‌తో సఫారీల బలం కూడా ప్రత్యర్థికి దీటుగానే ఉంది. అయితే, స్పిన్ ఎదుర్కోవడంలో బలహీనత ఆ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. కానీ, సెమీస్‌లో ఇంగ్లండ్‌పై చూపిన తెగువతో జట్టు మరోసారి అదరగొట్టాలనుకొంటోంది.

మ్యాచ్ రద్దయితే..!

వర్ష ఛాయలు ఉండడంతో మ్యాచ్ ఎలా జరుగుతుందనేది ఆందోళన కలిగిస్తోంది. అయితే, సాధ్యమైనంత వరకు ఆదివారం మ్యాచ్‌ను ముగించడానికే ప్రయత్నిస్తారు. డక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం కనీసం 20 ఓవర్లకైనా కుదించి ఫలితం రాబట్టేందుకు చూస్తారు. అలా కాని పక్షంలో సోమవారమైన రిజర్వు డేన ఎక్కడైతే ఆట నిలిచిందో అక్కడి నుంచి మిగతా మ్యాచ్‌ను కొనసాగిస్తారు. ఒకవేళ రిజర్వు డేన కూడా ఆట సాధ్యం కాకపోతే మ్యాచ్‌ను రద్దు చేసి.. ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

పిచ్/వాతావరణం

మ్యాచ్ జరిగే డీవై పాటిల్ స్టేడియం వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం. అయితే, మంచు కురిసే అవకాశం ఉండడంతో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించే పరిస్థితులున్నాయి. కానీ, రిజర్వు డే ఉంది. ఆసీస్ భారీ స్కోరును భారత్ ఛేదించిన పిచ్‌పైనే ఫైనల్ కూడా జరగనుండడం హర్మన్‌సేనకు సానుకూలాంశం.



ప్రాక్టీస్‌లో భారత క్రికెటర్లు

గెలిస్తే రూ. 125 కోట్లు?

వరల్డ్ చాంపియన్‌గా నిలిస్తే భారత జట్టుకు భారీగా నజరానా ఇవ్వాలని బీసీసీఐ ఆలోచిస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన రోహిత్ సేనకు ఇచ్చిన రీతిలోనే భారీ బహుమతి అందజేసే అవకాశముంది. గతేడాది పొట్టికప్ నెగ్గిన టీమిండియా, సహాయ సిబ్బందికి కలిపి బోర్డు రూ. 125 కోట్ల బహుమతిని ప్రకటించింది. లింగ సమానత్వం పాటిస్తున్న నేపథ్యంలో కప్పు నెగ్గితే హర్మన్ సేనకు కూడా ఆ స్థాయి మొత్తం అందించాలని బోర్డు భావిస్తోంది.

జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, షఫాలీ, జెమీమా, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్/స్నేహ్ రాణా, క్రాంతి, శ్రీచరణి, రేణుక సింగ్.

దక్షిణాఫ్రికా: లారా వొల్వార్ట్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, అన్నెక్ బోష్/మసబటా క్లాస్, సునె లుస్, మరిజానె కాప్, సినాలో జఫ్టా (వికెట్ కీపర్), అన్నెరి డెరెక్‌సన్, క్లో ట్రయాన్, డి క్లెర్క్, ఖకా, ఎమ్‌లాబా.

బ్యాటర్లు చెలరేగాలి

- ఆస్ట్రేలియాతో భారత్ మూడో టీ20 నేడు
- హాజెల్‌వుడ్‌కు విశ్రాంతి

మధ్యాహ్నం 1.45 నుంచి..

హోబర్ట్: పేసర్ హాజెల్‌వుడ్ బౌన్స్‌తో బెంబేలెత్తించడంతో ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరిగిన రెండో టీ20లో భారత ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేశారు. అయితే త్వరలో యాషెస్ సిరీస్ నేపథ్యంలో ఆసీస్ జట్టు.. టీమిండియాతో జరిగే మిగిలిన మూడు టీ20ల నుంచి హాజెల్‌వుడ్‌కు విశ్రాంతి ఇచ్చింది. మరి.. దీనిని సద్వినియోగం చేసుకొని సూర్యకుమార్ బృందం.. ఆదివారం జరిగే మూడో మ్యాచ్‌లో చెలరేగుతారేమో చూడాలి. మరోవైపు ఎడమ చేతి పేసర్ అర్ష్‌దీప్‌కు జట్టులో చోటు కల్పించక పోవడం విమర్శలకు దారి తీస్తోంది. పేసర్లకు అనుకూలించే మెల్‌బోర్న్ పిచ్‌పై ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా ఆడడాన్ని విశ్లేషకులు తప్పుబట్టారు. మూడో మ్యాచ్ వేదిక బెల్లరీవ్ ఓవల్ పిచ్ స్వింగ్ బౌలింగ్‌కు అనుకూలిస్తుంది. దాంతో ఒక స్పిన్నర్‌ను తప్పించి పేసర్‌ను తుది జట్టులో తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

టెన్నిస్‌కు బోపన్న గుడ్‌బై

న్యూఢిల్లీ: వెటరన్ స్టార్, గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన నలుగురు భారత ఆటగాళ్లలో ఒకడైన రోహన్ బోపన్న ప్రొఫెషనల్ టెన్నిస్‌కు శనివారం వీడ్కోలు పలికాడు. దరిమిలా రెండున్నర దశాబ్దాలకుపైగా సాగిన అతడి డబుల్స్ కెరీర్‌కు తెరపడింది. 45 ఏళ్ల బోపన్న ఆడిన చివరి టోర్నీ గతవారం జరిగిన పారిస్ మాస్టర్స్. ఆ టోర్నీలో రోహన్ తొలి రౌండ్‌లోనే ఓడాడు. 'ఆటకు వీడ్కోలు. కానీ ఇదే ముగింపు కాదు' అని బోపన్న ఉద్వేగభరిత పోస్ట్ చేశాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌తో భారత్‌కు చివరిసారి ఆడేశాడు. 2023లో డేవిస్ కప్‌నకు గుడ్‌బై చెప్పాడు.



రికార్డుల వీరుడు..

కర్ణాటకలోని కూర్గ్‌కు చెందిన బోపన్న డబుల్స్ ఆటగాడిగా ప్రసిద్ధుడు. 2000 సంవత్సరంలో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అడుగుపెట్టిన అతడు పలు డేవిస్ కప్ పోటీలు, గ్రాండ్‌స్లామ్‌లు, ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. లేటు వయసులో రికార్డు ప్రదర్శనలతో అలరించిన బోపన్న.. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్, 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిళ్లు సాధించాడు. 2023లో ఇండియన్ వెల్స్ గెలుపుతో 43 ఏళ్ల వయస్సులో ఏటీపీ మాస్టర్స్ టైటిల్ నెగ్గిన ఆటగాడిగా.. గతేడాది డబుల్స్‌లో నెంబర్ వన్ ర్యాంక్‌తో ఈ ఘనత సాధించిన అతిపెద్ద వయసు ఆటగాడిగానూ రికార్డులకెక్కాడు.

రిత్విక్ అదిరెన్

చెస్ వరల్డ్ కప్

మర్గావ్: ప్రపంచ కప్ చెస్ తొలి రౌండ్ మొదటి గేమ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ మెరుగైన ప్రదర్శన చేశాడు. శనివారం జరిగిన తొలి గేమ్‌లో 2024 వరల్డ్ జూనియర్ చాంపియన్ నొగెర్బెక్ కజిబెక్ (కజకిస్థాన్)ను రిత్విక్ నిలువరించాడు. మిగతా తెలుగు ఆటగాళ్లు లలిత్ బాబు, కార్తీక్ వెంకట్రామన్ తొలి రౌండ్ మొదటి గేములోనూ ఫలితం తేలలేదు. ఆదివారం మొదటి రౌండ్ రెండో గేములు జరుగుతాయి. ఇక.. గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, హరికృష్ణలకు మొదటి రౌండ్‌లో బై లభించింది. దాంతో రెండో రౌండ్‌తో వారు బరిలో దిగుతారు.

ఆసుపత్రి నుంచి శ్రేయాస్ డిశ్చార్జ

న్యూఢిల్లీ: భారత వైస్-కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సిడ్నీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఆస్ట్రేలియాతో గతనెల 25న జరిగిన మూడో వన్డేలో క్యాచ్ పట్టే యత్నంలో అయ్యర్ గాయపడిన సంగతి తెలిసిందే. పొత్తి కడుపులో గాయంతో అంతర్గతంగా రక్తస్రావం అయ్యింది. అందుకు చిన్నపాటి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం అయ్యర్ పూర్తిగా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి శనివారం డిశ్చార్జ్ అయ్యాడని బీసీసీఐ తెలిపింది. ప్రయాణం చేసేందుకు అనువుగా ఫిట్‌నెస్ సాధిస్తే అతడు భారత్ వచ్చే స్తాడని పేర్కొంది. కాగా, శ్రేయాస్ దాదాపు రెండు నెలలు ఆటకు దూరం కానున్నాడు.

హైదరాబాద్ రానున్న మెస్సీ!



కోల్‌కతా: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చే అవకాశముంది. కేరళలో జరగాల్సిన స్నేహపూర్వక మ్యాచ్ రద్దవడంతో ఆ అవకాశం హైదరాబాద్‌కు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మెస్సీ ప్రమోటర్లు తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో స్నేహపూర్వక మ్యాచ్‌లో మెస్సీ ఆడే చాన్సుంది. వచ్చేనెల 12న కోల్‌కతా చేరుకోనున్న మెస్సీ.. 13న హైదరాబాద్ రానున్నట్టు తెలుస్తోంది.

ఆరోగ్య బీమా తీసుకుంటున్నారా..!

బిజినెస్ ప్లస్

పాలసీ ఎంపికే కీలకం



ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు పెద్దలు. ప్రస్తుత ప్రపంచంలో ఆరోగ్యం మరింత ముఖ్యం. అన్నీ ఉన్నా సరైన ఆరోగ్యం లేకపోతే అన్నీ తిప్పలే. ఇల్లూ ఒళ్లూ గుల్లవుతుంది. సరైన ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోవడం ద్వారా ఆర్థిక ఇబ్బందులను కొంత వరకు అధిగమించవచ్చు. మరి సరైన ఆరోగ్య పాలసీని ఎంచుకోవడం ఎలా? అయితే ఈ స్టోరీ చదవండి.

ఇన్‌క్యూర్డ్ క్లెయిమ్ నిష్పత్తి

ఆరోగ్య బీమా పాలసీ ఇచ్చే కంపెనీ సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఇన్‌క్యూర్డ్ క్లెయిమ్ నిష్పత్తి (ఐసీఆర్) ఒక గీటురాయి. ఈ ఐసీఆర్ ద్వారా బీమా కంపెనీ ఒక ఆర్థిక సంవత్సరంలో తన నికర ప్రీమియం వసూళ్లలో ఎంత మొత్తాన్ని క్లెయిమ్‌లుగా చెల్లిస్తోందనే విషయం తెలుస్తుంది. ఉదాహరణకు ఒక బీమా కంపెనీ ఐసీఆర్ 85 శాతం అనుకుందాం. అంటే ఆ కంపెనీ నికర ప్రీమియంగా వసూలు చేసే ప్రతి రూ.లక్షలో రూ.85,000 క్లెయిమ్స్‌గా చెల్లిస్తోందని అర్థం. కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే వ్యక్తులు, కనీసం 70 నుంచి 90 శాతం ఐసీఆర్ ఉన్న బీమా కంపెనీలనే ఎంచుకుంటే మంచిది.

క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో

ప్రస్తుతం మార్కెట్లో అనేక బీమా కంపెనీలు ఆరోగ్య బీమా పాలసీలను మార్కెట్ చేస్తున్నాయి. ప్రతి కంపెనీ లేదా ఆ కంపెనీ ఏజెంట్ మా కంపెనీ పాలసీ మంచిదంటే, మా కంపెనీ పాలసీ మంచిదని మాటలతో మభ్య పెడుతుంటారు. వారి మాటలు గుడ్డిగా నమ్మి పాలసీ తీసుకుంటే ఇక అంతే. క్లెయిమ్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు చుక్కలు కనిపిస్తాయి. ఆ తిప్పలు వద్దనుకుంటే, పాలసీ తీసుకునే ముందే ఆ కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి (సీఎస్ఆర్) తెలుసుకుని మరీ పాలసీ తీసుకోవడం మంచిది. ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చే క్లెయిమ్స్‌లో ఎంత శాతం క్లెయిమ్స్‌ని కంపెనీ సెటిల్ చేసిందనే విషయాన్ని సీఎస్ఆర్ తెలుపుతుంది. కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే వ్యక్తులు కనీసం 90 శాతం కంటే ఎక్కువ సీఎస్ఆర్ ఉన్న బీమా కంపెనీల పాలసీలను ఎంచుకోవవం మంచిది.

పాలసీ షరతులు

ప్రతి ఆరోగ్య బీమా పాలసీలో కొన్ని షరతులు, నిబంధనలు ఉంటాయి. మనం తీసుకునే ప్లాన్, బీమా కంపెనీని బట్టి ఇవి మారుతుంటాయి. వాటిని తెలుసుకుని పాలసీ తీసుకోవడం పాలసీదారుల బాధ్యత. లేకపోతే క్లెయిమ్స్ సమయంలో చిక్కులు తప్పవు. ఆ షరతులు ఏంటంటే?

రూమ్ రెంట్

ఆరోగ్య బీమా పాలసీలో రూమ్ రెంట్‌పై పరిమితులు ఉంటాయి. ఇది పాలసీ మొత్తంలో ఇంత శాతం లేదా ఇంత నిర్ణీత మొత్తమని ఉంటుంది. పాలసీ తీసుకునే ముందే, ప్రతి పాలసీదారుడు ఈ పరిమితులు తెలుసుకోవాలి. ఉదాహరణకు రూ.10 లక్షల పాలసీలో రూమ్ రెంట్ రోజుకి ఒక శాతం అనుకుందాం. అంటే ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తి హాస్పిటల్‌లో చేరితే రోజువారీ రూమ్ రెంట్ పాలసీ విలువైన రూ.10 లక్షల్లో ఒక శాతం అంటే రూ.10,000 మించకూడదు.

వెయిటింగ్ పీరియడ్

ప్రతి ఆరోగ్య బీమా పాలసీ కవరేజీకి కనీసం నెల రోజుల సమయం ఉంటుంది. అంటే పాలసీ తీసుకున్న నెల రోజుల్లోపు వచ్చే ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ లభించదు. అలాగే బీమా పాలసీ తీసుకున్న ఒకటి నుంచి మూడేళ్ల వరకు అప్పటికే ఉన్న కొన్ని అనారోగ్య సమస్యలకు కూడా కవరేజీ వర్తించదు. కొన్ని బీమా కంపెనీలు అధిక ప్రీమియంతో ఇప్పటికే ఉన్న వ్యాధులకు కూడా కవరేజీ కల్పిస్తున్నాయి.

కో-పేమెంట్ లేదా డిడక్షన్ ఆప్షన్

ఈ రెండు ఆప్షన్లలో దేన్ని ఎంచుకున్నా ప్రీమియం తగ్గుతుంది. అయితే పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు పాలసీదారుడి జేబుకు చిల్లు పడుతుంది. ఉదాహరణకు 20 శాతం కో-పేమెంట్ ఆప్షన్‌ను ఎంచుకుంటే, హాస్పిటల్ బిల్లులో 20 శాతం పాలసీదారుడు, మిగతా 80 శాతం బీమా కంపెనీ చెల్లించాలి. అలాగే నిర్ణీత మొత్తాన్ని డిడక్షన్ ఆప్షన్‌గా ఎంచుకుంటే ఆ మొత్తాన్ని పాలసీదారుడు చెల్లిస్తే, మిగతా మొత్తాన్ని బీమా కంపెనీ భరిస్తుంది.

నెట్‌వర్క్ ఆస్పత్రులు

కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే ప్రతి వ్యక్తి ఆ బీమా కంపెనీ జాబితాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులు మీకు దగ్గరలో ఉన్నాయో లేదో తెలుసుకోవాలి. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి ఈ ఆస్పత్రుల్లో చేరితే పాలసీ పరిమితికి లోబడి పైసా కూడా జేబు నుంచి ఖర్చు చేయకుండా బయటపడొచ్చు. అంటే ఈ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందుకోవచ్చన్న మాట. మీకు క్లెయిమ్ చేసే అవసరం లేకుండా ఆస్పత్రే మీ బిల్లును బీమా కంపెనీ నుంచి సెటిల్ చేసుకుంటుంది.

మినహాయింపులు

ప్రతి ఆరోగ్య బీమా పాలసీలో కొన్ని మినహాయింపులు ఉంటాయి. సాధారణంగా ఇప్పటికే ఉన్న వ్యాధులు, ఔట్ పేషెంట్ ట్రీట్‌మెంట్స్, స్థూలకాయానికి సంబంధించిన చికిత్సలు, కాస్మెటిక్ సర్జరీలు, వంధ్యత్వం, సాహస క్రీడలతో ఏర్పడే గాయాలు, దంత సంరక్షణ, ప్రసూతి చికిత్సలు ఈ మినహాయింపుల పరిధిలోకి వస్తాయి. అయితే ఈ మినహాయింపులు బీమా కంపెనీలను బట్టి మారుతుంటాయి. పాలసీ తీసుకునే ముందే వీటిని చెక్ చేసుకోవాలి.

ప్రీ-పోస్ట్ హాస్పిటలైజేషన్ కవరేజీ

హాస్పిటల్‌లో చేరడానికి ముందు లేదా చేరిన తర్వాత జరిపే బ్లడ్ టెస్టులు, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఈసీజీ, ఎంఆర్ఐ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రీ హాస్పిటలైజేషన్ ఖర్చుల పరిధిలోకి వస్తాయి. కొన్ని బీమా కంపెనీలు నెల నుంచి రెండు నెలల ముందు జరిపే ఈ పరీక్షలకు కూడా కవరేజీ కల్పిస్తున్నాయి. ఇక హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యాక ఔషధాలు, ఫాలో అప్ కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఫిజియోథెరపీ, కోలుకోవడానికి అవసరమైన ఇతర వైద్య సేవల ఖర్చులు పోస్ట్ హాస్పిటలైజేషన్ ఖర్చుల పరిధిలోకి వస్తాయి. చాలా ఆరోగ్య బీమా కంపెనీలు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక రెండు నెలల నుంచి ఆరు నెలల వరకు అయ్యే ఈ ఖర్చులకు కవరేజీ కల్పిస్తున్నాయి.

వీలైనంత ఎక్కువ కాలానికి ప్రీ హాస్పిటలైజేషన్, పోస్ట్ హాస్పిటలైజేషన్ ఖర్చులకు కవరేజీ కల్పించే బీమా కంపెనీల పాలసీలను ఎంచుకుంటే మంచిదని నిపుణుల సూచన. లేకపోతే ఆరోగ్య బీమా పాలసీ ఉన్నా పెద్ద మొత్తంలో జేబులోని డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

అక్టోబరులో 4.6% వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.6 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్లకు చేరింది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పండగ సీజన్‌లో కొనుగోళ్లు జోరందుకోవడం ఇందుకు దోహదపడింది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సగటు వృద్ధి రేటు 9 శాతంగా ఉంది. సెప్టెంబరు 22 నుంచి 375 ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్లు తగ్గడం గత నెల ఆదాయ వృద్ధిని పరిమితం చేసింది. ఈ ఆగస్టులో జీఎస్‌టీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1.86 లక్షల కోట్లుగా, సెప్టెంబరులో 9.1 శాతం పెరుగుదలతో రూ.1.89 లక్షల కోట్లుగా నమోదైంది.

నికర ఆదాయం రూ.1.69 లక్షల కోట్లు

స్థానిక విక్రయాలకు సంకేతమైన దేశీయ స్థూల ఆదాయం గత నెలలో 2 శాతం పెరుగుదలతో రూ.1.45 లక్షల కోట్లుగా ఉంది. దిగుమతుల నుంచి పన్ను రాబడి 13 శాతం వృద్ధితో రూ.50,884 కోట్లకు పెరిగింది. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు 39.6 శాతం పెరిగి రూ.26,934 కోట్లకు చేరాయి. రిఫండ్లు మినహాయించగా, జీఎస్‌టీ నికర ఆదాయం 0.2 శాతం పెరుగుదలతో రూ.1.69 లక్షల కోట్లుగా ఉంది.

తెలంగాణలో : గత నెల తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.5,726 కోట్లకు చేరింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,000 ▲	1,12,750 ▲	1,66,000 ▲
విజయవాడ	1,25,000 ▲	1,18,000 ▲	1,52,200 ▼
విశాఖపట్నం	1,24,370 ▲	1,13,000 ▲	1,66,000 ▲
రాజమండ్రి	1,23,000 ▼	1,12,750 ▼	1,50,000 ▲
ప్రొద్దుటూరు	1,21,300 ▲	1,11,600 ▲	1,52,500 ▼
ముంబై	1,20,770 ▲	1,10,625 ▲	1,49,125 ▲

వాహన విక్రయాల్లో రికార్డు

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో అక్టోబరులో పోటెత్తిన అమ్మకాలు

న్యూఢిల్లీ: ఈ పండగ సీజన్‌లో ప్యాసింజర్ వాహన కంపెనీలకు భారీ లాభాల పంట పండింది. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీ ఇండియాతో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్, కియా ఇండియా గత నెలలో రికార్డు స్థాయి దేశీయ విక్రయాలను నమోదు చేశాయి. స్కోడా ఆటో ఇండియా, టయోటా కిర్లోస్కర్ సేల్స్ కూడా భారీగా పెరిగాయి. దసరా నవరాత్రుల తొలి రోజు (సెప్టెంబరు 22) నుంచి తగ్గించిన జీఎస్‌టీ రేట్లు అమల్లోకి రావడంతో పండగ సీజన్‌లో కస్టమర్ల కొనుగోళ్లు పోటెత్తడం ఇందుకు దోహదపడింది. అక్టోబరులో కంపెనీ 2,42,096 యూనిట్ల రిటైల్ విక్రయాలు జరిపిందని, 2024 అక్టోబరుతో పోలిస్తే సేల్స్ 20 శాతం పెరిగాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. ఇది కంపెనీ చరిత్రలో అత్యధిక నెలవారీ విక్రయాలని అన్నారు. నవరాత్రుల తొలి రోజు మొదలుకొని 40 రోజుల పండగ సీజన్‌లో కంపెనీకి 5 లక్షల కార్ల బుకింగ్స్ లభించాయని, రిటైల్ సేల్స్ 4.1 లక్షల యూనిట్లుగా నమోదైనట్లు బెనర్జీ వెల్లడించారు. మరిన్ని విషయాలు..

- గత నెలలో మారుతి సుజుకీ దేశీయ టోకు విక్రయాలు (ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలు) వార్షిక ప్రాతిపదికన 10.75 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు స్థాయి 1,80,675 యూనిట్లకు చేరాయి. అందులో ప్యాసింజర్ వాహనాల దేశీయ టోకు విక్రయాలు 10.48 శాతం పెరుగుదలతో 1,76,318 యూనిట్లుగా ఉన్నాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్‌యూవీల టోకు విక్రయాలు 31 శాతం వృద్ధితో 71,624 యూనిట్లకు చేరాయి. కంపెనీ చరిత్రలో ఇవే అత్యధిక ఎస్‌యూవీ విక్రయాలు.
- టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ టోకు విక్రయాలు 26.6 శాతం పెరుగుదలతో 61,295 యూనిట్లకు చేరాయి.
- హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దేశీయ విక్రయాలు మాత్రం వార్షిక ప్రాతిపదికన 3.2 శాతం తగ్గి 53,792 యూనిట్లకు పరిమితం అయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 30 శాతం పెరిగి 29,556 యూనిట్లకు చేరాయి.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) టోకు అమ్మకాలు 39 శాతం పెరిగి 42,892 యూనిట్లకు చేరగా.. స్కోడా ఆటో రికార్డు స్థాయిలో 8,252 కార్లను విక్రయించింది. నిస్సాన్ మోటార్ దేశీయంగా 2,402 కార్లను విక్రయించింది. హోండా కార్స్ దేశీయ అమ్మకాలు 15.3 శాతం వృద్ధితో 6,934 యూనిట్లకు పెరిగాయి.

వాణిజ్య వాహనాలు: కమర్షియల్ వెహికిల్స్ విషయానికొస్తే, అశోక్ లేలాండ్ వాహనాల దేశీయ టోకు విక్రయాలు 16 శాతం పెరుగుదలతో 16,314 యూనిట్లకు పెరిగాయి. టాటా మోటార్స్ దేశీయ టోకు అమ్మకాలు 7 శాతం వృద్ధితో 35,108 యూనిట్లుగా నమోదయ్యాయి.

రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీ...

అధికారి పేరు	ప్రస్తుత పోస్టింగ్	బదిలీ స్థానం
మణికంఠ చందోలు	వెయిటింగ్	డీసీపీ ఎల్అండ్ఓ, విశాఖ సిటీ
కృష్ణకాంత్ పటేల్	డీసీపీ ఎల్అండ్ఓ, విశాఖ	డీసీపీ, ఎల్అండ్ఓ, ఎన్టీఆర్ కమిషనరేట్
అధిరాజ్ సింగ్ రాణా	వెయిటింగ్	ఎస్పీ, సైబర్ క్రైమ్స్, సీఐడీ
కంచి శ్రీనివాసరావు	వెయిటింగ్	ఎస్పీ, ఇంటెలిజెన్స్
షేక్ షరీన్ బేగమ్	వక్ఫ్ నుంచి వెనక్కి	డీసీపీ, ట్రాఫిక్, ఎన్టీఆర్ కమిషనరేట్
ఇ.జి. అశోక్ కుమార్	వెయిటింగ్	జేడీ, ఏసీబీ
వి.రత్న	వెయిటింగ్	ఎస్పీ, ఉమెన్ సేఫ్టీ సెల్, సీఐడీ
వై.రవిశంకర్ రెడ్డి	వెయిటింగ్	కమాండెంట్, ఏపీఎస్పీ, విజయనగరం
ఆర్.గంగాధర్ రావు	వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ
టి.పనస రెడ్డి	వెయిటింగ్	ఏఐజీ, ఆర్గనైజేషన్స్
పి.వెంకటరత్నం	వెయిటింగ్	ఏఐజీ, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్
ఎం.సత్తిబాబు	వెయిటింగ్	ఏఐజీ, ట్రైనింగ్
బి.లక్ష్మీనారాయణ	వెయిటింగ్	డీసీపీ రూరల్, ఎన్టీఆర్ కమిషనరేట్
కె.ఎం.మహేశ్వర రాజు	డీసీపీ, విజయవాడ	ఎస్పీ, ఈగల్
కృష్ణ ప్రసన్న	ఎస్పీ, సీఐడీ	డీసీపీ, సైబర్ క్రైమ్స్, ఎన్టీఆర్ జిల్లా
జగదీశ్ అడహళ్లి	అడిషనల్ ఎస్పీ, ఏఎస్ఆర్	ఎస్పీ, సీఎంఎస్‌జీ, ఇంటెలిజెన్స్
పంకజ్ కుమార్ మీనా	ఏఎస్పీ, చింతూరు	అడిషనల్ ఎస్పీ, ఏఎస్ఆర్ జిల్లా
సూరాన అంకిత మహవీర్	ఏఎస్పీ, పార్వతీపురం	అడిషనల్ ఎస్పీ, సత్యసాయి జిల్లా
సుస్మిత.ఆర్	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఏఎస్పీ, జంగారెడ్డిగూడెం
హేమంత్ బొడ్డు	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఏఎస్పీ, చింతూరు
మనీషా వంగల రెడ్డి	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఏఎస్పీ, పార్వతీపురం



నిందితుడు యుగంధర్... అంతకు ముందు, ఇప్పుడు

హత్య చేసి హిమాలయాలకు..!

» నాలుగేళ్ల తరువాత ఇంటికి.. అరెస్టు

విశాఖపట్నం/మహారాణిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో బెయిల్‌పై బయటకొచ్చిన వ్యక్తి హిమాలయాలకు పారిపోయి నాలుగేళ్ల తర్వాత తిరిగొచ్చాడు. నిఘా పెట్టిన పోలీసులు శనివారం అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి వివరాలను వెల్లడించారు. పూర్ణామార్కెట్‌కు చెందిన పిచ్చేడి యుగంధర్ (39) 2021లో సుబ్బారెడ్డి అనే వ్యక్తిని కత్తితో పొడిచి హత్యచేశాడు. ఈ కేసులో బెయిల్‌పై బయటకొచ్చిన ఆయన, హిమాలయాలకు వెళ్లి భైరవస్వామి బాబాగా పేరు మార్చుకున్నాడు. కుటుంబసభ్యులతో కూడా సంబంధాలు లేవు. ఇటీవల స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడినట్టు గుర్తించిన పోలీసులు నిఘా పెట్టారు. శనివారం యుగంధర్ నగరానికి వస్తున్నట్టు నిర్ధారించుకొని, రైల్వే క్వార్టర్స్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామలకు నోటీసులు

» మరో ఇద్దరికీ.. కర్నూలు ప్రమాదంపై దుష్ప్రచారం

» 27 మందిపై కేసు... దర్యాప్తునకు పోలీస్ బృందాలు

కర్నూలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ ఆరే శ్యామలతో పాటు మరో ఇద్దరికి పోలీసులు నోటీసులు జారీచేశారు. 'బెల్టు షాపుల్లో మద్యం తాగడం వల్లే ప్రమాదం జరిగింది' అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడుకు చెందిన వేణుములయ్య ఫిర్యాదు చేశారు. దీంతో 27 మందిపై కేసు నమోదైంది. కర్నూలు విచారణకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నాలుగు పోలీసు బృందాలను నియమించారు. కేసు నమోదైన వారి జాబితాలో వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, సీవీ రెడ్డి, కందూరి గోపికృష్ణ తదితరులు ఉన్నారు. కేసు విచారణలో భాగంగా శనివారం ఓ పోలీసు బృందం హైదరాబాద్‌లోని గండిపేటలో యాంకర్ శ్యామల ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. అలాగే అనంతపురం జిల్లా తాడిపత్రిలో నాగార్జునరెడ్డి, ఒంగోలులో కిరణ్, విజయవాడకు చెందిన మరో ఇద్దరికి నోటీసులు జారీచేసినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న 27 మందికి నోటీసులు జారీచేసి, విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు. నోటీసులు అందుకున్న మూడు రోజుల్లోగా ఆరోపించినట్లు బెల్టు షాపులు ఎక్కడ ఉన్నాయి, యువకులు మద్యం ఎక్కడ తాగారు? అన్న విషయాలపై సమగ్ర సమాచారంతోపాటు ఆధారాలను సమర్పించాలని పోలీసులు కోరారు.

రేపటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

» 48 గంటల్లోపే ఖాతాల్లో నగదు జమ

» ముందస్తుగా వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్

» ఆరుగొలనులో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల



అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ఈ నెల 3 నుంచి ప్రారంభించనుంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఆరుగొలను గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 51 లక్షల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలతో పాటు 2,061 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గోనెసంచులు, ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించే యంత్రాలు, రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలనుకునే రైతులు 7337359375 వాట్సాప్ నంబరుకు 'హాయ్' అని సందేశం పంపి తమ వివరాలు నమోదు చేసి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మంత్రి సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సరికొత్త ప్రపంచంలోకి ...



ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబరు 25న విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో ప్రభాస్ ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడు, అసురులుకి మధ్య జరిగిన ఓ భీకర యుద్ధం.. ఈ కథకి మూలం' అంటూ నటుడు సాయికుమార్ వాయిస్ ఓవర్‌తో మొదలైన ఈ ట్రైలర్‌లోని సంభాషణలు, విజువల్స్, మేకింగ్, సంగీతం, పోరాట ఘట్టాలు అలరించేలా ఉన్నాయి. ఆది సాయికుమార్ పాత్ర చాలా శక్తిమంతంగా కనిపిస్తోంది. విజువల్ వండర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని మేకర్స్ తెలిపారు.

పెద్ది ప్రేయసి



రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'పెద్ది' చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేశారు మేకర్స్. రామ్‌చరణ్ ప్రేయసిగా అచ్చియ్యమ్మ అనే పాత్రలో ఫైర్‌బ్రాండ్‌గా ఆమె కనిపించనుందని మేకర్స్ పేర్కొన్నారు. జాన్వీ లుక్స్ చూస్తుంటే ఇందులో ఆమె పాత్ర చిత్రణ మాస్‌గా ఉంటూ దేనికీ భయపడని అమ్మాయిగా కనిపించనుందని తెలుస్తోంది. ఇందులో రామ్‌చరణ్ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 27న ఈ చిత్రం విడుదలవుతోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, బాలీవుడ్ నటులు బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' తొలి పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు సమాచారం.

రష్మిక పారితోషికం తీసుకోలేదు

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలిద్దరూ మీడియాతో మాట్లాడారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌లో ఇమిడే కథ కాదు. అయినా బాగా నచ్చడంతో రిస్క్ తీసుకున్నామని ధీరజ్ తెలిపారు. 'ఈ సినిమా ప్రతి ఒక్కరి ప్రేమకథకు కనెక్ట్ అవుతుంది. రాహుల్ రవీంద్రన్ సినిమాను తెరకెక్కించిన తీరు సెన్సార్ సభ్యులకు నచ్చి, 'నేషనల్ అవార్డ్ దక్కుతుంద'ని ప్రశంసించారు. ఈ సినిమాకు రష్మిక ఇప్పటివరకూ ఇంకా పారితోషికం తీసుకోలేదు. ఆమె మా పైన చూపిన ఔదార్యానికి గుర్తుగా రెట్టింపు పారితోషికం ఇస్తాం' అని ధీరజ్ చెప్పారు.



ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి

కథకు కనెక్ట్ అయ్యాం

'ది గర్ల్‌ఫ్రెండ్' స్టోరీకి మేం బాగా కనెక్ట్ అయ్యాం అని విద్య కొప్పినీడి అన్నారు. 'ఈ సినిమా ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. ఇది మహిళా ప్రాధాన్య చిత్రం కాదు. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో రాసిన బలమైన ప్రేమకథ. ప్రేక్షకులకు తమకు తెలిసిన వారి ప్రేమకథలు గుర్తుకొచ్చేలా ఈ సినిమా ఉంటుంది. అందుకే విజయం విషయంలో మేం ఎలాంటి టెన్షన్ లేకుండా ఉన్నాం' అని విద్య తెలిపారు.



గెలుపు కాదు పోరాటమే గొప్ప

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మించిన హై-స్పీడ్ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్'. ఈనెల 6న విడుదలవుతోంది. శనివారం జరిగిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ 'భారతీయ చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ ఫిల్మ్ మాదేనని గర్వంగా చెబుతున్నా. నా సినీ కెరీర్‌లో ఈ చిత్రం ఓ టర్నింగ్ పాయింట్. ఇందులో కనిపించిన స్టంట్స్ ఏవీ సీజీ కాదు. ఒరిజినల్ బైకర్స్‌తో ఇండోనేషియా వెళ్లి రిస్కీగా షూట్ చేసివచ్చాం. ఇంత గొప్ప సినిమా తీయాలంటే నిర్మాతలకు ధైర్యం ఉండాలి. వంశీ అన్నకు థాంక్స్. ఇది నా సినిమా అని గర్వపడే ప్రాజెక్ట్' అని చెప్పారు. రాజశేఖర్ మాట్లాడుతూ 'నా మనసుకు నచ్చిన సబ్జెక్ట్ 'బైకర్'. అభిలాష్ ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు. ఈ సినిమాకు పెట్టిన ఖర్చు చూసి నాకు భయం వేసేది. కానీ వంశీ గారు మాత్రం చాలా కూల్‌గా ఉన్నారు. శర్వా నా నటనను మెచ్చుకోవడం నాకు అవార్డుతో సమానం' అని చెప్పారు. అభిలాష్‌రెడ్డి మాట్లాడుతూ 'ఇక్కడ గెలవడం గొప్ప కాదు చివరి దాకా పోరాడడం గొప్ప అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. రేసింగ్ సినిమాలు చూసిన ఎగ్జైట్‌మెంట్‌కు మించి ఈ చిత్రం ఉంటుంది. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అని తెలిపారు.

చిత్రీకరణ పూర్తి



సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తోన్న చిత్రం 'గోట్'. జైశ్నవ్ ప్రొడక్షన్స్, మహాతేజ క్రియేషన్స్ బేనర్లపై మొగుళ్ల చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ ముగిసింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నేను నిర్మించిన వాటిల్లో మంచి చిత్రంగా నిలుస్తుంది. త్వరలోనే టీజర్, పాటలు విడుదల చేస్తాం. మరిన్ని అప్డేట్స్‌తో త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని అన్నారు. రాజేంద్రన్, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

కొత్త తరహా కథతో...



నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ దేవ్ ప్రధాన పాత్రధారులుగా పార్థసారధి కొమ్మోజు తెరకెక్కించిన చిత్రం 'సందిగ్ధం'. తీర్థ క్రియేషన్స్ బేనర్‌పై సంధ్య తిరువీధుల నిర్మించారు. ఇటీవలె నిర్వహించిన వేడుకలో నిర్మాత అశోక్ కుమార్ టీజర్ విడుదల చేశారు. పార్థసారధి మాట్లాడుతూ 'ఇలాంటి కథ ఇంత వరకూ రాలేదని చెప్పొచ్చు. ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు. హీరో నిహాల్ మాట్లాడుతూ 'ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

ఇండియా జాయ్‌లో.. ప్రధానాకర్షణగా దేశీటూన్స్

'ఇండియా జాయ్' ఫెస్టివల్ 8వ ఎడిషన్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగింది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల సమ్మేళనంగా ఈ వేడుక సాగింది. ఈ కాన్‌క్లేవ్‌లో 'దేశీ టూన్స్' అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ ఏడాది థీమ్ అయిన 'ద పవర్ ఆఫ్ ఒరిజినల్స్' ద్వారా మన మూలాలకు చెందిన అనేక విభిన్న కథల్ని దేశీ టూన్స్ ఈ వేదికపై ఆవిష్కరించి, భారతీయ కథల వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటింది. హైదరాబాద్ యానిమేషన్ హబ్‌గా మారుతున్న తరుణంలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం మంచి పరిణామం అని తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు (టీవీఏజీఏ) రాజీవ్ చిలకా పేర్కొన్నారు. 'మన ఊహాశక్తి, పనితనంతో ప్రపంచ యానిమేషన్ రంగానికి నాయకత్వం వహించే దిశగా మనం ఎదుగుతున్నాం' అని దర్శకుడు నాగ్ అశ్విన్ అన్నారు. 'దేశీ టూన్స్ భారతదేశ సృజనాత్మక శక్తిని సరైన సమయంలో ఆవిష్కరిస్తోంది' అని మరో దర్శకుడు అశ్విన్ కుమార్ చెప్పారు.










గృహ హింస కేసుల పరిష్కారంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, వేదికపై హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

గృహహింస కేసులలో మధ్యవర్తిత్వంపై వర్క్‌షాప్

- ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ
- న్యాయాధికారులకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్ దిశానిర్దేశం

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గృహహింస కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై శనివారం ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో న్యాయాధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కాజాలోని జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ హాజరై న్యాయాధికారులకు దిశానిర్దేశం చేశారు. గృహహింస కేసులను వేగంగా పరిష్కరించేందుకు అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. వీరితోపాటు జ్యుడీషియల్ అకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హారి, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. వీరితో పాటు అన్ని జిల్లాల లీగల్ సర్వీసెస్ అథారిటీల చైర్మన్‌లు(జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు), ఫ్యామిలీ కోర్టు ప్రిసైడింగ్ అధికారులు, అదనపు జిల్లా న్యాయమూర్తులు, వాణిజ్య కోర్టులకు అధ్యక్షతవహించే న్యాయాధికారులు, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి, ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిప్యూటీ సెక్రెటరీ, అన్ని జిల్లాల ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులు, మేజిస్ట్రేట్‌లు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించండి

- రాజకీయంగా నా ప్రతిష్ఠ దిగజారుస్తున్నారు
- హైకోర్టులో వైసీపీ నేత జోగి రమేశ్ పిటిషన్



అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ నేత, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జోగి రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నకిలీ మద్యం తయారీ, సరఫరాకు సంబంధించి అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్‌లలో నమోదైన కేసులను సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. ఆ కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావు పోలీస్ కస్టడీలో ఉండగా వీడియో వాంగ్మూలం రికార్డు చేసి మీడియాకు విడుదల చేసిన వ్యవహారంపై అక్టోబరు 15న తాను ఫిర్యాదు చేశానని తెలిపారు. అయితే.. ఈ ఫిర్యాదుపై విజయవాడ పోలీస్ కమిషనర్ కేసు నమోదు చేయలేదని, దీనిని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోర్టును అభ్యర్థించారు.

మరో వారం కస్టడీకి ఇవ్వండి

- నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

విజయవాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి సోదరులను మరోసారి కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు శనివారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావులను మరో వారం పాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే వారిని వారం రోజుల కస్టడీకి ఇస్తూ విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇచ్చింది. మూడు రోజుల క్రితమే ఆ గడువు ముగిసింది

తుఫాన్ నిర్వహణపై.. పిట్టల దొర మాటలు

- ఇది హృదయం లేని, అసమర్థ ప్రభుత్వం: జగన్



అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'తుఫాన్ నిర్వహణపై బాబుగారివి పిట్టల దొర మాటలు. ఇది హృదయం లేని, అసమర్థ ప్రభుత్వం' అని వైసీపీ అధ్యక్షుడు జగన్ విమర్శించారు. ఆయన ఎక్స్ వేదికగా శనివారం స్పందించారు. మొంథా తుఫానుకు రైతులు నష్టపోవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనంటూ వివరణాత్మక ఆరోపణలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంట బీమా అమలు చేయకపోవడంతో సొంతగా బీమా కట్టుకోలేని ఐదు లక్షల మంది రైతులు పరిహారం అందక నష్టపోతున్నారని ఆరోపించారు. 16 నెలల కాలంలో 16 ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని అన్నారు. ఆర్బీకేలను నిర్వీర్యం చేశారని, ఈ-క్రాపింగ్ విధానాన్ని నిలిపివేశారని ఆరోపించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపకపోవడం చారిత్రక తప్పిదం

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నవంబరు 1న నిర్వహించకపోవడం చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదమని జగన్ విమర్శించారు. ఎక్స్ వేదికగా శనివారం మరో ప్రకటన చేసిన ఆయన... ముందుగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపకపోవడమంటే పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని అవమాన పరచడమేనని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రాజకీయాలకు అతీతంగా జరగాలని జగన్ పేర్కొన్నారు. మరో ప్రకటనలో... దైవదర్శనాలకు వెళ్లే భక్తుల భద్రతను చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందని జగన్ విమర్శించారు. ఈ ఏడాది తిరుమల, సింహాచలం, కాశీబుగ్గలలో జరిగిన ఘటనలను ఆయన ఉదహరించారు. బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీఎస్ సమీక్ష



అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫీడర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ మీటరింగ్‌ను నిర్దేశిత కాలపరిమితిలో వంద శాతం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్తు పంపిణీ సంస్థలను ఆదేశించారు. శనివారం డిస్కంల సీఎండీలతో ఆర్డీఎస్ఎస్ (రీవేంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్తు పంపిణీ సంస్థలు ఇప్పటి వరకు 17.96 లక్షల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశాయని, ఇవి మంజూరైన మీటర్లలో సుమారు 45 శాతం కాగా, వీటిలో సుమారు 96 శాతం వినియోగంలోకి వచ్చాయని సీఎస్ పేర్కొన్నారు. ప్రభుత్వ, వాణిజ్య సముదాయాలు, అధిక విద్యుత్తు వాడే గృహ వినియోగదారుల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈపీడీసీఎల్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్ల పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇన్‌స్టాలేషన్లు విజయవంతంగా ప్రారంభమయ్యాయని, అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రీపెయిడ్ ఆపరేషన్లను విస్తరింపచేయాలని కోరారు. ఆర్డీఎస్ఎస్ కింద ఫీడర్ మానిటరింగ్, స్మార్ట్ మీటరింగ్‌లో డిస్కంలు సాధించిన పురోగతిని సీఎస్ ప్రశంసించారు. రాష్ట్రంలోని 11 కేవీ ఫీడర్లలో 92.65 శాతం ఆన్‌లైన్ మానిటరింగ్ సాధించామని తెలిపారు.

వివాదాల పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉంది

- ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఎంపీ మిథున్ రెడ్డి

న్యూఢిల్లీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశంలో భారత్ తరఫున రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ప్రసంగించారు. ఇందుకు సంబంధించిన వీడియోను న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం శనివారం పోస్ట్ చేసింది. అంతర్జాతీయ లా కమిషన్ ఆరవ కమిటీ పనితీరు నివేదికపై ఆయన మాట్లాడుతూ... పరస్పర సంప్రదింపులు, చర్చల ద్వారానే వివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే విషయాన్ని భారతదేశం విశ్వసిస్తోందన్నారు. ఐక్యరాజ్యసమితిలో భారత్ వ్యవస్థాపక సభ్య దేశమని, ఐక్యరాజ్యసమితి విధివిధానాలకు తమ దేశం కట్టుబడి ఉందన్నారు. వర్తకం, పెట్టుబడుల్లో తలెత్తే వివాదాల పరిష్కారాలకు ఐక్యరాజ్యసమితి విధానాలకు అనుగుణంగా భారత్ పనిచేస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాల మధ్య వివాదాలను కూడా మధ్యవర్తిత్వం, ప్రత్యామ్నాయ విధానాల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చన్నారు.

రియల్ టైమ్‌లో.. ఆదుకున్నాం..

"టెక్నాలజీని ఉపయోగించి మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. చీఫ్ సెక్రటరీ నుంచి సచివాలయ సిబ్బంది దాకా అందరూ తుఫాన్ సమయంలో బాగా పని చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు అప్రమత్తమై జిల్లా యంత్రాంగంతో కలిసి రియల్ టైంలో పనిచేశారు. అలా పని చేయించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుంది. ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా ఆదుకున్నాం. విపత్తు వస్తుందంటే సురక్షిత ప్రాంతాలకు తరలించాం. పంటపొలాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నాం. రియల్ టైంలో పనిచేశాం కాబట్టే గట్టెక్కగలిగాం. తుఫాన్ ప్రభావంతో రూ.5,250 కోట్ల నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు తయారు చేసి, నిధులు మంజూరు చేయాలంటూ కేంద్రానికి నివేదికలు పంపిం చాం. ఇదంతా టెక్నాలజీని ఉపయోగించుకోవడం వల్లనే చేయగలిగాం. ఒకప్పుడు నేను సెల్‌ఫోన్ అంటే ఎగతాళి చేశారు. ఇప్పుడు ఆ ఎగతాళి చేసినవాళ్లు కూడా సెల్‌ఫోన్ వాడుతున్నారు. ఐటీ విప్లవం రాబోతోందని 30ఏళ్ల క్రితమే చెప్పాను. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మించడం ద్వారా తెలుగువారిని సాంకేతిక విప్లవంలో భాగం చేశాను. దానివల్ల ఇప్పుడు ప్రపంచంలో తెలుగువాళ్లు లేని దేశం లేదు. ఇప్పుడు మరో విప్లవానికి నాంది పలికాను. అదే డేటా, ఏఐ టెక్నాలజీ. గూగుల్ ఆర్టిఫిషియల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తున్నాం. రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడిని గూగుల్ ఈ ప్రాజెక్టులో పెడుతోంది. కరువు సీమకు కియ పరిశ్రమను తీసుకొచ్చాం."

'స్త్రీశక్తి' ఫలితాలను చూస్తున్నాం..

"స్త్రీశక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఇక్కడ ఒక మహిళ టీస్టాల్ పెట్టుకొని జీవిస్తోంది. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. గతంలో కుమార్తెల వద్దకు వెళ్లాంటే ప్రయాణ ఖర్చులు భయపెట్టేవి. ఇప్పుడు ఉచిత బస్సులో నెలకోమారు ఆమె తన ఇద్దరు కుమార్తెలను చూసుకుని వస్తోంది. ఇది పేదలకు ప్రభుత్వం ఇచ్చిన వరం. దీపం-2 కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు కేంద్రంతో కలిసి అందిస్తున్నాం."

ఘనంగా సత్యసాయి బాబా ఉత్సవాలు

"పుట్టపర్తి సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 23వ తేదీదాకా ఘనంగా నిర్వహిస్తాం. దీనికోసం మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేశ్, సత్యకుమార్‌తో కమిటీ వేశాం. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సమ్మిట్ నిర్వహిస్తున్నాం. ఏపీకి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు ఇప్పటికే తెచ్చాం. కర్నూలు బస్సు దహనం నేపథ్యంలో వాహనాల నేషనల్ పర్మిట్లపై కేంద్రానికి లేఖరాస్తాను. నిబంధనల మేరకు వాటిని జారీ చేయకపోతే ప్రయాణికుల భద్రత ప్రమాదంలో పడుతుంది."

వాళ్లది రక్తపాతం..

మాది జలపాతం

(మొదటి పేజీ తరువాయి)

కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో శనివారం నిర్వహించిన ప్రజావేదికకు చంద్రబాబు హాజరయ్యారు. ముందుగా మేడా రెడ్డెమ్మ ఇంటికి వెళ్లి, ఆమెకు వితంతు పింఛన్‌ను ఆయన పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన మేడా మల్లయ్యకు వృద్ధాప్య పింఛన్ అందించారు. వారి కుటుంబాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..



శ్రీసత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో నిర్వహించిన ప్రజా వేదికకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

పేదల పెన్నిధి.. పీ-4

"నేను ఏ కార్యక్రమాన్నైనా వాయిదా వేస్తానుగానీ, ఒకటో తేదీన పేదలకు పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని మాత్రం ఆపబోను. ఏడాదికి పింఛన్ల కోసం రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం పింఛన్ల కోసమే రూ.50,764 కోట్లు వెచ్చించాం. ఇది దేశంలోనే ఒక రికార్డు. ఇందులో 59 శాతం మంది మహిళలు ఉండగా, వారికి రూ.29,951 కోట్ల విలువైన పింఛన్లు అందించాం. రాష్ట్ర జనాభా 4.93 కోట్లలో 13 శాతం మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఇది పేదల ప్రభుత్వమని, పేదల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని చెప్పేందుకు ఇదే నిదర్శనం. పీ-4 ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాం.."

ముందు కంటే మెరుగ్గా సేవలు..

"రాష్ట్రాన్ని పునర్నిర్మించి, పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. నిద్ర లేచినప్పటినుంచీ నేను ప్రజలగురించే ఆలోచిస్తా. అభివృద్ధి చేస్తేనే సంక్షేమ కార్యక్రమాల అమలుకు డబ్బులు వస్తాయి. సుపరిపాలన చేస్తేనే మనకొచ్చే ఆదాయం పెరుగుతుంది. అప్పుడే సంక్షేమ పథకాలను సజావుగా ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. 'ముందు కంటే ఇప్పుడు మెరుగ్గా పింఛన్లు వస్తున్నాయా..? లేదా..?' (ఈ ప్రశ్న సీఎం వేసినప్పుడు..వస్తున్నాయని ప్రజలు బదులిచ్చారు) ఎక్కడ పింఛన్ ఇచ్చారు...ఏ టైమ్‌లో ఇచ్చారనేది నేరుగా కంప్యూటర్‌లో వస్తుంది. అదేరోజు సాయంత్రం ఐవీఆర్ మెసేజ్ కూడా పంపిస్తున్నాం."

ఫ్రీ బస్సులో వెళుతున్నారా..

"నా భర్త గంగయ్య కరోనాలో చనిపోయాడు. అప్పటినుంచి టీకొట్టు పెట్టుకుని బతుకుతున్న నా ఇంటికి ముఖ్యమంత్రి వచ్చి పింఛను అందించడం సంతోషంగా ఉంది. మాకుటుంబం పరిస్థితిని అడిగారు. ఫ్రీబస్సులో వెళుతున్నారా అని ఆరా తీశారు. పెళ్లిళ్లు అయి ఎక్కడో ఉంటున్న కూతుళ్లను చూడటానికి ఫ్రీ బస్సులోనే వెళతున్నానని,వాళ్లూ వస్తున్నారని చెప్పాను. ఉచిత సిలిండర్లు అందాయని తెలిపాను."

- మేడా రెడ్డెమ్మ, పెద్దన్నవారిపల్లి

ఒక్క చెరువూ తెగలేదు..

"ఈ ఏడాది భారీవర్షాలు కురిసినా, ఒక్క చెరువు కూడా తెగలేదు. కానీ, గత ఐదేళ్లలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. గుండ్లకమ్మలో గేట్లు పని చేయలేదు. పులిచింతలలో గేట్లకు కందెన వేయలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు 95 శాతం రిజర్వాయర్లు జలాలతో కళకళలాడుతున్నాయి. రాయలసీమను రతనాల సీమ చేస్తానని ఆరోజే చెప్పా. అదే పట్టుదలతో ముందుకు వెళుతున్నా. మన పెద్దవాళ్లు దేవాలయాలను కట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆధునిక దేవాలయాలకు ప్రాధాన్యమిస్తూ నీటి వ్యవస్థలపై దృష్టి సారించింది. రాయలసీమకు నీళ్లు ఇవ్వవచ్చునని మొట్టమొదట ఆలోచించిన నేత ఎన్టీఆర్. ఆయన ఆలోచనలను అమలు చేస్తున్నాం. హంద్రీనీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తున్నాయి. ఒక వ్యక్తి 'నా రాయలసీమ' అంటాడు. కానీ, గత ఐదేళ్లలో సొంత నియోజకవర్గం పులివెందులకు ఆయన నీళ్లు ఇవ్వలేకపోయారు. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుకు నీళ్లు ఇచ్చాం. వారిది గొడ్డలిపోటు...పులివెందులో రక్తపాతం. మనది హంద్రీనీవా..పులివెందుకు జలపాతం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి వద్ద స్పేస్ సిటీ ఏర్పాటుచేస్తున్నాం. రాయలసీమకు రానున్న కాలంలో పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. నేను ఎన్నడూ రాగద్వేషాలతో పరిపాలన చేయను. అయితే, ప్రజలకు హాని కలిగిస్తే మాత్రం ఎలాంటి వ్యక్తినైనా ఢీకొడతాను. ముఠా నాయకులను రాయలసీమలో అణిచివేశాం. హైదరాబాద్‌లో మతవిద్వేషాలను, తీవ్రవాదాన్ని పూర్తిగా నియంత్రించాం. అందుకే నాపై అలిపిరిలో క్లైమోర్ మైన్స్ పేల్చారు. వివేకానంద రెడ్డి హత్య విషయంలో నిందను అప్పట్లో సీఎంగా ఉన్న నాపై వైసీపీ నేతలు వేశారు. వైసీపీ.. ఒక ఫేక్ పార్టీ. వాళ్ల జీవితమే ఫేక్. తుఫాను నా వల్లనే వచ్చిందట! ఇంతకుమించిన ఫేక్ ప్రచారం ఉంటుందా? కర్నూలులో బస్సు ప్రమాదం జరిగితే ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారు. మరో ఘటనలో కమ్మ, కాపుల మధ్య కుల విద్వేషాలు రగిల్చేలా ఫేక్ ప్రచారం చేశారు. వైసీపీకి ఓ కరపత్రం ఉంది. ఓ చానల్ కూడా ఉంది. కానీ ఆ వ్యక్తి(జగన్) బయటకొచ్చి 'మాకు చానల్ లేదు.. పేప ర్ లేదు' అంటూ ఫేక్ ప్రచారం చేస్తుంటాడు. తప్పు చేసినవాళ్లు శిక్ష అనుభవించక తప్పదు. చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో కోర్టు ఉరిశిక్ష విధించడమే దీనికి రుజువు." అని చంద్రబాబు హెచ్చరించారు.


రెడ్డమ్మ ఇంట్లో దోశలు వేస్తున్న సీఎం



హార్మోని వాయించు మల్లయ్యా..
అడిగి మరీ సంగీతాన్ని ఆస్వాదించిన సీఎం

పెద్దన్నవారిపల్లిలో వాయిద్య కళాకారుడు మేడా మల్లయ్య ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. ఆయనకు పింఛన్ అందజేశారు. తాను వాయిద్య కళాకారుణ్ణని మల్లయ్య చెప్పడంతో. తనకోసం హార్మోనియం వాయించాలని ముఖ్యమంత్రి కోరారు. మల్లయ్య వాయించి వినిపించారు. ఆయన ఆర్థికపరిస్థితిని ఆరాతీస్తూ.. 'మీ వృత్తి ఎలా ఉంది?' అని సీఎం ప్రశ్నించారు. గతంలో ఆదరణ ఉండేదని,ఇప్పుడు పనులు లేక ఇబ్బంది పడుతున్నామని మల్లయ్య తెలిపారు.

'మిట్టల్ స్టీల్'కు లైన్ క్లియర్!

(మొదటి పేజీ తరువాయి)

ఉండేది. ఇప్పుడు ఉక్కు పరిశ్రమ పేరెత్తితే అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని ఆర్సెలార్-నిప్పన్ స్టీల్స్ గుర్తుకు రానుంది. ఇప్పటికే ఉత్తరాంధ్రలోని ప్రధాన నగరం విశాఖ కేంద్రంగా ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగం గుర్తుకు వస్తోంది. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలన్నీ ఇప్పటికే వరుసలో నిలబడ్డాయి. తాజాగా లక్షన్నర కోట్ల పెట్టుబడితో దిగ్గజ ఉక్కు పరిశ్రమ కూడా జత కలిసింది.

లోకేశ్ ప్రకటన నిజం చేస్తూ..

గత నెల 14వ తేదీన ఢిల్లీ వేదికగా రూ.1,33,000 కోట్ల పెట్టుబడితో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ స్థాపనపై కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పంద సమయంలోనే, రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య ప్రకంపనలు ప్రారంభమయ్యాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. నవంబరు నెలలో వరుసగా ప్రపంచస్థాయి సంస్థలతో ఒప్పందాలు, శంకుస్థాపనలు ఉంటాయంటూ లోకేశ్ వెల్లడించారు. ఈ మాటలు నిజం చేస్తూ ఈ నెల తొలిరోజునే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్స్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం గమనార్హం.

గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్.. భారీగా ఉద్యోగాలు..

రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించే ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రధాన అవరోధం తొలగిపోవడంతో ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు సందర్భంగా తొలిరోజే (14న) భూమి పూజ నిర్వహించేందుకు ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్ సన్నద్ధమైంది. గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా పరిశ్రమను నిర్మించనున్నారు. ప్రారంభంలో ఏటా 8.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తిని ప్రారంభించి, చివరికి ఏటా 24 మిలియన్ టన్నుల సామర్థ్యానికి కార్మాగారం చేరుకుంటుంది. ఈ ప్లాంట్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం వల్ల పర్యావరణానికి హాని చేకూర్చే దుమ్మూ ధూళి ప్రభావం చాలా స్వల్పంగా ఉంటుందని చెబుతున్నారు. కార్మాగారం చుట్టూ వేలాది ఎకరాల్లో చెట్లను పెంచుతారు. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే, రాష్ట్ర ఇండస్ట్రియల్ కారిడార్‌లో మిట్టల్ ప్రత్యేకంగా నిలుస్తుంది. అనుబంధంగా ఉక్కు ఆధారిత అవుట్‌పుట్ పరిశ్రమలూ రానున్నాయి.

ప్రధాని మోదీ చొరవ.. గనుల కేటాయింపు

గత ఏడాది ఆగస్టులో మంత్రి నారా లోకేశ్ అర్సెలర్ మిట్టల్‌తో సంప్రదింపులు ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు ఆర్సెలార్ మిట్టల్ సంసిద్ధతను వ్యక్తం చేసింది. పరిశ్రమ సజావుగా నడిచేందుకు, నష్టాల్లోకి వెళ్లకుండా ఉండేందుకు తమకు ప్రత్యేకంగా ఖనిజ నిక్షేపాలు కావాలని ఆర్సెలార్ మిట్టల్ స్పష్టం చేసింది.ఈ డిమాండ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి మంత్రి లోకేశ్ తీసుకువెళ్లారు. ఆర్సెలార్ ప్రతిపాదనలను ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు వివరించారు. వెంటనే స్పందించిన ప్రధాని మోదీ కేంద్ర గనుల మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడారు. మిట్టల్‌కు ప్రత్యేకంగా ముడి సరుకు లభించేలా గనులను కేటాయించారు. దీంతో ఆ సంస్థ రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు ముందుకొచ్చింది.

కలిసి పనిచేసి కష్టాన్ని ఎదుర్కొన్నాం!

- అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు అద్భుతం
- తుఫాను ఫైటర్లందరికీ ధన్యవాదాలు: సీఎం చంద్రబాబు
- 137 మందికి మెమొంటోలు, ధ్రువపత్రాల అందజేత

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును టీం స్పిరిట్‌తో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఇకపైనా అదే స్ఫూర్తి కొనసాగించాలని మొంథా తుఫాను ఫైటర్ల అభినందన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అన్నారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో తుఫాను సమయంలో విశేషసేవలు అందించిన 137 మందికి మెమొంటోలు, సర్టిఫికెట్లను సీఎం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ప్రతి సంక్షోభం మనకు ఒక అవకాశం. ఈసారి తుఫాను నష్టాన్ని తగ్గించగలిగిన రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ప్రజలందరి తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని సీఎం అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అద్భుతంగా పనిచేశారని కితాబునిచ్చారు. ఇంకా చంద్రబాబు ఏమన్నారంటే...

సాంకేతిక సాయంతో అధిగమించాం

రాష్ట్రానికి రెండు సమస్యలు ఉన్నాయి. ఒకటి రాయలసీమకు కరువు, రెండోది కోస్తాంధ్రకు తుఫాన్లు. సమర్థ నీటి నిర్వహణతో, ప్రాజెక్టుల నిర్మాణంతో ఈ రోజు రాయలసీమలో కరువు లేకుండా చేశాం. గతంలో హరికేన్ వచ్చింది. ఉభయగోదావరి జిల్లాల్లో అప్పుడు వారం నుంచి 10 రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగాం. ఈసారి మొంథా తుఫాను ఎదుర్కొనేందుకు ప్రతిభ కనబరిచే అధికారులతో ఓ బృందాన్ని సిద్ధం చేశాం. వారంతా అద్భుతంగా పనిచేశారు. వీలైనంత వరకు ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూశాం.

ముందు జాగ్రత్తతో తప్పిన వరద నష్టం

డ్రోన్ల ద్వారా తుఫానులో చిక్కుకున్న వారి ప్రాణాలు కూడా కాపాడాం. పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని, ఓ ప్రార్థనా మందిరంలో చిక్కుకున్న 15 మందిని కూడా కాపాడగలిగాం. అంతా కలిసి చేసిన సమష్టి కృషితో ఇది సాధ్యమైంది. 602 డ్రోన్లను ముందస్తుగానే సిద్ధం చేసుకున్నాం. ముందస్తు జాగ్రత్తగా కాల్వల పూడికలు, అడ్డంకులు తొలగించాం. అందుకే భారీ వర్షాలు కురిసినా నీరు అంతా కిందికి సులువుగా ప్రవహించింది. తద్వారా వరద ముప్పు తగ్గింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు క్షేత్రస్థాయిలో అందరినీ అప్రమత్తం చేసి రక్షణగా నిలిచారు. సీఎస్ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అంతా కలిసి ప్రజలను కాపాడటంలో సఫలీకృతులయ్యారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు అంతా బాగా పనిచేశారు. బాగా పనిచేసిన వారిని గుర్తించి అందరికీ స్ఫూర్తిని చాటాలనే ఈ కార్యక్రమం నిర్వహించాం. ప్రజలు కూడా ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. వారి సహకారం కూడా ప్రభుత్వానికి అవసరం.


సీఎం చంద్రబాబుతో మొంథా ఫైటర్స్ పురస్కారాలు అందుకున్న అధికారులు

త్వరలో గ్రామస్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ

గతంలో ఏఅంశం చెప్పాలన్నా గ్రామాల్లో టాంటాం వేయాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్టీజీఎస్ ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మైకుల ద్వారా హెచ్చరికలు పంపామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో రాజధాని నుంచే గ్రామస్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సీఎస్ విజయానంద్, మంత్రులు అనిత, దుర్గేశ్, వాసంశెట్టి సుభాశ్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ వేడుకలు

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ బోర్డు మెంబర్ ఏవీరమణ, టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ రాజశేఖర్, నేతలు పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏడాది సర్వీసున్నా పదోన్నతి

- పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు
- 474మందికి లబ్ధి

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులకు సర్వీసు కాలం రెండేళ్ల నుంచి ఏడాదికి మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పదేళ్లపాటు పదోన్నతులకు నోచుకోని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పుడు ఏడాదిలోనే రెండు పదోన్నతులు పొందే అవకాశం దక్కింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పంచాయతీరాజ్ ఉద్యోగులకు స్వర్ణయుగంగా మారింది. డీఎల్‌డీల నుంచి కిందిస్థాయి పంచాయతీ కార్యదర్శుల వరకు అన్ని కేడర్లకూ పదోన్నతులు కల్పించడం ద్వారా రాష్ట్రంలో సుమారు 10 వేల మందికి పదోన్నతులు లభిస్తున్నాయి. ఇప్పటికే గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థ జిల్లా, మండల స్థాయిలో మానిటరింగ్ వ్యవస్థ తీసుకురావడంతో 660 మంది గ్రామ, వార్డ్ సచివాలయ అధికారులను నియమించాల్సి వచ్చింది. పంచాయతీరాజ్‌లోని డిప్యూటీ ఎంపీడీవో కేటగిరీకి చెందిన అధికారులను ఆ స్థానాల్లో నియమించాల్సి రావడంతో పంచాయతీరాజ్‌శాఖలో గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాల్సి వచ్చింది. దీంతో రెండేళ్ల సర్వీసును ఏడాదికి కుదించి.. వారికి ఏడాది నిండినా, పదోన్నతి కల్పించేందుకు సర్వీసు రూల్స్‌ను సవరించారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 474 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించనుంది. గ్రేడ్-1 కార్యదర్శులు 90 మంది, గ్రేడ్-2.. 43 మంది, గ్రేడ్-3.. 131 మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 200 మంది, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లు 10 మందికి ఈ సర్వీసు మినహాయింపు లభించనుంది.

కొలికపూడి, కేశినేని చిన్నికి పిలుపు

- 4న హాజరు కావాలన్న టీడీపీ క్రమశిక్షణ కమిటీ




అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌కు టీడీపీ క్రమశిక్షణ కమిటీ నుంచి పిలుపువచ్చింది. ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు క్రమశిక్షణ కమిటీ ముందు హాజరు కావాలని కొలికపూడి శ్రీనివాస్‌కు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పిలుపు వెళ్లింది. అదేరోజు సాయంత్రం 4 గంటలకు తమ ముందు హాజరు కావాలని కేశినేని చిన్నికి క్రమశిక్షణ కమిటీ సమాచారం పంపింది. ఇద్దరి మధ్య విభేదాల నేపథ్యంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈనిర్ణయం తీసుకున్నారు. క్రమశిక్షణ కమిటీలో మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, షరీఫ్, కొనకళ్ల నారాయణ ఉన్నారు.





తొక్కిసలాటలో కిందపడిపోయిన మహిళల, బంధువుల రోదనలు, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం, తొక్కిసలాట అనంతరం ఆలయంలో విరిగిపోయిన రెయిలింగ్, చెల్లాచెదురైన పూజాసామగ్రి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన ఎమ్మెల్యే శిరీష, , కేంద్ర మంత్రి రామ్మోహన్, హోంమంత్రి అనిత

అయ్యో... దేవుడా!



తొక్కిసలాటలో గాయపడిన మహిళకు సపర్యలు చేస్తున్న దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

'చిన్న తిరుపతి'గా పిలుస్తారు. ప్రైవేటు నిర్వహణలో ఉన్న ఈ గుడికి ప్రతి శనివారం, సోమవారం 2వేల నుంచి 5వేల మంది భక్తులు వస్తుంటారు. కార్తీక మాసం కావడంతో ఈ సంఖ్య మరింత పెరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, కార్లలో 25వేల మంది దాకా తరలి వచ్చారు. ఇంత రద్దీని ఊహించని ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయలేదు. వలంటీర్లను నియమించుకోలేదు. పోలీసులు, అధికారులూ దృష్టి సారించలేదు. ఇదే పెను విషాదానికి కారణమైంది.

పది నిమిషాల్లోనే..

పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ నెలకొంది. 10 నుంచి 12 మెట్లు ఎక్కి మొదటి అంతస్తులోకి వెళితే గర్భగుడి వస్తుంది. పైకి వెళ్లేందుకు... దర్శనం తర్వాత కిందికి వచ్చేందుకు ఇదే మార్గం! 'క్యూ' కోసం మధ్యలో స్టీల్ బారికేడ్ పెట్టారు. మధ్యాహ్నం 12.05 గంటల సమయంలో ఈ మెట్ల మార్గంలోనే తొక్కిసలాట మొదలైంది. దర్శనం చేసుకుని వచ్చే వరుసలోకి... ఇటువైపు నుంచి జనాలు చొచ్చుకుపోయారు. దీంతో... పరిస్థితి అదుపు తప్పి, తోపులాట మొదలైంది. క్యూలో ఉన్న వారు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. బయటపడే ప్రయత్నంలో తోపులాట మరింత పెరిగింది. కొందరి కాళ్లు స్టీల్ బారికేడ్లలో ఇరుక్కుపోవడంతో గట్టిగా కేకలు వేస్తూ, రోదించారు. దీంతో ఏదో జరుగుతోందని భావించి బయటికి వచ్చేందుకు బలంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో స్టీల్ రెయిలింగ్ విరిగిపోయింది. జనం ఒకరిపై ఒకరు పడిపోయారు. కిందపడిన వారిని తొక్కుకుంటూ చాలామంది బయటికి వచ్చారు. అంతా తీవ్ర గందరగోళం, కేకలు, అరుపులు! ఏం జరిగిందో తెలుసుకునేలోపే.. నిండుప్రాణాలు బలైపోయాయి. ఇదంతా 10నిమిషాల్లోనే జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "వెనుక నుంచి ఒక్క ఉదుటన నెట్టినట్లయింది. వెనుదిరిగి చూసుకునేలోపే కిందపడిపోయాం. కళ్ల ఎదుటే చాలామంది చనిపోయారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు పలాస, టెక్కలి, మందస లోని ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న బాకి కళావతి (50), దువ్వు కుమారి(25)లను శ్రీకాకుళం మండలం జెమ్స్ ఆసుపత్రి ఐసీయూలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. శనివారం సుమారు 25వేల మంది భక్తులు రాగా.. వారిలో అత్యధికులు మహిళలే. పూర్తిగా ప్రైవేటు ఆలయం కావడంతో అధికార యంత్రాంగం ముందస్తుగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. బందోబస్తు కోసం ఆలయ నిర్వాహకుల నుంచీ ఎలాంటి అభ్యర్థనా అందలేదు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు లేవు. తొక్కిసలాట ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ఘటనా స్థలంలో మృతదేహాలు

పరామర్శించిన మంత్రులు

ఘటన గురించి తెలియగానే మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పలాసలో ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. దేవాలయాన్ని నిర్మించిన ప్రైవేటు ట్రస్టు యజమాని హరిముకుంద పండాతో మాట్లాడారు. దేవాలయంలో వేలాది మంది భక్తులు వస్తుంటే రక్షణ పెట్టుకోకుంటే ఎట్లా అని ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ అమరావతి నుంచి హుటాహుటిన కాశీబుగ్గ చేరుకున్నారు. హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి పరిస్థితి సమీక్షించారు. ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా అక్కడికి చేరుకున్నారు. తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. ఆలయం పూర్తిగా ప్రైవేటుకు చెందినదని.. ఈ ఘటనపై త్రిసభ్య కమిటీ నియమించి విచారణ నిర్వహిస్తామని వెల్లడించారు. డీఐజీ గోపీనాథ్ జట్టి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి తదితర అధికారులూ లోకేశ్ వెంట ఉన్నారు.

మృతులు వీరే..

1. చిన్నమ్మి(50), రామేశ్వరం, టెక్కలి మండలం
2. రాపాక విజయ(48), పిట్టలసరి, టెక్కలి మండలం
3. మురిపింటి నీలమ్మ(60), దుక్కవానిపేటన, వజ్రపుకొత్తూరు మండలం
4. దువ్వు రాజేశ్వరి(60), బెల్లుపటియా, మందస మండలం
5. చిన్ని యశోదమ్మ(56), శివరాంపురం, నందిగాం మండలం
6. రూపా (33), గుడ్డిభద్ర, మందస మండలం
7. డొక్కర అమ్ముడమ్మ(40), పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ
8. బోర బృందావతి(62), మందస
9. లొట్ల నిఖిల్(13), బెంకిలి, సోంపేట మండలం

విషాదం... తీవ్రమైన విషయం: చంద్రబాబు

కాశీబుగ్గలో ఆలయంలో తొక్కిసలాటపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అంశాన్నిప్రస్తావించారు. "కాశీబుగ్గలో ఒక ప్రైవేటు వ్యక్తి వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించారు. కార్తీక మాసం సందర్భంగా చాలా మంది దర్శనానికి వెళ్లారు. పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే బందోబస్తు పెట్టేవాళ్లం. తొక్కిసలాటలో అమాయకులు చనిపోయారు. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశిస్తున్నా. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో జరగడానికి వీలులేదు. తొక్కిసలాటలో చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని తెలిపారు.



కాశీబుగ్గ తొక్కిసలాట మృతులకు నివాళిగా శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో మౌనం పాటిస్తున్న సీఎం చంద్రాబాబు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత తదితరులు

మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు

కేంద్రం నుంచి మరో 2 లక్షలు

- క్షతగాత్రులకు రూ.3.5 లక్షలు: మంత్రి లోకేశ్
- కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి
- నిర్మాణ లోపాలు.. నిర్వాహకుల వైఫల్యమే కారణమని వెల్లడి

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం హుటాహుటిన పలాస ఆస్పత్రికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు సహాయాన్ని ప్రకటించారు. మృతి చెందిన 9 మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15లక్షలు, కేంద్రప్రభుత్వం రూ. 2లక్షలు కలిపి మొత్తం రూ.17 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారికి రాష్ట్రం నుంచి రూ.3లక్షలు, కేంద్రం నుంచి రూ.50వేలు కలిపి మొత్తం రూ.3.5 లక్షలు ఇస్తామన్నారు. మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద తక్షణ సహాయంగా రూ.10వేల పరిహారం లభిస్తుందన్నారు. మృతుల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉన్న ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరపున బీమా కింద ఒక్కొక్కరికి అదనంగా రూ.5లక్షల చొప్పున సాయం అందుతుందని మంత్రి వెల్లడించారు.

లోపాలపై పూర్తిస్థాయిలో విచారణ..

తొక్కిసలాట 17 మంది క్షతగాత్రులు కాగా, వారిలో ముగ్గురు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారని లోకేశ్ తెలిపారు. ఆలయం నిర్మించి నాలుగేళ్లు అవుతున్నప్పటికీ ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని నిర్వాహకులు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్నారు. దశలవారీగా గుడి నిర్మాణం జరిగిందని, నిర్మాణంలో లోపాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

తొక్కిసలాట కలచివేసింది: పవన్ కల్యాణ్



అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసిందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'కార్తిక ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాట మూలంగా తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. ఈ విషాదకర ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుంది. ఆలయాల్లో క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవదాయ శాఖ అధికారులకు సూచిస్తున్నాం. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలి' అని పవన్ పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి పరామర్శించి ఓదార్చాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు.

తొక్కిసలాట ఘటనపై నేతల దిగ్భ్రాంతి

- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల విచారం
- మృతుల కుటుంబాలకు 2 లక్షలు, గాయపడినవారికి 50 వేలు
- భోపాల్ పర్యటన రద్దు చేసుకొని ఏపీకి కేంద్ర మంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడంపై పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, జ్యోతిరాదిత్య సింధియా, రామ్మోహన్‌నాయుడు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ వేదికగా తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడినవారికి రూ.50 వేలను ప్రధాని కార్యాలయం ప్రకటించింది. కాగా, తొక్కిసలాట ఘటన గురించి తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తన భోపాల్ పర్యటనను రద్దు చేసుకొని రాష్ట్రానికి బయలుదేరి వెళ్లారు. క్షతగాత్రులకు తగిన వైద్య సదుపాయాన్ని అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వానిదే తప్పు: వైసీపీ

తొక్కిసలాట జరిగింది ప్రైవేటు నిర్వహణలోని ఆలయమైనప్పటికీ... వైసీపీ మాత్రం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని... పోలీసుల అసమర్థత అంటూ వైసీపీకి చెందిన మాజీమంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలివ్వాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

10 కోట్లతో గుడి నిర్మాణం..

- ఏడాదిన్నర కిందటే పూర్తి
- సోషల్ మీడియాలో ప్రాచుర్యం

పలాస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆయనకు దైవభక్తి మెండు! దాతృత్వమూ ఎక్కువే! ఒక్కరూపాయి విరాళాలు సేకరించకుండా రూ.10 కోట్లతో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆయనే... హరి ముకుంద పండా! శనివారం కాశీబుగ్గలో విషాదం చోటు చేసుకుంది ఆయన నిర్మించిన ఆలయంలోనే! కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వ్యాపారి, రైతు హరి ముకుంద పండాకు చిన్నతనం నుంచే దైవభక్తి ఎక్కువ. ఆయన వయసు 95 సంవత్సరాలు. శ్రీదుర్గా కళామందిర్‌ను నెలకొల్పి సినీ ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. స్థానిక చిన్నకలియాపండా నగర్‌లో దుర్గాదేవి ప్రధాన ఆలయంతోపాటు ఇతర ఉప ఆలయాలను నిర్మించారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో మరో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 'నేను నిత్యం ఆరాధించే దుర్గాదేవి కలలోకి వచ్చి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని ఆదేశించారు' అని చెప్పి 12.22 ఎకరాల్లో ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి ఐదేళ్లకుపైగా పట్టింది. సుమారు రూ.10కోట్ల వరకూ వెచ్చించారు. ఇందులో శ్రీదేవి, భూదేవి సహిత విగ్రహాలతో పాటు మహాభారత, రామాయణ ఘట్టాలను తెలిపే వివిధ శిల్పాలను ఏర్పాటు చేశారు. వివిధ దేవతా విగ్రహాలను రాజస్థాన్, తిరుపతి నుంచి తీసుకుకొచ్చి ప్రతిష్ఠించారు. గతేడాది జూలైలో ఆలయాన్ని ప్రారంభించారు. స్థానికులు దీనిని 'చిన్న తిరుపతి'గా పిలుచుకుంటున్నారు. సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరడంతో జనం రాక కూడా పెరిగింది.

ఊహించలేక పోయాం: పండా



పలాస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంత విషాదం జరుగుతుందని తాము ఊహించలేకపోయామని కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు హరిముకుంద పండా తెలిపారు. తొక్కిసలాట ఘటన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సోమ, శనివారాల్లో భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్తీక ఏకాదశి కావడంతో ఊహించిన దానికన్నా అధిక సంఖ్యలో భక్తులు వచ్చారన్నారు. క్యూ లైన్లు ఏర్పాటు చేసినా భక్తులు ఒక్కసారిగా లైన్ల నుంచి జారిపడడంతో దుర్ఘటన జరిగిందని, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని చెప్పారు. పోలీసులకు తాము సమాచారం ఇచ్చినా వాహనాల రాకపోకలు నియంత్రించారుగానీ ఆలయం లోపలకు రాలేదన్నారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష కన్నీరు



పలాస, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాటలో చనిపోయినవారి మృతదేహాలను చూసి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చలించిపోయారు. క్షతగాత్రులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు విని ఆమె కూడా కన్నీటిపర్యంతమయ్యారు. నోట మాట రాక... కొద్దిసేపు అక్కడే కూర్చుండిపోయారు.

భక్తులకు భద్రతేదీ..!

ఆలయాల్లో రద్దీ నిర్వహణ లోపభూయిష్టం.. క్యూలైన్లలో తోపులాటలు, తొక్కిసలాటలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని ఆలయాల్లో భక్తులకు భద్రత కరువైంది. ఏడాది వ్యవధిలోనే వేర్వేరు ఆలయాల్లో జరిగిన ఘటనల్లో పదుల సంఖ్యలో భక్తులు మరణించారు. రద్దీని నియంత్రించడంలో అధికారుల వైఫల్యమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పండుగలు, పర్వదినాల సమయంలో ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. నాలుగైదేళ్లుగా ఈ ధోరణి మరింత ఎక్కువైంది. అయితే దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో సైతం రద్దీకి అనుగుణంగా పటిష్ఠ ఏర్పాట్లు చేయడం లో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో క్యూలైన్లలో, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో తోపులాటలు, తొక్కిసలాటలు సర్వసాధారణంగా మారాయి. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో చాలావరకూ వందల ఏళ్ల క్రితం నిర్మించినవి. ఆనాటి కాలంలో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఆధారంగా ఆలయ ప్రాకారాలు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో దేవుడి దర్శనానికి అధిక సమయం పడుతోంది. తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి సగటున 14 నుంచి 18 గంటలు పడుతున్నా భక్తుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. మిగిలిన ప్రధాన దేవాలయాల్లో దర్శనానికి అంత సమయం పట్టకపోయినప్పటికీ రద్దీ విషయంలో దాదాపుగా ఒకేరకమైన పరిస్థితి నెలకొంది. కానీ పురాతన ఆలయ ప్రాకారాలు, క్యూలైన్ల విస్తరణ, ఇతర ఏర్పాట్లలో అధికారులు ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో ప్రముఖ ఆలయాల్లో తోపులాటలు, తొక్కిసలాటలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా వైదిక సంఘాల సలహాలు, సూచనల మేరకు ఆలయాల్లో క్యూలైన్ల విస్తరణకు ప్రభుత్వం, దేవదాయశాఖ సత్వర చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఆలయంలో తొక్కిసలాట జరిగిన ప్రాంతం

శాఖల మధ్య సమన్వయ లోపం

ప్రముఖ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలు, స్వామివార్ల కల్యాణాలు, పండుగల సమయంలో శాఖల మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ ఏడాది నిర్వహించిన దసరా నవరాత్రి ఉత్సవాల్లో దేవదాయ శాఖ అధికారులు, పోలీసు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రొటోకాల్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కాశీబుగ్గ ఆలయానికి శనివారం దాదాపు 25వేల మంది భక్తులు తరలివస్తే పోలీసులు కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. పైగా తమవద్ద నుంచి అనుమతి తీసుకోలేదంటూ ఆలయ నిర్వాహకులపైకి నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థాయిలో భక్తులు వస్తారని తాము ఊహించలేదని నిర్వాహకులు వాదిస్తున్నారు. ప్రతి ఘటనలోనూ ఇదే విధమైన సమన్వయ లోపం కనిపిస్తుంది. ఎవరికి వారే తమకు సంబంధం లేదంటూ భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రముఖ ఆలయాల్లో రద్దీ నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించడంతో పాటు ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలి.

భక్తుల సెంటిమెంట్‌తో ఆటలు

"ఇలాంటి పర్వదినం మళ్లీ రాదు... ఈ తిథి 60 ఏళ్లకు ఒకసారి మాత్రమే వస్తుంది... ఈ రోజే స్వామివారి దర్శనం చేసుకోవాలి" అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారి సంఖ్య బాగా పెరిగిపోయింది. తమ చానల్‌కు రేటింగ్‌లు, వ్యూస్ కోసం కొందరు చేస్తున్న హడావిడి తారస్థాయికి చేరింది. ఈ పోస్టులు చూసిన భక్తులు ఆలయాలకు పోటెత్తి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ప్రచారాలను ప్రభుత్వం కట్టడి చేయాలని పలువురు సూచిస్తున్నారు.

తిరుపతి, కుంభమేళా నుంచి కాశీబుగ్గ వరకూ...

- ఈ ఏడాది తొక్కిసలాట ఘటనలు... సుమారు 120 మంది మృతి
- పదుల సంఖ్యలో గాయపడ్డ ప్రజలు

అమరావతి, నవంబరు 1: ఈ ఏడాది ఆరంభంలో తిరుపతి, ఆ తరువాత కుంభమేళా దగ్గర నుంచి ఇప్పుడు కాశీబుగ్గ వరకూ ఏడు పెద్ద తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆయా దుర్ఘటనల్లో సుమారుగా మొత్తం 120 మంది వరకూ మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు.

జనవరి 8

తిరుమల వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం తిరుపతిలోని బైరాగి పట్టెడ వద్ద క్యూలైన్లలో భారీగా భక్తులు వేచి ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందగా... 20 మందికిపైగా గాయపడ్డారు.

జనవరి 29

ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. జనవరి 29న మౌని అమావస్య నాడు అమృతస్నానం ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. అప్పుడు జరిగిన ఘటనలో 30మంది మృతిచెందారు.

ఫిబ్రవరి 15

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఫిబ్రవరి 15న మరో దుర్ఘటన చోటు చేసుకుంది. మహా కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రయాగరాజ్ వెళ్లడానికి పెద్దసంఖ్యలో ప్రయాణికులు వేచి ఉన్నారు. రైలు వచ్చిందన్న సమాచారంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపైకి ఒక్కసారిగా కదిలారు. నాడు జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు పిల్లలతో సహా 18 మంది చనిపోయారు. సుమారుగా 12 మందికిపైగా గాయపడ్డారు.

ఏప్రిల్ 30

సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న ఏడుగురు భక్తులు భారీవర్షానికి గోడ కూలి పడటంతో దుర్మరణం పాలయ్యారు.

మే 3

ఉత్తర గోవాలోని షిర్గావ్ గ్రామంలో మరో ఘటన చోటు చేసుకుంది. మే 3న ఏటా జరిగే ఉత్సవం ఊరేగింపు నిమిత్తం భక్తులు పెద్ద ఎత్తున షిర్గావ్ ఆలయం వద్ద గుమిగూడారు. హఠాత్తుగా భయాందోళనలు చెలరేగి తోపులాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో కనీసం ఆరుగురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు.

జూన్ 4

పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత ఐపీఎల్ కప్పును ఆర్‌సీబీ గెలుచుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది దుర్మరణం పాలయ్యారు.

సెప్టెంబరు 27

తమిళనాడులోని కరూర్‌లో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. తమిళ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్... రాష్ట్రవ్యాప్త రాజకీయ పర్యటనలో భాగంగా వేలుసామిపురంలో సభ నిర్వహించారు. విజయ్ అభిమానులు భారీగా తరలివచ్చారు. ఇరుకు రహదారులు జనంతో కిక్కిరిశాయి. విజయ్ రాగానే ఒక్కసారిగా చోటుచేసుకున్న తోపులాటలో కనీసం 40 మంది వరకూ చనిపోయారు.

ఎగిరే కారును తెచ్చేస్తున్నా..

» ఈ ఏడాదిలోనే డెమో చూపిస్తా : ఎలాన్ మస్క్

న్యూఢిల్లీ, నవంబరు 1: ఎన్నో ఏళ్ల క్రితం రాజేంద్రప్రసాద్ హీరోగా నటించిన 'బామ్మ మాట బంగారు బాట'అనే సినిమా గుర్తుందా? ఆ సినిమాలో రకరకాల విన్యాసాలు చేస్తూ గాల్లోకి ఎగిరే సూపర్ కారు మన దగ్గర కూడా ఉంటే బాగుంటుందని అనుకుంటుంటారు. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే.. గాల్లో ఎగిరే అలాంటి ఓ సూపర్ కారును మార్కెట్‌లోకి తీసుకువస్తున్నానంటూ టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ప్రకటించారు. ది జో రోగన్ ఎక్స్‌పీరియన్స్ అనే పాడ్‌కాస్ట్‌లో ఎగిరే కారు విషయాన్ని ఆయన వెల్లడించారు. 2014 నుంచి ఎగిరే కార్ల గురించి మాట్లాడుతున్న మస్క్.. తాము అభివృద్ధి చేస్తున్న ఎగిరే కారు ప్రొటోటైప్‌ను ఈ ఏడాదిలోనే ప్రదర్శిస్తామని తాజా పాడ్‌కాస్ట్‌లో ప్రకటించారు. టెస్లా నుంచి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోడ్‌స్టర్ సెకండ్ జనరేషన్ స్పోర్ట్స్ కారు గురించి పాడ్‌కాస్టర్ రోగన్ ప్రశ్నించగా.. మస్క్ ఎగిరే కారు గురించి మాట్లాడారు. టెస్లా తీసుకొచ్చే ఎగిరే కారుకు రెక్కలు ఉంటాయా?, హెలికాప్టర్‌లా గాల్లోకి ఎగిరే వీటీఓఎల్(వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్) వాహనమా? అని రోగన్ ప్రశ్నించగా.. మస్క్ స్పష్టమైన సమాధానం చెప్పలేదు. కానీ, తమ ఆవిష్కరణ ఊహలకు అందని విధంగా ఉంటుందని, జేమ్స్‌బాండ్ సినిమాల్లో బాండ్ ఉపయోగించిన కార్లన్నింటినిలోని ఫీచర్లను ఒకచోటుకు చేరేస్తే ఎలా ఉంటుందో అంతకు మించి ఉంటుందని చెప్పారు. అయితే, ఈ ఎగిరే కారుకు మించిన ఎన్నో అద్భుత ఆవిష్కరణలను మస్క్ గతంలోనూ ప్రకటించారు. వాటిని ప్రపంచానికి పరిచయం చేయడాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ ఎగిరే కారును మస్క్ ఈ ఏడాదిలో చూపిస్తారో లేదో చూడాలి మరి.

కేరళకు మరో ఖ్యాతి

» అత్యంత పేదరికాన్ని రూపుమాపిన రాష్ట్రంగా రికార్డు

తిరువనంతపురం, నవంబరు 1: దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా నిలిచిన కేరళ మరో ఖ్యాతి దక్కించుకుంది. దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన మొట్టమొదటి రాష్ట్రంగా నిలిచింది. శనివారం కేరళ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ విషయాన్ని ప్రకటించారు. "దుర్భర పేదరికం లేని తొలి రాష్ట్రంగా కేరళను మార్చడంలో విజయం సాధించాం"అని విజయన్ పేర్కొన్నారు. పేదల కోసం 5,400కు పైగా ఇళ్లు మంజూరు చేశామని, ఇవి పూర్తి/నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. 5,522 ఇళ్లకు మరమ్మతులు చేయించామని, ఇళ్ల స్థలాలు లేని 2,713 మంది పేదలకు స్థలాలు కేటాయించామని వెల్లడించారు. 21,263 మందికి కొత్తగా రేషన్, ఆధార్ కార్డులు, పింఛన్ మంజూరు చేశామని తెలిపారు. కాగా విజయన్ ప్రకటనను కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ తప్పుపట్టింది. దుర్భర పేదరికాన్ని నిర్మూలించామన్న ప్రకటన 'పచ్చి మోసం' అని ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ విమర్శించారు. ఈ సమావేశాన్ని పూర్తిగా బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించారు.

కేరళలో మతపరంగా ఓబీసీ రిజర్వేషన్లు

» అభ్యంతరం తెలిపిన ఎన్‌సీబీసీ

న్యూఢిల్లీ, నవంబరు 1: కేరళలో ఓబీసీ కోటా కింద ముస్లింలు, క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించడంపై జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) అభ్యంతరం తెలిపింది. రాజకీయ ప్రయోజనం పొందడానికే మత ఆధారిత రిజర్వేషన్లు కల్పిస్తున్నారని ఆ కమిషన్ చైర్మన్ హన్స్ రాజ్ గంగారాం అహిర్ ఆరోపించారు. ఏ సర్వే ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చారో 15రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానమివ్వాలని ఆదేశించారు.

సాయుధ పోరాటం.. 'విఫల మార్గం'

» పరిస్థితులు మారాయి.. ప్రధాన స్రవంతిలో కలవండి

» మావోయిస్టులకు మల్లోజుల వీడియో సందేశం

గడ్చిరోలి, నవంబరు 1: మావోయిస్టులు ఆయుధాలను వీడి.. ప్రధాన స్రవంతిలో కలిసి పనిచేయాలని ఇటీవల పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ భూపతి ఓ వీడియో సందేశంలో కోరారు. ఎవరైనా ఆయుధాలను వీడాలని భావిస్తుంటే సంప్రదించాలంటూ తనది, లొంగిపోయిన మరో మావోయిస్టు నేత రూపేష్ ఫోన్ నంబర్లు ఇచ్చారు. సాయుధ పోరాటాన్ని 'విఫల మార్గం'గా పేర్కొన్న ఆయన... మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచిపెట్టాలన్నారు. పరిస్థితులు మారాయని, ప్రజల మధ్య ఉండి చట్ట పరిధిలో పనిచేయాలని కోరారు. తమ చర్యల వల్ల ప్రజల నుంచి దూరమైన విషయాన్ని వారు గుర్తించాలని సూచించారు. సాయుధ పోరాటాన్ని వీడడానికి సుముఖంగా లేని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మొండి వైఖరిని అవలంబిస్తోందని, మార్పులను గ్రహించడం లేదని విమర్శించారు. తాను, తనతో పాటు లొంగిపోయిన నక్సలైట్లను ద్రోహులంటూ విమర్శిస్తున్న వ్యక్తులు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని పేర్కొన్నారు. మేధావులు, ప్రజాస్వామ్య ప్రేమికులు, ముఖ్యంగా గిరిజనుల మేలు కోరేవారు తమ నిర్ణయాన్ని అర్థం చేసుకుని, మద్దతు ఇవ్వాలని కోరారు. గడ్చిరోలి పోలీసులు శనివారం పత్రికా ప్రకటనతో పాటు మల్లోజుల వీడియోను విడుదల చేశారు. ఆయన గత నెల 14న 60 మంది మావోయిస్టులతో, రూపేష్ అలియాస్ సతీష్ గత నెల 17న 200 మంది మావోయిస్టులతో కలిసి పోలీసులకు లొంగిపోయారు.

గంగలో స్నానం చేసి శాకాహారిగా మారా

» పాతికేళ్ల నాటి సంగతి గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి

వారాణసి, నవంబరు 1: గంగానదిలో స్నానమాచరించిన తాను మాంసాహారాన్ని పూర్తిగా వదిలేశానంటూ పాతికేళ్ల నాటి సంగతిని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మాంసాహారిగా ఉన్న తాను తొలిసారి కాశీ వచ్చి... గంగానదిలో స్నానం చేసి శాకాహారిగా మారానని తెలిపారు. ఆ తర్వాత తన జీవితంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. వారాణసిలో కొత్తగా నిర్మించిన ఒక సత్రాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి రాధాకృష్ణన్ శుక్రవారం ప్రారంభించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎందుకు నిషేధించాలి: హోసబలే

జబల్‌పూర్, నవంబరు 1: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)ను నిషేధించాలన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే తీవ్రంగా స్పందించారు. ప్రజలే ఆర్‌ఎస్‌ఎస్‌ను ఆమోదించారని, అలాంటప్పుడు దీనిని ఎందుకు నిషేధించాలని ప్రశ్నించారు. "దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజలే దీనిని ఆమోదించారు. అలాంటి సంస్థను నిషేధించాలంటే తగిన కారణం ఉండాలి. జాతి నిర్మాణానికి పాటుపడుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించి ఏం సాధిస్తారు?." అని ఖర్గేను ఉద్దేశించి హోసబలే ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్-1బీపై పరిమితులను పునఃపరిశీలించండి

» అధ్యక్షుడు ట్రంప్‌నకు అమెరికా చట్టసభ్యుల వినతి

» భారత్‌తో సంబంధాలపై ప్రభావం పడుతుందని ఆందోళన

న్యూయార్క్, నవంబరు 1: హెచ్-1బీ వీసాలపై విధించిన పరిమితులను పునఃపరిశీలించాలని అమెరికా చట్టసభ సభ్యులు అధ్యక్షుడు ట్రంప్‌ను కోరారు. ఈ నిర్ణయం అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు 19 మంది చట్టసభ సభ్యులు గత నెల 8న అధ్యక్షుడికి ఒక లేఖ రాశారు. వీసా ఖర్చులు భారీగా పెరగడం, సుంకాల విధింపు వంటి చర్యలు ఇరు దేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని అందులో పేర్కొన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ రంగాల్లో చైనా దూకుడు ప్రదర్శిస్తున్న సమయంలో ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించడాన్ని కొనసాగించాలని కోరారు. హెచ్-1బీ వీసాల్లో మెజారిటీ వాటా కలిగిన భారతీయులు అమెరికాలో అత్యంత విజయవంతమైన కంపెనీల్లో చాలావరకూ స్థాపించడం లేదా నాయకత్వం వహించారని గుర్తు చేశారు. వీరు అమెరికా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలోనూ దోహదపడుతున్నారని ఆ లేఖలో చట్టసభ సభ్యులు స్పష్టం చేశారు.

వాన్స్-ఉష బంధానికి బీటలు?

అమెరికాలో పెద్ద ఎత్తున ఊహాగానాలు.. ఉష క్రైస్తవంలోకి రావాలంటూ ఇటీవల జేడీ వాన్స్ వ్యాఖ్యలు

» అదే వేదికపై ఎరికాతో గాఢాలింగనం

» ఉషకు విడాకులిస్తారని విశ్లేషణలు

న్యూయార్క్, నవంబరు 1: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి, ఆంధ్రప్రదేశ్ మూలాలున్న చిలుకూరి ఉష మధ్య బంధం బీటలు వారుతోందా? దానికి సంకేతంగానే ఇటీవల వాన్స్.. తమ వేర్వేరు మత నేపథ్యాల గురించి బహిరంగంగా వ్యాఖ్యానించారా? ట్రంప్‌కు అత్యంత బలమైన మద్దతుదారుగా వ్యవహరించి ఈ మధ్య హత్యకు గురైన చార్లీకిర్క్ భార్య ఎరికా కిర్క్ ఇదే అదనుగా వాన్స్‌తో చెట్టాపట్టాలకు సిద్ధపడుతున్నారా? అమెరికాలో సోషల్ మీడియాలో ఇప్పుడే ఇదే అంశం జోరుగా షికారు చేస్తోంది. అక్టోబరు 29వ తేదీన మిసిసిపీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వాన్స్ వ్యాఖ్యలు, అదే వేదిక మీద వాన్స్, ఎరికా కిర్క్ గాఢ ఆలింగనం దృశ్యాలు, అనంతరం ఎరికా మాటలు.. ఈ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. ఆ కార్యక్రమంలో ఓ యాంకర్ అడిగిన ప్రశ్నకు జేడీ వాన్స్ సమాధానమిస్తూ.. దాదాపుగా ప్రతి ఆదివారం చర్చికి తనతోపాటు ఉష కూడా వస్తుందని, అయితే, తాను క్రైస్తవం పట్ల పూర్తి అంకితభావంతో ఉన్నట్లుగా.. ఆమె కూడా ఏదో రోజు క్రైస్తవంలోకి మారుతుందని ఆశిస్తున్నానన్నారు. అదే వేదిక మీద ఉన్న ఎరికా కిర్క్.. హత్యకు గురైన తన భర్తను గుర్తు చేసుకుంటూ.. ఆయన స్థానం ఎవరూ భర్తీ చేయలేరని అంటూనే.. ఆయనలో ఉన్న కొన్ని లక్షణాలు వాన్స్‌లో కనిపిస్తున్నాయని చెప్పారు. ఇదే సందర్భంగా ఎరికా, వాన్స్ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. దీంతో ఇక సోషల్ మీడియాలో ఊహాగానాలు చెలరేగాయి.

రాజకీయ కోణం

ఈ అంశం వెనుక ఓ రాజకీయ కోణం కూడా ఉంది. ట్రంప్‌కు, వాన్స్‌కు అమెరికాలో ప్రస్తుతం శ్వేతజాతీయవాదుల మద్దతు బలంగా ఉంది. వాన్స్ కూడా వారిని సమర్థిస్తూ మాట్లాడుతుంటారు. అయితే, ఆయన భార్య వేరే దేశానికి చెందిన వ్యక్తి కావటం, ఆమె మతం కూడా వేరు కావటంపై కొంతకాలంగా ఈ శ్వేతజాతీయులు గుర్రుగా ఉన్నారు. ఇతర దేశీయులు, ఇతర మతస్థులు ముఖ్యంగా శ్వేతజాతీయేతరులు అమెరికాలో ఉండటం అంటే.. అమెరికన్ల అవకాశాల్ని కొల్లగొట్టటమేనని వీరి వాదన. అమెరికా, యూరప్ దేశాల్లో ప్రణాళికబద్ధంగా ఇది జరుగుతోందని.. శ్వేతజాతీయుల స్థానాన్ని వీరు భర్తీ చేస్తున్నారంటూ 'గ్రేట్ రిప్లేస్‌మెంట్ థియరీ' అనే ఓ సిద్ధాంతాన్ని కూడా ప్రచారంలో పెట్టారు. ఏకంగా ఉపాధ్యక్షుడి భార్యే శ్వేతజాతీయేతర వ్యక్తి కావటం చూసి వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే, శ్వేతజాతీయతకు మద్దతుగా వాన్స్ మాట్లాడటాన్ని కూడా వీరు వ్యతిరేకిస్తున్నారు. 'భారతీయురాలు భార్యగా ఉన్న వాన్స్‌కు శ్వేతజాతికి మద్దతుగా మాట్లాడే హక్కు లేదు' అంటూ నిక్ ఫ్యూంటెస్ అనే ఓ ప్రముఖ జాత్యంహకారి గత ఏడాది నుంచి మాటల దాడి చేస్తున్నాడు. అనేక మంది అతనికి వత్తాసు పలుకుతున్నారు. మరోవైపు, అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టటానికి వీల్లేదు. దీంతో ట్రంప్ 2028లో దిగిపోయాక.. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా తాను పోటీ పడాలని జేడీ వాన్స్ భావిస్తున్నారు. అయితే, భార్య ఉష జాతీయత కారణంగా తనకు శ్వేతజాతీయుల మద్దతు లభించదేమోనన్న సందేహాలు వాన్స్‌కు ఉన్నాయని.. అందుకే ఆమె నుంచి విడిపోయే అవకాశాలు ఉన్నాయని కొందరి విశ్లేషణ. దీనికి తాజాగా ఎరికా కిర్క్ మాటలు, వాన్స్‌తో ఆమె ఆలింగనం మరింత ఆజ్యం పోశాయి. జేడీ వాన్స్, ఉష ఇక విడిపోవటమే తరువాయని, కొన్ని నెలల్లోనే ఇది జరుగుతుందని అంటున్నారు. ఉషకు త్వరలోనే విడాకులిచ్చి ఎరికాను వాన్స్ వచ్చే ఏడాది చివరికి పెళ్లాడుతారంటూ న్యూయార్క్ టైమ్స్‌కు చెందిన షానన్ వాట్స్ పేర్కొన్నారు. పదవిలో ఉండగానే విడాకులు తీసుకునే తొలి ఉపాధ్యక్షుడిగా వాన్స్ నిలుస్తారంటూ ట్రాన్స్‌జెండర్ కార్యకర్త అరి డ్రెనెన్ ట్వీట్ చేశారు.



ఎరికాను ఆలింగనం చేసుకుంటున్న వాన్స్(ఫైల్)




ఎరికా

మతస్వేచ్ఛ ఉండాలి: హిందూ అమెరికన్ ఫౌండేషన్

ఈ అంశంపై 'హిందూ అమెరికన్ ఫౌండేషన్' స్పందిస్తూ.. క్రైస్తవంతోపాటు హిందూమతం గురించి కూడా తెలుసుకోవాలని వాన్స్‌కు సూచించింది. హిందువులకు తమ మతాన్ని ఆచరించే హక్కు ఉంటుందన్న అంశాన్ని గుర్తించి మద్దతివ్వాలని కోరింది. వాన్స్ మద్దతుదారులు మతస్వేచ్ఛకు తీవ్ర వ్యతిరేకంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. 'మీ మద్దతుదారుల్లో కొందరు మతస్వేచ్ఛను విశ్వసించటం లేదు. కానీ, అమెరికాకు పునాదిగా ఉన్న భావనల్లో మతస్వేచ్ఛ కూడా ఒకటి. అది హిందువులకూ వర్తిస్తుంది' అని పేర్కొంది.

దేశానికి త్వరలో మావోయిస్టు హింస నుంచి విముక్తి



» ఛత్తీస్‌గఢ్ రజత్ మహోత్సవ్‌లో ప్రధాని మోదీ

రాయ్‌పూర్, నవంబరు 1: దేశం, ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల హింస నుంచి విముక్తి పొందే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గత 11 ఏళ్లలో 125 నుంచి మూడుకు పరిమితం అయ్యిందని ఆయన పేర్కొన్నారు. నవ రాయ్‌పూర్‌లో ఛత్తీ స్‌గఢ్ రాష్ట్రం ఏర్పడి 25 ఏళ్లు అయిన సందర్భంగా శనివారం నిర్వహించిన 'ఛత్తీస్‌గఢ్ రజత్ మహోత్సవ్'లో ఆయన మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా మావోయిస్టుల హింసతో నలిగిపోయిన ఈ రాష్ట్రం నేడు దాన్నుంచి విముక్తి చెందడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు. మావోయిస్టు సిద్ధాంతం గిరిజన ప్రాంతాల్లో కనీస అవసరాలు కూడా తీరకుండా చేసిందన్నారు. ఏళ్లుగా గిరిజన గ్రామాలకు రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. "ఆఖరికి ఉన్నవాటిని కూడా బాంబులతో పేల్చివేశారు.. వైద్యులను, ఉపాధ్యాయులను చంపారు.. మరోవైపు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన వారు తాము ఏసీ గదుల్లో ఉంటూ.. మిమ్మల్ని పట్టించుకోలేదు." అని ప్రధాని విమర్శించారు. కొద్ది నెలలుగా రూ.లక్షలు, కోట్ల రివార్డులు ఉన్నవారు సహా పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. వారు నేడు భారత రాజ్యాంగాన్ని ఆమోదించి శాంతి బాట పట్టారని ఆయన తెలిపారు.

వైద్య విద్యకు చలో జార్జియా!

» క్యూ కడుతున్న భారతీయ విద్యార్థులు

» రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం

న్యూఢిల్లీ, నవంబరు 1: రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో విదేశాల్లో వైద్య విద్యను చదవాలనుకొనే భారతీయ విద్యార్థులు ఇప్పుడు జార్జియాకు క్యూ కడుతున్నారు. ఆర్బీఐకి చెందిన లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) డేటా ప్రకారం.. జార్జియాలో ట్యూషన్ ఫీజులు, తదితరాలకు 2024-25లో భారతీయులు 50.25 మిలియన్ డాలర్లు వెచ్చించారు. 2018-19లో చేసిన 10.33 మిలియన్ డాలర్ల వ్యయంతో పోలిస్తే ఇది దాదాపు ఐదురెట్లు ఎక్కువ. ఇక ఉక్రెయిన్‌లో భారతీయుల చెల్లింపులు 2018-19లో 14.80 మిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 2.40 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. యుద్ధానికి ముందు 2020-21, 2021-22 సంవత్సరాల్లో భారతీయ విద్యార్థుల టాప్-10 గమ్యస్థానాల్లో ఉక్రెయిన్ కూడా ఒకటి. అప్పట్లో వారు ఈ దేశంలో 39.12 మిలియన్ డాలర్ల వరకూ ఫీజుల రూపంలో చెల్లించారు. 2022 ఫిబ్రవరిలో రష్యా దాడి అనంతరం 2022-23లో ఇది 10.6 మిలియన్ డాలర్లకు తగ్గింది. అదే ఏడాది విదేశాల్లో విద్య కోసం భారతీయులు డబ్బులు పంపిన టాప్-15 దేశాల జాబితాలో జార్జియా చోటు దక్కించుకుంది. మరోవైపు ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్న దేశాల జాబితాలో రష్యా ర్యాంకు కూడా మెరుగుపడుతోంది. 2018-19లో 23వ స్థానంలో ఉన్న రష్యా 2024-25నాటికి 11వ స్థానానికి చేరుకుంది.

జార్జియా ఎందుకంటే..

యూరప్‌కు దగ్గరగా ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే ట్యూషన్ ఫీజులు, జీవన వ్యయాలు తక్కువగా ఉండటం, సరళమైన నివాస చట్టాలు, సులభ వీసా ప్రక్రియ, ఉపాధి అవకాశాలు, యూరోపియన్ ప్రమాణాలతో కూడిన వైద్య విద్య తదితర కారణాలతో భారతీయ విద్యార్థులకు జార్జియా ఆకర్షణీయ ఎంపికగా మారుతోంది.

అమెరికాలో పౌరసత్వ రుజువుగా బర్త్ సరిఫికెట్ ఒక్కటే సరిపోదు!

వాషింగ్టన్, నవంబరు 1: అమెరికాలో జన్మతః పౌరసత్వం రద్దుపై అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమల్లోకి వస్తే.. సోషల్ సెక్యూరిటీ నంబర్ (ఎస్ఎస్ఎన్) దరఖాస్తులకు జనన ధ్రువీకరణ పత్రాలను రుజువుగా పరిగణించరు. దరఖాస్తుదారు తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా అమెరికా పౌరులేనని గానీ, బిడ్డ జన్మించిన సమయంలో వారు చట్టబద్ధమైన ఇమిగ్రేషన్ హోదా కలిగి ఉన్నారని గానీ ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేసే లక్ష్యంతో జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని బోస్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లోని అప్పీలు కోర్టులు తీర్పు చెప్పాయి. దేశవ్యాప్తంగా ఈ ఆదేశాల అమలును నిలిపివేశాయి. దీంతో ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



అంకతి రాజు



రాఘవేంద్రరావు

డీఆర్‌డీఎల్ డైరెక్టర్‌గా అంకతి రాజు బాధ్యతల స్వీకరణ

అల్వాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా విశిష్ట శాస్త్రవేత్త అంకతి రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ, ఐఐటీ ముంబై నుంచి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పట్టాలను పొందారు. రక్షణ పరిశోధనలో చేసిన కృషికి అంకతి రాజుకు డీఆర్‌డీవో అగ్ని అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ సెల్ఫ్ రిలియన్స్, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. మరోవైపు.. హైదరాబాద్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ (ఏఎస్ఎల్) డైరెక్టర్‌గా డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాఘవేంద్రరావు ఎన్ఐటీ భోపాల్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్, ఎంఐటీ చెన్నై నుంచి ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టరేట్ పీహెచ్‌డీ పొందారు.

ఇస్రో 'భారీ' ప్రయోగం

» 4,410 కిలోల అత్యంత బరువైన

సీఎంఎస్-3 ఉపగ్రహం నేడు కక్ష్యలోకి..

సూళ్లూరుపేట/తిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) భారీ ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. 4,410కిలోల అత్యంత బరువైన సీఎంఎస్-3 (సమాచార) ఉపగ్రహాన్ని ఆదివారం కక్ష్యలోకి చేర్చనుంది. భారత భూభాగం నుంచి గతంలో ఎన్నడూ ఇంత బరువైన ఉపగ్రహాన్ని పంపిన చరిత్ర లేదు. దీంతో 'బాహుబలి'గా పిలిచే అత్యంత శక్తివంతమైన రాకెట్ ఎల్‌వీఎమ్ 3-ఎమ్ 5ను ఇస్రో సిద్ధం చేసింది. ఉపగ్రహాన్ని 'బాహుబలి' ద్వారా కక్ష్యలోకి చేర్చే మిషన్ ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలవుతుంది. రాకెట్ భూమి నుంచి నింగిలోకి ఎగిరిన 16.09 నిమిషాలకు జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి (జీటీవో) ఉపగ్రహాన్ని ప్రవేశపెడుతుంది. మూడు దశల్లో ఇది సాగుతుంది. సైనిక సమాచార అవసరాల కోసం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు. ఈ ప్రక్రియ కు సంబంధించిన కౌంట్‌డౌన్ తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండో ప్రయోగ వేదిక వద్ద శనివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలైంది. 24 గంటలపాటు ఇది కొనసాగుతుంది. రాకెట్‌కు ఇంధనాన్ని నింపే ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేసిన శాస్త్రవేత్తలు, అన్ని భాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇస్రో చైర్మన్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ కౌంట్‌డౌన్ ప్రక్రియను పరిశీలించారు. లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) శనివారం మరోసారి సమావేశమై, ఈ ప్రయోగానికి తన ఆమోదం తెలిపింది.

తిరుమల, చెంగాళమ్మ ఆలయాల్లో పూజలు

ఎల్‌వీఎమ్ 3-ఎమ్ 5 ప్రయోగం భారత సమాచార రంగంలో కీలక ఘట్టంగా నిలవనున్నదని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన, ఉపగ్రహ నమూనాను శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు జరిపించారు. అనంతరం సూళ్లరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

బాహుబలి.. విశేషాలు..

'బాహుబలి' ఎత్తు 43.5 మీటర్లు. ఇది 4,000 కిలోల వరకు ఉన్న ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ వరకు (జీటీవో), 8,000 కిలోల వరకు ఉన్న ఉపగ్రహాన్ని లో ఎర్త్ ఆర్బిట్ వరకు (ఎల్ఈవో) మోసుకుపోగలదు. 'బాహుబలి' ద్వారా అమలుచేసిన అతిపెద్ద మిషన్లలో ఇది ఐదోవది కానుంది. ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-3 మిషన్ ఇందులో ఒకటి. నిజానికి, బాగా బరువైన ఉపగ్రహాన్ని ఇస్రో గతంలోనూ కక్ష్యలోకి చేర్చింది. అయితే, వాటిని భారత భూభాగం నుంచి కాకుండా.. విదేశాల నుంచి చేపట్టింది. ఇస్రో 2018లో ఫ్రెంచి గయానానుంచి 5,854 కిలోల బరువు ఉన్న జీశాట్-11 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. కాగా, సీఎంఎస్-3 అనేది బహుళ సమాచార ఉపగ్రహం. భారత డిజిటల్, బ్రాడ్‌కాస్ట్ వ్యవస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన ఈ శాటిలైట్‌ను భూమిమీదా, సముద్రంలోనూ సేవలు అందించేలా సిద్ధంచేశారు. సమాచార సేవలను విస్తరిస్తూ, విపత్తు నిర్వహణ వ్యవస్థలకు మద్దతుగా భారత భూభాగంతోపాటు సమీప సముద్ర ప్రాంతాల్లోని పరిస్థితిని కూడా ఇది విశ్లేషించగలదు.



బిహార్‌లో అధికారం ఎన్‌డీఏదే

» సీఎంగా తేజస్వీ వైపు మొగ్గు

» ఎన్డీఏకు 120-140 సీట్లు

» 70-81 సీట్లతో అతిపెద్ద పార్టీగా బీజేపీ

» ఒపీనియన్ పోల్ అంచనా

న్యూఢిల్లీ, నవంబరు 1: బిహార్‌లో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారంలోకి రానుందని ఓపీనియన్ పోల్ సర్వేలో వెల్లడయింది. జేవీసీ పోల్ సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలను శనివారం ప్రకటించింది. మొత్తం 243 అసెంబీ స్థానాలు ఉండగా ఎన్‌డీఏకు 120-140 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అత్యధికంగా బీజేపీ 70-81 సీట్లు సంపాదించి అతి పెద్ద పార్టీగా నిలుస్తుందని తెలిపింది. జేడీ(యూ)కు 42-48కి సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహాకూటమిలోని ఆర్జేడీకి 69-78, కాంగ్రెస్‌కు 9, సీపీఐఎంఎల్‌కు 12 వరకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఆధ్వర్యంలోని జన్ సురాజ్ పార్టీ కేవలం ఒక్క సీటును మాత్రమే దక్కించుకునే సూచనలు ఉన్నాయి. సీఎం అభ్యర్థి విషయానికొస్తే ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అయితే బాగుంటుందని అత్యధికంగా 33% మంది అభిప్రాయపడ్డారు. నీతీశ్ కొనసాగాలని 29% మంది కోరుకున్నారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి అయిన బీజేపీ నేత సామ్రాట్ చౌదరివైపు కేవలం 9% మందే మొగ్గు చూపారు. మొత్తంగా ఎన్‌డీఏకు 41-43%, మహాకూటమికి 39-41% ఓట్లు వచ్చే అవకాశం ఉంది.

20 ఏళ్లుగా మీ కోసమే సేవ

మరో అవకాశం ఇస్తే.. మరింత అభివృద్ధి

సీఎం నితీశ్ వీడియో సందేశం



పాట్నా, నవంబరు 1: బిహార్‌లో మరో ఐదు రోజుల్లో తొలి దశ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితీశ్ కుమార్ శనివారం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మూడు నిమిషాల వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్నానని, నిజాయతీగా, కష్టపడి పనిచేశానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించి మరో అవకాశం ఇవ్వాలని, బిహార్‌ను టాప్ రాష్ట్రాల సరసన చేరేలా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా, ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కూడా ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తేల్చిచెప్పారు. పాట్నాలో ఓ జాతీయ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని కావాలంటే తాను రాతపూర్వకంగా కూడా చెప్తానన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.